ప్రతిపక్షం

www.prathipaksham.in

శనివారం 14.02.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 325 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

పాక్‌తో మ్యాచ్‌లో అభిషేక్ ఆడే అవకాశం 10

తెలంగాణ రాజకీయాల్లో కొత్త శక్తి

రాష్ట్రంలో జాగృతి 'సింహ'గర్జన

- మున్సిపల్ ఎన్నికల్లో అనూహ్య విజయం
- కవిత నేతృత్వంలో వడ్డేపల్లి చైర్మన్ పీఠం కైవసం
- రాష్ట్ర వ్యాప్తంగా 33 స్థానాల్లో విజయం

చిటుకుల మైసారెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 13: తెలంగాణ రాజకీయాల్లో కొత్త పవర్ సెంటర్‌గా తెలంగాణ జాగృతి ఎంట్రీ ఇచ్చింది. చిన్న మొలకలా మొదలై మహా వృక్షంలా ఎదిగేలా మున్సిపల్ ఎన్నికల్లో తన సత్తా చాటింది. రాష్ట్రవ్యాప్తంగా 180 వార్డుల్లో పోటీ చేసి, రామగుండం కార్పొరేషన్ లో 6, మంచిర్యాల కార్పొరేషన్లో 2, కరీంనగర్ కార్పొరేషన్లో 2, నల్గొండ కార్పొరేషన్లో 4, పెద్దపల్లి మున్సిపాలిటీలో 5, సుల్తానాబాద్, మంథని, జమ్మికుంట, నారాయణపేట, మిర్యాలగూడ, దుబ్బాక మున్సిపాలిటీల్లో ఒక్కో వార్డులో విజయం సాధించిన జాగృతి అభ్యర్థులు వడ్డేపల్లి మున్సిపాలిటీ లో 8 వార్డులు గెలిచి చైర్మన్ పీఠం దక్కించుకున్నారు. మొత్తం 33 స్థానాల్లో అనూహ్య విజయాన్ని నమోదు చేశారు. వడ్డేపల్లి మున్సిపాలిటీలో 10 వార్డులకు గాను 8 వార్డులు గెలుచుకుని చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వడ్డేపల్లి శ్రీనివాస్ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇంటికి వచ్చి కండువా కప్పుకొని బీఫామ్ తీసుకుని పోటీ చేసిన విషయం స్థానికంగా ఆసక్తిని రేకెత్తించింది. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున జాగృతి మద్దతుదారులు పోటీ చేసి సాధించిన ఈ విజయాలు రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులకు నాంది పలికే సూచనలు కనిపిస్తున్నాయి. తెలంగాణ అస్తిత్వం, ప్రజల ఆత్మగౌరవం, అమరుల త్యాగాల స్ఫూర్తితో ముందుకు సాగుతున్న జాగృతి జెండా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఎగిరింది. భవిష్యత్ తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయం

...:: మిగతా 2లో

'పుర' పోరులో హస్తం హవా

కాంగ్రెస్ ఖాతాలో **79** మున్సిపాలిటీలు

25 చోట్ల బీఆర్ఎస్ విజయం.. 'వడ్డేపల్లి' దక్కించుకున్న 'జాగృతి' అభ్యర్థులు

- రాష్ట్రంలో 38 మున్సిపాలిటీల్లో హంగ్ ఫలితాలు
- నాలుగు కార్పొరేషన్లలో కాంగ్రెస్‌గెలుపు
- కొత్తగూడెంలో మెజిక్‌ఫీగర్‌దాటిన సీపీఐ
- కరీంనగర్‌కార్పొరేషన్‌బీజేపీ వశం
- నిజామాబాద్లో హంగ్ ఫలితాలు
- దక్కించుకునేందుకు కాంగ్రెస్, ఎంఐఎం కసరత్తు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 13: పురపోరులో కాంగ్రెస్ హవా కొనసాగింది. పట్టణ ప్రజలు కాంగ్రెస్ కు పట్టం కట్టారు. దాదాపు మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ఇక బీఆర్ఎస్ పార్టీ రెండో స్థానానికి పరిమితమైంది. కాంగ్రెస్‌పార్టీ 79 మున్సిపాలిటీలను తన ఖాతాలో వేసుకుంది. బీఆర్ఎస్ 25 మున్సిపాలిటీలను గెలుచుకుంది. బీజేపీ 4, ఇతరులు 7, ఫార్వర్డ్‌బ్లాక్1 మున్సిపాలిటీని సొంతం చేసుకున్నాయి. ఇప్పటివరకు 37 మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడింది. రాష్ట్రవ్యాప్తంగా 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరగగా, ఇందులో సైతం కాంగ్రెస్ తన హవా కొనసాగించింది. కాంగ్రెస్‌పార్టీ 4, బీజేపీ 1 కార్పొరేషన్ను కైవసం చేసుకున్నాయి. మహబూబ్‌నగర్, మంచిర్యాల, రామగుండం, నల్గొండ కార్పొరేషన్లు కాంగ్రెస్ హస్తగతం అయ్యాయి. కరీంనగర్‌కార్పొరేషన్‌ను బీజేపీ దక్కించుకుంది. కొత్తగూడెం కార్పొరేషన్లో సీపీఐ మేజిక్ ఫీగర్‌దాటింది. ఇక్కడ 60

...:: మిగతా 2లో

బంగ్లాదేశ్‌లో బీఎన్పీ విజయఢంకా

బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో ఖలిదా జియా కుమారుడు తారిఖ్ రెహ్మాన్ పార్టీ బీఎన్పీ విజయఢంకా మోగించింది. బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్ పీ) కూటమి 211 నియోజకవర్గాల్లో విజయం సాధించి ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకొచ్చింది.

9

తారిఖ్ రహ్మాన్‌కు ప్రధాని ఫోన్

బంగ్లాదేశ్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన బీఎన్‌పీ నేత తారిఖ్ రహ్మాన్‌తో భారత ప్రధాని నరేంద్ర మోడీ ఫోన్‌లో మాట్లాడారు. పార్లమెంటరీ ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యంలో రహ్మాన్ ను అభినందించారు.

9

అభివృద్ధి, సంక్షేమానికి పట్టణ ప్రజలు పెద్దపీట వేశారు

- బీఆర్ఎస్, బీజేపీ కట్టు కథలను ప్రజలు నమ్మలేదు
- ఈ తీర్పుతో ప్రజా ప్రభుత్వం బాధ్యత మరింత పెరిగింది
- అత్యున్నత ప్రమాణాలతో పాలనను అందిస్తాం
- ప్రతిపక్షాలు ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలు మానుకోవాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 13: అభివృద్ధి, సంక్షేమానికి పట్టణ ప్రజలు పెద్దపీట వేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కట్టు కథలను ప్రజలు నమ్మలేదని అన్నారు. పట్టణ ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పుతో ప్రజా ప్రభుత్వం బాధ్యత మరింత పెరిగిందని, అత్యున్నత ప్రమాణాలతో పాలనను అందిస్తామని అన్నారు. శుక్రవారం గాంధీభవన్లో ఆయన విలేఖరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్ ఎన్నికల్లో 90 నుంచి 94 మున్సిపాలిటీలు కాంగ్రెస్ ఖాతాలో జమ అవుతాయని స్పష్టం చేశారు. ఏడు కార్పొరేషన్లకు ఎన్నికలు జరగగా ఐదు కార్పొరేషన్లలో కాంగ్రెస్ తిరుగులేని మెజారిటీ సాధించిందని అన్నారు. మరో రెండు చోట్ల హంగ్ ఏర్పడింది అన్నారు. అక్కడ బీజేపీ, కాంగ్రెస్, ఇండిపెండెంట్ లు ఉన్నారు, పూర్తి వివరాలు వచ్చిన తర్వాత ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది అన్నారు. గత రెండు దశాబ్దాల కాలంలో కాంగ్రెస్ పార్టీకి ఇంత పెద్ద ఎత్తున మున్సిపల్ స్థానాలు రావడం సంతోషం కలిగించే విషయం అన్నారు. అభివృద్ధి, సంక్షేమం విశ్వసనీయతకు రాష్ట్ర ప్రజలు పెద్దపీటవేశారని ఈ ఫలితాలు స్పష్టం

...:: మిగతా 2లో

ప్రజా పాలన ఫలితమే ఈ విజయం

- లక్షలాది కాంగ్రెస్ కార్యకర్తల శ్రమ ఫలితమిది
- రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు
- 'ఎక్స్'లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 13: తెలంగాణ మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని కట్టబెట్టిన రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం లక్షలాది కాంగ్రెస్ కార్యకర్తల శ్రమ ఫలితమని, పార్టీ పట్ల వారికి ఉన్న అనంతమైన అభిమానానికి నిదర్శనమని కొనియాడారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు.

ప్రతి కార్యకర్తకు ఈ విజయం అంకితం

భుజాలు కాయలు కాసేలా పార్టీ జెండాను మోసి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లిన ప్రతి కార్యకర్తకు ఈ విజయం అంకితమని సీఎం రేవంత్

...:: మిగతా 2లో

'ఆరావళి'ని తాకడానికీ అనుమతించం

ఆరావళి పర్వతాల్ని తాకడానికి కూడా అనుమతించబోమని భారత సుప్రీం కోర్టు హెచ్చరించింది. ఆరావళి పర్వతాల పరిధిలో జూ సఫారి ఏర్పాటు చేయాలనే హర్యానా ప్రభుత్వ నిర్ణయాన్ని కోర్టు వ్యతిరేకించింది.

9

అధికారం అడ్డుపెట్టుకొని గెలిచారు

- ప్రజల మనసు గెలుచుకోవడంలో కాంగ్రెస్ విఫలం
- డబ్బు, మద్యం విచ్చలవిడిగా పంచారు
- బీజేపీ, కాంగ్రెస్‌ను ఎదుర్కొంటాం
- సైనికుల్లా పోరాటం చేసిన శ్రేణులకు ధన్యవాదాలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 13: మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వీరోచితంగా పోరాడారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రశంసించారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. అధికార యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ గెలిచిందే తప్ప నిజమైన విజయం కాదన్నారు. డబ్బు, మద్యం విచ్చలవిడిగా పంచిందని ఆరోపించారు. ప్రజల మనసు గెలుచుకోవడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. 2,581 మున్సిపల్ వార్డులలో ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ పార్టీ 750 వార్డులు గెలిచింది. ఈ ఎన్నికల్లో కూడా 30 శాతానికి పైగా సీట్లు బీఆర్ఎస్ పార్టీకి వచ్చాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం 40 శాతానికి పైగా ఓటు బ్యాంకు సాధించామని గుర్తు చేశారు. దాదాపు 35 స్థానాలకు పైగా హంగ్ ఏర్పడిందని, 16 స్థానాలకు పైగా బీఆర్ఎస్ గెలిచింది. ఇక వాళ్లు గెలిచింది ఎన్ని అని కేటీఆర్ అన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ఎదుర్కొంటామన్నారు. బీజేపీని నిలువరించేందుకు సింగరేణి ప్రాంతంలో సీపీఐతో కలిసి

...:: మిగతా 2లో

ఓటమి భయంతో కాంగ్రెస్ అరాచకాలు

- మక్తల్‌లో బీజేపీ అభ్యర్థిది కాంగ్రెస్ ప్రభుత్వ హత్య
- కాంగ్రెస్ ఎమ్మెల్యేల డైరెక్షన్లతో పోలీసులు పనిచేశారు
- రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలపై దాడులు
- ఈ ఘటనలపై స్టేట్ ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేశాం
- అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు
- తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 13: రాష్ట్రంలో ఓటమి భయంతోనే కాంగ్రెస్ బీజేపీ కార్యకర్తలపై బెదిరింపులకు, అధికార దుర్వినియోగానికి, ప్రచార సమయంలో అనేక అరాచకాలకు పాల్పడిందని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కును వినియోగించిన ఓటర్లందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో అహర్నిశలు శ్రమించిన బీజేపీ

...:: మిగతా 2లో



...:: 3లో

సంగారెడ్డిలో జగ్గారెడ్డిదే పై'చేయి'

- జగ్గారెడ్డి మాటను విశ్వసించిన ప్రజలు
- సంగారెడ్డి, సదాశివపేట కాంగ్రెస్‌కైవసం
- ప్రజలకు నిర్మలా జగ్గారెడ్డి కృతజ్ఞతలు

మణిపూర్‌లో మరోసారి చెలరేగిన హింస

ఆందోళనలతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో మరోసారి హింస చెలరేగింది. గురువారం ఉఖ్రుల్ జిల్లాలోని, లిటన్ ఏరియాలో ఆందోళనకారులు రెండు ఇండ్లను తగలబెట్టారు.

9

రాజకీయం

తెలంగాణ రాజకీయాల్లో కొత్త శక్తి

మొదటిపేజీ తరువాయి

ప్రారంభమైందనే భావన వ్యక్తమవుతోంది. "ఇది చిన్న విజయం కావచ్చు..కానీ రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో ఇది పెద్ద తుఫాన్‌కు నాంది కావచ్చు" అని జాగృతి వర్గాలు పేర్కొంటున్నాయి.

వడ్డేపల్లి మున్సిపాలిటీ కైవసం

మున్సిపల్ ఎన్నికల్లో వడ్డేపల్లి మున్సిపాలిటీ ఫలితాలు అందరి దృష్టిని ఆకర్శించాయి. వడ్డేపల్లి మున్సిపాలిటీలో మొత్తం 10 వార్డులకు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన కవిత మద్దతుదారులు 8 స్థానాలను గెలుచుకుని మున్సిపాలిటీ కైవసం చేసుకున్నారు. మిగిలిన రెండు స్థానాల్లో కాంగ్రెస్ 1, బీఆర్ఎస్‌కు 1 స్థాన్ దక్కింది. ఈ విజయంతో తెలంగాణ జాగృతి అనూహ్యంగా ఒక కొత్త తరంగంలా వచ్చిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కవిత మద్దతుదారులు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ 'సింహం' గుర్తుతో పోటీ చేసి గెలిచారు. ఇది రాష్ట్ర రాజకీయాలలో మరో పార్టీ ఆవిర్భావానికి నాంది అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర రాజకీయాలలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సాధించి ఫైర్‌బ్రాండ్‌గా నిలిచిన కవిత స్థానిక ప్రజలకు చేసిన సేవా కార్యక్రమాలు, తెలంగాణ జాగృతి చూపిన చైతన్యం ఈ విజయానికి ప్రధాన కారణంగా నిలిచాయని అభిప్రాయాలు వెలువెత్తుతున్నాయి. వడ్డేపల్లిలో ఫలితాలు వెలువడగానే జాగృతి కార్యకర్తలు బాణాసంచాలు కాల్చి, స్వీట్లు పంచుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ ఫలితం కవిత రాజకీయ భవిష్యత్తుకు బలమైన సూచనగా భావిస్తున్నారు.

ప్రజా పాలన ఫలితమే ఈ విజయం

మొదటిపేజీ తరువాయి

అన్నారు. రాష్ట్రంలో రెండేళ్ల ప్రజాపాలన, పేద మధ్య తరగతి ప్రజల సంక్షేమం, ప్రపంచ స్థాయి ప్రణాళికలు, కార్యాచరణతో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఈ తీర్పు ద్వారా తమ సంపూర్ణ ఆమోదం తెలిపారని అన్నారు. ఈ విజయం తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు రేవంత్. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక పాలనకు పునరంకితం అవుతామన్నారు. భవిష్యత్‌లో ప్రతి మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్‌ను గొప్పగా అభివృద్ధి చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పట్టణ ప్రజలు పెద్దపీట వేశారు

మొదటిపేజీ తరువాయి

చేస్తున్నాయని, రాష్ట్ర ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని ఈ ఫలితాలతో తేటతెల్లమైందని డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్, బీజేపీ నేతలు ప్రతిరోజు గాలి కబుర్లు చెబుతూ, కట్టు కథలు వినిపిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పైన, కాంగ్రెస్ పార్టీ పైన చేస్తున్న విమర్శలను గమనించి రాష్ట్ర ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో సరైన తీర్పును ఇచ్చారని అన్నారు. ప్రజల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత ఈ ఫలితాలతో స్పష్టమైందని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో, ఆ తర్వాత కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఆ తరువాత పంచాయతీ ఎన్నికల్లో వరుసగా ప్రజా ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు పట్టం కట్టారని, ప్రతిపక్షాలు ఈ విషయాన్ని గమనంలో పెట్టుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. ప్రసారమాధ్యమాల్లో కనిపించాలని, ప్రజల్లో ఉనికిని కాపాడుకోవాలని ప్రతిపక్షాలు కట్టు కథలు అల్లడం, తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలనీ డిప్యూటీ సీఎం సూచించారు. ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని, రాష్ట్రంలో ప్రతిపక్షాలు ఉండాలని ప్రజాస్వామ్య వాదిగా తాను బలంగా కోరుకుంటానని డిప్యూటీ సీఎం తెలిపారు. సంపూర్ణ విజయం కోసం శ్రమించిన పార్టీ నేతలు, కార్యకర్తలకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఓటమి భయంతో కాంగ్రెస్ అరాచకాలు

మొదటిపేజీ తరువాయి

కార్యకర్తలు, నాయకులు, శ్రేణులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఖచ్చితంగా బీజేపీ అనేక కీలక స్థానాల్లో విజయాన్ని సాధిస్తుందని విశ్వసిస్తున్నామని తెలిపారు. మక్తల్‌లో కాంగ్రెస్ పార్టీ ఓటమి భయంతో తన ఆధిపత్యాన్ని ప్రదర్శించుకునే ప్రయత్నంలో బీజేపీ కార్యకర్తలపై బెదిరింపులకు, అధికార దుర్వినియోగానికి, ప్రచార సమయంలో అనేక అరాచకాలకు పాల్పడింది. మక్తల్‌లో బీజేపీ అభ్యర్థి మహదేవప్ప మరణం ఆత్మహత్య కాదు, కాంగ్రెస్ ప్రభుత్వ హత్యగానే మేం భావిస్తున్నామని అన్నారు. మంచిర్యాలలో కూడా బీజేపీ కార్యకర్తలు, నాయకులను బెదిరింపులతో వేధించడం జరిగిందని, ఇండ్లపై దాడులు చేసిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని, కాంగ్రెస్ ఎమ్మెల్యేల డైరెక్షన్లతో పోలీసులు పనిచేయడం అప్రజస్వామిక చర్య అని ఆయన అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ తమ రాజకీయ పట్టును కోల్పోతామనే భయంతోనే ఈ అరాచకాలకు పాల్పడిందని అన్నారు. పోలింగ్ రోజున కూడా అనేక కేంద్రాల్లో బీజేపీ కార్యకర్తలపై దాడులు చేసి, పోలింగ్ సెంటర్ల వద్ద నుంచి వెళ్లగొట్టే ప్రయత్నాలు జరిగాయని ఆయన విమర్శించారు. అయినప్పటికీ బీజేపీ కార్యకర్తలు వెనుకడుగు వేయకుండా ధైర్యంగా నిలబడ్డారని, ఈ ఘటనలపై స్టేట్ ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పోలింగ్ బూత్‌ల వద్ద బహిరంగంగా, పోలీసుల సమక్షంలోనే విచ్చలవిడిగా డబ్బుల పంపిణీ చేసిందని ఆరోపించారు. దీనిపై పలు మార్లు ఫిర్యాదు చేసినప్పటికీ రాష్ట్ర ఎన్నికల కమిషన్, పోలీసుల నుంచి సరైన స్పందన రాలేదని అన్నారు. రాష్ట్రంలో స్టేట్ ఎలక్షన్ కమిషన్ నిజంగా పనిచేస్తుందా అనే అనుమానం కలుగుతోందని అన్నారు. ఒకవైపు ధన ప్రలోభాలు, మరోవైపు పోలీసు ఒత్తిళ్లు, నాయకుల బెదిరింపులు ఇవన్నింటిని భరించి కూడా బీజేపీ కార్యకర్తలు పార్టీ కోసం అంకితభావంతో కృషి చేశారని రాంచందర్ రావు అన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని బీజేపీ కార్యకర్తలపై దాడులు చేస్తే సహించబోమని, బీజేపీ కార్యకర్తలు ప్రతిఘటించి, ఎదురుతిరిగితే పరిస్థితులు దారుణంగా ఉంటాయని అన్నారు.

అశాస్త్రీయంగా జీహెచ్ఎంసీ విభజన

కాంగ్రెస్ ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ను అశాస్త్రీయంగా మూడు భాగాలుగా విభజించిందని అన్నారు. తమ రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం.. ఒక కార్పొరేషన్‌ను దారుస్సలాం కేంద్రంగా ఉన్న మజ్లిస్ పార్టీకి కట్టబెట్టే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. కోర్ హైదరాబాద్‌ను మజ్లిస్‌కు తాకట్టుపెట్టే విధంగా జీహెచ్ఎంసీని విభజించి, జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్గా విభజించిందని అన్నారు.

కొత్తగూడెంలో మేయర్ పదవిని కైవసం చేసుకుంటాం. ఇప్పటికే కేటీఆర్‌కాల్ చేసి బీఆర్ఎస్‌తరఫున పూర్తి మద్దతు ప్రకటించారు. మాకు ఇండిపెండెంట్ల మద్దతు కూడా ఉంది. ఇప్పటి వరకు కాంగ్రెస్‌తో ఎలాంటి చర్చ చేయలేదు. కొత్తగూడెం మేయర్ పదవి గిరిజనులకే ఇస్తాం.

- సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

'పుర' పోరులో హస్తం హవా

మొదటిపేజీ తరువాయి

వార్డులుండగా అందులో సీపీఐ 28 వార్డుల్లో విజయకేతనం ఎగరవేసింది. ఇక నిజామాబాద్‌లో ఎవరికీ మెజారిటీ రాలేదు. ఇక్కడ 60 వార్డులకు జరిగిన ఎన్నికల్లో 28 వార్డుల్లో బీజేపీ అభ్యర్థులకు విజయం వరించింది. కాంగ్రెస్ 19 వార్డులను కైవసం చేసుకొంది. అయితే ఎంఐఎం 12 వార్డుల్లో గెలుపొందగా, మరో వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపొందారు. ఈ కార్పొరేషన్ మేజిక్ ఫిగర్ దగ్గరలో ఉన్న బీజేపీకి మేయర్ పీటం దక్కకుండా చేసేందుకు కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ఎత్తుగడ వేస్తోంది. మరోపక్క బీఆర్ఎస్ నుంచి గెలిచిన అభ్యర్థిని ఇటు కాంగ్రెస్ పార్టీ, అటు బీజేపీ పార్టీ క్యాంపుకు తరలించేందుకు పొటాపోటీ పడుతున్నాయి. అయితే కాంగ్రెస్ కు మద్దతు తెలుపేందుకు బీఆర్ఎస్ అభ్యర్థి నిర్ణయించినట్లు సమాచారం.

డివిజన్లు, వార్డుల వారీగా..

మొత్తం ఏడు కార్పొరేషన్లలోని మొత్తం 414 డివిజన్లలో కాంగ్రెస్‌కు 191, బీజేపీకు 76, బీఆర్ఎస్ కు 63 దక్కాయి. ఇతరులు 83 స్థానాలను దక్కించుకున్నారు. మున్సిపాలిటీల్లోని 2,581 వార్డులకు గాను, 1,347 చోట్ల కాంగ్రెస్ గెలిచింది. బీఆర్ఎస్‌కు 716, బీజేపీకు 261 వార్డులు దక్కాయి. మజ్లిస్, సీపీఐ, సీపీఎం, స్వతంత్రులు, ఇతరులకు 257 వార్డులు వచ్చాయి. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ.. గద్వాల జిల్లా వడ్డేపల్లి పురపాలికలో 10 స్థానాలకు గాను 8 చోట్ల గెలిచి సంచలనం సృష్టించింది. 116 మున్సిపాలిటీలను గాను 79 స్థానాల్లో పార్టీలకు స్పష్టమైన మెజారిటీ రాగా.. మిగిలిన 37 స్థానాల్లో హంగ్ ఏర్పడింది. ఈ నెల 16న ఏ పార్టీకి ఎన్ని దక్కుతాయనేది తేలనుంది.

అనూహ్య విజయాలు.. ఘటనలు

మెదక్‌జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ 24, 26 వార్డుల నుంచి పోటీ చేసిన భార్యాభర్తలైన కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఖమ్మం జిల్లా మధిర మున్సిపాలిటీలోని 10వ వార్డులో టీడీపీ అభ్యర్థి బోడేపూడి రేవతి జయకేతనం ఎగురవేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి పెదపూడి సుధాకర్‌పై ఆమె విజయం సాధించారు. జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీని ఫార్వర్డ్ బ్లాక్(సింహం గుర్తు) కైవసం చేసుకుంది. నల్గొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీలోని ఒకటో వార్డులో ఊహించని విధంగా

ట్రాన్స్‌జెండర్ గెలుపొందారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన నాగిళ్ల కావేరి సుధాకర్ 102 ఓట్ల మెజార్టీతో విజయ ఢంకా మోగించారు.

చాలా మున్సిపాలిటీల్లో హంగ్...

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో ఏ పార్టీకి మ్యాజిక్ ఫిగర్ రాలేదు. దేవరకద్రలో 12 వార్డులు ఉండగా కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 4, బీజేపీ 1, ఇతరులు 1 గెలుచుకున్నారు. కెసముద్రం మున్సిపాలిటీలోనూ ఏ పార్టీ ఆధిక్యం కనబర్చలేదు. 16 వార్డుల్లో కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 8 గెలుచుకున్నాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్ మున్సిపాలిటీలో మొత్తం 16 వార్డులకు గాను కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 5 చోట్ల విజయం సాధించాయి. బీజేపీ, ఎంఐఎం, స్వతంత్ర అభ్యర్థి ఒక్కో చోట గెలిచారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీలో మ్యాజిక్ ఫిగర్ ఏ పార్టీకి దక్కలేదు. క్యాతనపల్లిలో 22 వార్డులు ఉండగా కాంగ్రెస్ 7, బీఆర్ఎస్ 10, బీజేపీ 1, ఇతరులు 4 గెలుచుకున్నారు. వనపర్తి జిల్లా అమరచింతల మున్సిపాలిటీలోనూ మ్యాజిక్ ఫిగర్‌ను ఏ పార్టీ దాటలేదు. 10 వార్డుల్లో కాంగ్రెస్ 3, బీఆర్ఎస్ 3, బీజేపీ 3, ఇతరులు 1 చోట విజయం సాధించారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో హంగ్ ఏర్పడింది. 20 వార్డుల్లో బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 7, ఇతరులు 4 చోట్ల గెలుపొందారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీలో హంగ్ ఏర్పడింది. 16 వార్డుల్లో కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 8 స్థానాలు దక్కించుకున్నాయి. వికారాబాద్ జిల్లా పరిగి మున్సిపాలిటీలో చెరో 8 వార్డులు గెలిచిన కాంగ్రెస్, బీఆర్ఎస్‌తో పాటు మున్సిపాలిటీలో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. స్వతంత్ర అభ్యర్థి కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య ఘర్షణ చెలరేగింది. కాంగ్రెస్ వెంట వెళ్లేందుకు సిద్ధపడిన 3వ వార్డు స్వతంత్ర అభ్యర్థిని బీఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారు.

సీఎం, డిప్యూటీసీఎం, మంత్రుల ఇలాకాల్లో స్వీప్...

మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు గెలుపొందిన స్థానాల్లో వారు తమ పట్టు నిలుపుకున్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీలను కాంగ్రెస్ దక్కించుకుంది. కోస్గి మున్సిపాలిటీని స్వీప్ చేయగా, కొడంగల్ లో మాత్రం ఒక్క వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపొందారు. మిగతా అన్ని వార్డులలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. అలాగే సీఎం, డిప్యూటీ సీఎం సొంత నియోజకవర్గాల్లో విపక్ష అభ్యర్థులు ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయారు. మధిర మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీతక్క, గడ్డం వివేక్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ, శ్రీహరి తదితర మంత్రుల నియోజకవర్గాల్లోని మున్సిపాలిటీలన్నీ కాంగ్రెస్‌వశం అయ్యాయి.

అధికారం అడ్డుపెట్టుకొని గెలిచారు

పోరాడామన్నారు. బీజేపీ, కాంగ్రెస్ సింగరేణి గొంతు కోస్తున్నాయని మండిపడ్డారు. సింగరేణిలో జరిగిన అవినీతిని ఆధారాలతో బయటపెడితే బీజేపీ సీఎం రేవంత్ రెడ్డిని ఎందుకు కాపాడుతుందో తెలియడం లేదన్నారు. సింగరేణిలో జరుగుతున్న అరాచాకాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. సింగరేణిని కాపాడుకునేందుకు బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలన్నారు. హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీల ఫలితాలు ఎలా ఉంటాయో వేచి చూడాలన్నారు. రేవంత్ రెడ్డికి గుణపాఠం చెప్పే రోజులు త్వరలోనే వస్తాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల్లో సైనికుల్లా పోరాటం చేసిన బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు, సోషల్ మీడియాలో అండగా నిలబడ్డ తమ్ముళ్లకు, చెల్లెలకు, ఓటేసిన ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ఒకే కాలనీలో 6 పార్కులను కాపాడిన హైడ్రా

- మరో చోట 1452 గజాల పార్కును రక్షించిన హైడ్రా
- మొత్తం 3712 గజాల పార్కులకు హైడ్రా ఫెన్సింగ్
- రూ. 37.12 కోట్ల విలువైన భూములను కాపాడిన హైడ్రా

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 13: ప్రాణవాయువును అందించే పార్కుల కబ్జాలను హైడ్రా సీరియస్‌గా పరిగణిస్తోంది. ఫిర్యాదు అందిన వెంటనే రంగంలోకి దిగి వాటిని రక్షిస్తోంది. ఇలా శుక్రవారం ఒకే రోజు..ఒకే కాలనీలో 6 పార్కులను కాపాడి 2260 గజాల స్థలానికి హైడ్రా ఫెన్సింగ్ వేసింది. మరో చోట 1452ల గజాలకు పైగా ఉన్న పార్కు స్థలాన్ని కబ్జాల నుంచి విడిపించింది. మొత్తమ్మీద 3712 గజాల విస్తీర్ణంలో పార్కులు అందుబాటులోకి రావడంతో ఆయా ప్రాంతాల్లో పండగ వాతావరణం నెలకొంది. స్థానికులు పెద్దయెత్తున బయటకు వచ్చి పార్కుల కబ్జాలను తొలగించిన హైడ్రాకు అనుకూలంగా నినాదాలు చేశారు. హైడ్రా ఏర్పాటు చేసిన బోర్డుల ముందు ఫొటోలు దిగారు. భారీ ర్యాలీలు తీసి సంబరాలు చేసుకున్నారు. ఈ పార్కుల విముక్తికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఒకే కాలనీలో 6 పార్కులు..

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం, జీడిమెట్ల విలేజ్, సుభాష్ నగర్ పరిధిలోని భాగ్యలక్ష్మి కాలనీ లే ఔట్‌ను 1968లో వేశారు. 80 ఎకరాలలో 810 ప్లాట్లతో ఈ లే ఔట్ వేసి.. ఇందులో 10 పార్కులను కేటా

యించారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడకు విద్యుత్‌ను అందించేందుకు వేసిన హైటెన్షన్ కరెంటు లైను ఈ లే ఔట్ మీదుగా వెళ్లింది. దీంతో హైటెన్షన్ విద్యుత్ లైన్ల కింద పలు పార్కులను అప్పటి లే ఔట్ వేసిన వారు కేటాయించారు. వేరే లైను ద్వారా పారిశ్రామిక వాడకు విద్యుత్‌ను అందించడంతో భాగ్యలక్ష్మి కాలనీ మీదుగా వెళ్లే హైటెన్షన్ వైర్లను 20 సంవత్సరాల క్రితం తొలగించారు. ఇక అక్కడి నుంచి ఆక్రమణలు జరుగుతున్నాయి. స్థానిక అధికారులకు చెప్పినా ప్రయోజనం లేకపోయిందని అక్కడి నివాసితులు హైడ్రా ప్రజావాణికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు సంబంధిత శాఖలకు చెందిన వారితో హైడ్రా అధికారులు క్షేత్ర స్థాయిలో విచారించారు. పార్కు స్థలాలుగా నిర్ధారించుకున్నారు. శుక్రవారం వరుసగా ఉన్న 6 పార్కుల ఆక్రమణలను తొలగించి హైడ్రా ఫెన్సింగ్ వేశారు. పార్కు స్థలాలుగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో అక్కడి కాలనీవాసులు సంబరాలు చేసుకున్నారు. బోర్డుల ముందు నిలబడి ఫొటోలు దిగారు. హైడ్రాకు అనుకూలంగా నినాదాలు చేశారు. ర్యాలీలు తీసి సంబరాలు చేసుకున్నారు.

గుడిమల్కాపూర్‌లో పార్కు కబ్జాలకు విముక్తి..

హైదరాబాద్ జిల్లా, ఆసిఫ్‌నగర్ మండలం గుడిమల్కాపూర్ గ్రామంలో ఏజీ ఆఫీస్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ పేరిట 10 ఎకరాల్లో 83 ప్లాట్లతో దశాబ్దాల క్రితం లేఔట్ వేశారు. ఇందులో 79, 80, 81 నంబర్లతో ఉన్న ప్లాట్లు గుంతలో ఉన్నాయి. లే ఔట్‌ను రివైజ్ చేసి ఇక్కడ ప్లాట్లున్న వారికి వేరే చోట కేటాయించారు. గుంతలా ఉన్న 1500ల గజాల స్థలాన్ని పార్కుగా పేర్కొన్నారు. ఆ గుంత పూడ్చి పార్కును చేయడంలో జాప్యం అవ్వడంతో అది కబ్జాదారులకు వరంగా మారింది. తర్వాత నిర్మాణాలు పెరగడంతో ఆ గుంతలు పూడ్చడం పెద్ద పనికాలేదు వారికి. ఇక అక్కడి నుంచి ఆ పార్కు స్థలాన్ని కబ్జా చేసి ఒకరు ఇసుక వ్యాపారం చేసుకుంటుండగా.. మరొక వ్యక్తి వాహనాల పార్కింగ్ కోసం వినియోగిస్తున్నారు. మరొకరు కొబ్బరి బొండాల వ్యాపారం చేసుకుంటున్నారు. ఈ పార్కును కాపాడాలని 2018లో జీహెచ్ ఎంసీని అక్కడి నివాసితులు కోరారు. అయినా ప్రయోజనంలేదని వాపోయారు. ఈ అంశాలన్నిటినీ పేర్కొంటూ హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారి ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విచారించి.. పార్కు స్థలంగా హైడ్రా అధికారులు నిర్ధారించుకున్నారు. శుక్రవారం ఆక్రమణదారులను ఖాళీచేయించి సుమారు 1452 గజాల మేర హైడ్రా ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.

సంగారెడ్డిలో జగ్గారెడ్డిదే పై'చేయి'

- జగ్గారెడ్డి మాటను విశ్వసించిన ప్రజలు
- సంగారెడ్డి, సదాశివపేట కాంగ్రెస్‌కైవసం
- ప్రజలకు నిర్మలా జగ్గారెడ్డి కృతజ్ఞతలు

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 13: సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించింది. రెండు మున్సిపాలిటీల్లోనూ చైర్మన్ పీఠాలను దక్కించుకునేందుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్‌ను దాటి పూర్తి ఆధిక్యాన్ని సంపాదించింది. సంగారెడ్డిలో మొత్తం 38 వార్డులకు గాను కాంగ్రెస్ పార్టీ 22 వార్డుల్లో విజయం సాధించగా, సదాశివపేటలో 26 వార్డులకు గాను 16 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులు జయకేతనం ఎగరేశారు. దీంతో రెండు మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండా ఎగిరింది. సంగారెడ్డి మున్సిపాలిటీలో కాంగ్రెస్ 22, బీఆర్ఎస్ 10, బీజేపీ 02, ఎంఐఎం 01, ఇతరులు - 03 గెలుపొందారు. సదాశివపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ 16, బీఆర్ఎస్ 08, బీజేపీ 01, స్వతంత్రులు - 01 స్థానం కైవసం చేసుకున్నారు.

జగ్గారెడ్డి మాటను విశ్వసించిన ప్రజలు

ఈ మున్సిపల్ ఎన్నికల్లో జగ్గారెడ్డి ఇచ్చిన హామీలను ప్రజలు విశ్వసించినట్లు ఫలితాలు సూచిస్తున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే ప్రతి వార్డుకు రూ.8 కోట్ల నిధులు తీసుకువస్తానని ఆయన హామీ ఇచ్చారు. రెండు మున్సిపాలిటీల్లో పేదలకు ఇళ్ల జాగాలు అందజేస్తానని ప్రకటించారు. ప్రజలతో ప్రత్యక్షంగా ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తూ అభివృద్ధి భరోసా ఇచ్చిన జగ్గారెడ్డికి ప్రజలు పట్టం కట్టారు. దీంతో సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించింది.

ముందుగానే చైర్‌పర్సన్ అభ్యర్థుల ప్రకటన

ఈ ఎన్నికల్లో సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ అభ్యర్థుల పేర్లను జగ్గారెడ్డి ముందుగానే ప్రకటించారు. సాధారణంగా ఏ పార్టీ కూడా ముందస్తుగా ఇలాంటి ప్రకటన చేయదు. అయితే ఈ నిర్ణయం కాంగ్రెస్‌కు కలిసి వచ్చింది. ప్రకటించిన అభ్యర్థులందరూ విజయాన్ని అందుకున్నారు.

నిర్మలా జగ్గారెడ్డి కృతజ్ఞతలు

"సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి ఘనవిజయాన్ని అందించిన ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. అభ్యర్థుల విజయం కోసం అహర్నిశలు శ్రమించిన నాయకులు, కార్యకర్తలకు పేరు పేరునా కృతజ్ఞతలు. నేను ఇచ్చిన హామీ మేరకు రెండు మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాను. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి దామోదర్ నరసింహ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాను" అని నిర్మలా జగ్గారెడ్డి తెలిపారు.

ప్రియాంక గాంధీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

- మున్సిపల్ ఎన్నికల్లో గెలుపుపై సీఎంకు ప్రియాంక అభినందనలు

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంక గాంధీతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం సాయంత్రం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై చర్చించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంపై ప్రియాంక గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆమె ప్రత్యేక్యంగా అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నందున కాంగ్రెస్ పార్టీకి ఘన విజయం కట్టాబెట్టారని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రియాంక గాంధీకి తెలియజేశారు.

సింగరేణి సీఎండీ గా బాధ్యతలు చేపట్టిన జ్యోతి బుద్ధ ప్రకాశ్ శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ను మర్యాపూర్వకంగా కలిశారు. డిప్యూటీ సీఎంకు ఆయన పుష్పగుచ్ఛం అందజేశారు.

-ప్రతిపక్షం, హైదరాబాద్

ప్రజలు కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పట్టారు

- ప్రభుత్వ పనితీరుకు ఈ ఫలితాలే నిదర్శనం
- ఎన్నికలు ఏవైనా విజయం కాంగ్రెస్‌దే
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 13: మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు గెలుచుకుంది. హస్తం పార్టీ విజయంపై రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కీలక వ్యాఖ్యలు చేశారు. గాంధీభవన్ వేదికగా మంత్రి జూపల్లి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌పై నమ్మకంతో మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని చెప్పుకొచ్చారు. ఎన్నికలు ఏవైనా విజయం కాంగ్రెస్‌దేనని మరోసారి రుజువైందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పట్టారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వ పనితీరుకు ఈ ఫలితాలే నిదర్శనమని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పుకొచ్చారు. తమ పాలన పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. ఇది కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సమష్టి విజయమన్నారు. ప్రతిపక్షాల విమర్శలను ప్రజలు పట్టించుకోవడం లేదని చెప్పుకొచ్చారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ ప్రజలు ఇదే తీర్పును ఇవ్వబోతున్నారని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధిక మున్సిపల్ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుందని తెలిపారు. కొల్లాపూర్ మున్సిపాలిటీలో 19 స్థానాలకు 16 స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుందని మంత్రి జూపల్లి పేర్కొన్నారు.

స్పీడ్ కారిడార్ల అలైన్‌మెంట్లకు సీఎం సూచనలు

ఢిల్లీ: హైదరాబాద్‌బెంగళూర్, హైదరాబాద్‌చెన్నై హైస్పీడ్ కారిడార్ల అలైన్‌మెంట్లకు సంబంధించి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కన్సల్టెంట్ సంస్థకు పలు సూచనలు చేశారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన హైస్పీడ్ రైలు కారిడార్ల నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్ తయారీ బాధ్యతను రైల్వే శాఖ RITES కన్సల్టెన్సీ సంస్థకు అప్పజెప్పింది. ఆ సంస్థ ప్రతినిధులు ఢిల్లీలోని సీఎం అధికారిక నివాసంలో ఇందుకు సంబంధించిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అలైన్‌మెంట్లు, డీపీఆర్‌కు సంబంధించి వారు చేసిన ప్రతిపాదనలను పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సలహాలు, సూచనలు అందజేశారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కే.ఎస్. శ్రీనివాసరాజు, సెక్రటరీ కో ఆర్డినేషన్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, రైట్స్‌ఈడీ లలిత్ కుమార్ పాల్గొన్నారు.

మంత్రి పదవి ఇవ్వకుంటే నేనే సీఎం అవుతా!

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 13: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి బాంబు పేల్చారు. తనకు మంత్రి పదవి ఇవ్వకుంటే ఏకంగా ముఖ్యమంత్రినే అవుతానని సంచలన వ్యాఖ్యలు చేశారు. 'కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిననాటి నుంచి నాకు మంత్రి పదవి కావాలని అడుగుతున్నా.. నాకు మంత్రి పదవి హామీ ఉన్నది' అని రాజగోపాల్‌రెడ్డి మున్సిపల్ ఎన్నికల ఫలితాల రోజున తన మనోగతాన్ని మరోసారి బయటపెట్టారు. శుక్రవారం మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం చౌటుప్పల్ మున్సిపాలిటీలో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో ఆయన మాట్లాడారు.

ఉమ్మడి మెదక్‌లో గులాబీదే మెజారిటీ

- ఎనిమిది మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్
- 7 మున్సిపాల్టీల్లో కాంగ్రెస్ గెలుపు
- 4 మున్సిపాలిటీల్లో హంగ్
- మంత్రుల ఇలాకాలో కాంగ్రెస్ క్లీన్ స్వీప్
- ఆందోళ్ జోగిపేట, హుస్నాబాద్లో కాంగ్రెస్ ఘన విజయం

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 13: మెదక్ ఉమ్మడి జిల్లాలో 19 మున్సిపాల్టీలకు గాను.. కాంగ్రెస్, పార్టీ 7 మున్సిపాల్టీల్లో స్పష్టమైన ఆధిక్యం కనబరిచింది. ఇద్దరు మంత్రుల నియోజక వర్గాలు ఆందోళ్ జోగిపేట. హుస్నాబాద్ లో...దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ లు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గాల్లో బారి మెజారిటీ స్థానాలు సాధించి కాంగ్రెస్ పార్టీ విజయ బావుట ను ఎగరవేసింది. సంగారెడ్డి, సదా శివంపేట, అందోల్ జోగిపేట, నారాయణ ఖేడ్, రామాయంపేట, హుస్నాబాద్, కోహిర్ మున్సిపాలిటీ లను స్వాధీనం చేసుకునే విధంగా ఫలితాలు వెలువడ్డాయి. బీఆర్ఎస్ పార్టీ 8 మున్సిపాల్టీల్లో స్పష్టమైన ఆధిక్యం కనబరిచింది. తూప్రాన్, జిన్నారం, చేర్యాల, గుమ్మడిదల, ఇంద్రేశం, గడ్డిపోతారం, దుబ్బాక, గజ్వేల్ మున్సిపాల్టీల్లో బీఆర్ఎస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యం కనబరిచింది.

మెదక్, నర్సాపూర్, జహీరాబాద్, ఇస్నాపూర్లో హంగ్

జహీరాబాద్, మెదక్, ఇస్నాపూర్, నర్సాపూర్ మున్సిపాల్టీలో హంగ్ ఏర్పడింది. ఇక్కడ బీజేపీ కీలకంగా మారింది. మెదక్ లో 32 వార్డు లు ఉండగా బీఆర్ఎస్ 15, కాంగ్రెస్ 14, బీజేపీ 2, బీఎస్పీ 1 గెలుపొందగా, బీజేపీ 2 గెలిచి కీలకంగా మారింది. జహీరాబాద్ లో 37 వార్డులు ఉండగా 15 బీఆర్ఎస్, 14 కాంగ్రెస్, 3 బీజేపీ, 2 ఎంఐఎం, 3 స్వసంత్ర అభ్యర్థులు గెలిచారు. ఇస్నాపూర్లో స్వసంత్ర అభ్యర్థులు గెలవడంతో కీలకంగా మారారు. ఇస్నాపూర్లో 12 బీఆర్ఎస్, 10 కాంగ్రెస్ గెలిచినప్పటికి 4 వార్డుల్లో స్వతంత్ర గెలవడంతో వారే కీలకంగా మారారు. తూప్రాన్, జిన్నారం, చేర్యాల, గుమ్మడి దల, ఇంద్రేశం, గడ్డిపోతారం, దుబ్బాక, గజ్వెల్లో బీఆర్ఎస్ కే దక్కనున్నాయి. గడ్డపోతారంలో 18 వార్డులకు బీఆర్ఎస్ 14, కాంగ్రెస్ 3, ఇండిపెంటెండ్ 1 గెలుపొందాయి. గుమ్మడిదలలో 22 వార్డులకు బీఆర్ఎస్ 15, కాంగ్రెస్ 4, బీజేపీ 2, ఇండిపెండెట్ 1 గెలుపు సాధించాయి. ఇంద్రేశంలో 18 వార్డులకు బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 6, బీజేపీ 2 ఇండిపెండెంట్ 1 గెలిచారు. ఇస్నాపూర్లో 26 వార్డులకు బీఆర్ఎస్ 12, కాంగ్రెస్ 10, స్వతంతులు 4 గెలిచారు. జిన్నారంలో 20 వార్డులకు బీఆర్ఎస్ 7, కాంగ్రెస్ 6, బీజేపీ 4, ఇండిపెండెంట్లు 3 గెలిచారు. సంగారెడ్డి లో 38 వార్డులకు కాంగ్రెస్ 22, బీఆర్ఎస్ 10, బీజేపీ 02, ఎంఐఎం 01, స్వతంత్ర 3 చోట్ల గెలిచారు. సదాశివపేటలో 26 వార్డులకు కాంగ్రెస్ 16 , బీఆర్ఎస్ 8, బీజేపీ 1 ఇండిపెండెట్ 1స్థానంలో గెలిచారు. ఆందోలులో 20 వార్డులకు కాంగ్రెస్ 16, బీఆర్ఎస్ 3, బీజేపీ1 చోట గెలిచారు. జహిరాబాద్ లో 37 వార్డులకు బీఆర్ఎస్ 15, కాంగ్రెస్ 14, బీజేపీ 3, ఎంఐఎం 2, ఇండిపెండెంట్ 1 చోట గెలిచాయి. కోహీర్ లో 16 స్థానాలకు 8, బీఆర్ఎస్ 5, ఇతరులు 3 గెలిచారు. నారాయణఖేడ్ లో 15 స్థానాలకు కాంగ్రెస్ 11, బీఆర్ఎస్ 3, బీజేపీ 1 స్థానంలో గెలిచాయి. మెదక్ లో 32 వార్డులకు బీఆర్ఎస్ 15, కాంగ్రెస్ 14, బీజేపీ 2, బీఎస్పి 1 గెలుపొందాయి. నర్సాపూర్ 15 స్థానాలకు కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 5, బీజేపీ 4 చోట్ల గెలిచాయి. తూప్రాన్ లో 16 స్థానాలకు బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 4, బీజెపి 3 అభ్యర్థులు గెలిచారు. రామాయంపేటలో 12 వార్డులకు, కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 3, బీజేపీ 1 చోట్ల గెలుపొందాయి. హుస్నాబాద్ లో 20 స్థానాలకు కాంగ్రెస్ 16, బీఆర్ఎస్ 4 వార్డుల్లో గెలిచారు. గజ్వేల్ లో 20 స్థానాలకు బీఆర్ఎస్ 11, కాంగ్రెస్ 07, బీజేపీ 01, స్వతంత్ర 01 గెలిచారు. చేర్యాల లో 12 స్థానాలకు బీఆర్ఎస్ 7, కాంగ్రెస్ 5 గెలిచారు. దుబ్బాకలో 20 వార్డులకు బీఆర్ఎస్ 11, కాంగ్రెస్ 4, బీజేపీ2, ఫార్వర్డుబ్లాక్ 1, ఇండిపెండెంట్ 1 వార్డుల్లో గెలిచాయి.

పంచాయతీ కార్యదర్శులకు ఊరట

- అంతర్ జిల్లా డిప్యూటేషన్‌కు అనుమతులు
- 223 మంది పంచాయతీ కార్యదర్శులకు ఉపశమనం
- మంత్రి సీతక్క చొరవతో సమస్యకు పరిష్కారం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 13: తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వంలో జారీ చేసిన జీవో నెం.317 కారణంగా స్థానికత కోల్పోయి దూర ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న 223 మంది పంచాయతీ కార్యదర్శులకు రెండు సంవత్సరాల పాటు అంతర్ జిల్లా డిప్యూటేషన్‌పై నియామకానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ నిర్ణయం వెనుక పంచాయతీ రాజ్ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క కీలక పాత్ర పోషించారు. జీవో 317 వల్ల ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సీరియస్‌గా తీసుకున్న మంత్రి సీతక్క, పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులతో సమావేశమై వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అనంతరం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేశారు. జీవో 317 వల్ల జరిగిన నష్టాలను సరిదిద్దేందుకు కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం జీవో 190 జారీ చేసింది. ఆ నిర్ణయానికి అనుగుణంగా అంతర్ జిల్లా డిప్యూటేషన్ ప్రక్రియను ప్రారంభించిన తొలి శాఖగా పంచాయతీ రాజ్ శాఖ నిలిచింది. ఖాళీలున్న ప్రాంతాల్లో అవసరానికి అనుగుణంగా డిప్యూటేషన్లకు అనుమతులిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో పరిపాలన బలోపేతం చేయడం, సిబ్బందికి న్యాయం చేయడం ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల ఉద్యోగులకు జరిగిన అన్యాయాలను సరిదిద్దుతూ, పారదర్శకంగా, న్యాయబద్ధంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.ఈ నిర్ణయంతో పంచాయతీ కార్యదర్శులకు గణనీయమైన ఉపశమనం లభించడంతో పాటు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలుకానున్నాయి. మంత్రి సీతక్క నాయకత్వంలో పంచాయతీ రాజ్ శాఖ సిబ్బంది సంక్షేమం మరియు గ్రామీణ పరిపాలన బలోపేతానికి కట్టుబడి ఉందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ప్రభుత్వం, మంత్రి సీతక్కకు సంఘాల ధన్యవాదాలు

ఈ నిర్ణయంపై రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. తమ సమస్యలను సానుకూలంగా పరిగణించి వేగంగా పరిష్కరించిన తెలంగాణ ప్రభుత్వం, మంత్రి సీతక్కకు సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానికత కోల్పోయి కుటుంబాలకు దూరంగా పనిచేస్తూ ఇబ్బందులు ఎదుర్కొన్న పంచాయతీ కార్యదర్శులకు ఈ నిర్ణయం ఎంతో ఊరట కలిగించిందని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను అర్థం చేసుకుని న్యాయం చేసిన మంత్రి సీతక్కకు, శాఖ అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియ చేశారు.

ప్రజల తీర్పు చరిత్రాత్మకం

- 7 వార్డు కౌన్సిలర్ కొప్పునూరు ప్రవీన్

ప్రతిపక్షం, షాద్ నగర్, ఫిబ్రవరి 13: ప్రజాస్వామ్యానికి బలం చేకూర్చిన ప్రతి ఓటరుకి శిరసు వంచి నమస్కరిస్తున్నానని, ఈ విజయం ప్రజల గర్జన అని, ఇది మార్పు కోసం వేసిన ఓటని, డబ్బు, దర్పం, దౌర్జన్యాలకు లొంగకుండా అభివృద్ధి, నమ్మకం, నిజాయితీకి ఓటు వేసిన 7వ వార్డు ప్రజలకు సలాం అని కౌన్సిలర్ కొప్పునూరి ప్రవీన్‌అన్నారు. వార్డు ప్రజల ఆశీర్వాదంతోనే ఈ గెలుపు సాధ్యమైందని అన్నారు. తన వెంట నిలబడిన ఎమ్మెల్యే శంకరన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ప్రతాప్, శ్యామ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, నా శ్రేయోభిలాషులు, స్నేహితులు, నా కుటుంబ సభ్యులు, అహర్నిశలు శ్రమ శ్రమపడ్డారని అన్నారు. ఈ రోజు నుంచి 7వ వార్డులో కొత్త అధ్యాయం ప్రారంభమైదని అన్నారు. 7వ వార్డు అభివృద్ధి కోసం నా శక్తి అంతా వినియోగిస్తానని, విశ్వాసానికి తగిన నాయకత్వం చూపిస్తానని కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు.

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్‌కు అభినందనలు. ఈ ఫలితాలు పార్టీపై ప్రజల విశ్వాసాన్ని చాటాయి. 3.8 కోట్ల ప్రజలకు సామాజిక న్యాయం, ఆర్థిక సాధికారిత, నిరంతర పురోగతి అందిస్తూ 'ప్రజా తెలంగాణ'కు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది.

- మల్లిఖార్జున ఖర్గే

ఓపెన్ వాయిస్

రైట్ టు రీ కాల్ ఇండియాలో సాధ్యమేనా!

ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా పార్లమెంటులో రైట్ టు రీకాల్ ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశ పెట్టారు. ఇది భారత రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ఎన్నికైన ప్రతినిధి తన విధుల్లో విఫలమైతే లేదా ప్రజల నమ్మకాన్ని వమ్ము చేస్తే, పదవీకాలం ముగియక ముందే వారిని వెనక్కి పిలిచే అధికారం ఉండాని ఈ బిల్లు పెట్టారు. ఈ అధికారం ప్రజాస్వామ్యానికి నిజంగా మేలు చేస్తుందా? లేదా అస్థిరతకు దారితీస్తుందా? భారత ప్రజాస్వామ్యంలో ఓటరుకు ఐదేళ్లకోసారి మాత్రమే తన తీర్పును తెలిపే అవకాశం ఉంటుంది. పార్లమెంటులో ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా 'రైట్ టు రీకాల్' అంశాన్ని లేవనెత్తారు. పనితీరు బాలేని ప్రజాప్రతినిధులను ఐదేళ్ల పాటు భరించాల్సిన అవసరం లేదని, వారిని మధ్యలోనే తొలగించే అధికారం ఓటర్లకు ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. అమెరికా, స్విట్జర్లాండ్ సహా ప్రపంచంలోని 24 దేశాల్లో రైట్ టు రీకాల్ అమలులో ఉందని గుర్తుచేశారు. భారతదేశంలోకూడా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలంటే ఈ విధానం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు .ఈ గ్యాప్‌లో ఎన్నికైన ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో లేకపోయినా, అవినీతికి పాల్పడినా ఓటరు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉంటారు. రాఘవ్ చద్దా వాదన ప్రకారం, రైట్ టు రీకాల్ అమలులోకి వస్తే ప్రజాప్రతినిధుల్లో జవాబుదారీతనం పెరుగుతుంది.

ప్రజల పట్ల నిర్లక్ష్యంగా ఉండేవారికి ఇది ఒక హెచ్చరికగా మారుతుంది. ఇది ఓటరును కేవలం ఐదేళ్లకోసారి ఓటు వేసే యంత్రంగా కాకుండా, నిరంతరం పర్యవేక్షించే శక్తిగా మారుస్తుంది.సిద్ధాంతపరంగా ఇది అద్భుతంగా అనిపించినప్పటికీ, క్షేత్రస్థాయిలో దీని అమలు అనేక సవాళ్లతో కూడుకున్నది. భారత్ వంటి బహుళ పార్టీలు, తీవ్రమైన రాజకీయ వైషమ్యాలు ఉన్న దేశంలో ఈ చట్టం రాజకీయ కక్షసాధింపునకు ఆయుధంగా మారే ప్రమాదం ఉంది. ఓడిపోయిన అభ్యర్థులు లేదా ప్రత్యర్థి పార్టీలు నిరంతరం రీకాల్ పిటిషన్లతో పాలనను స్తంభింపజేసే అవకాశం ఉంది. ఇది దేశంలో నిరంతరం ఎన్నికల వాతావరణాన్ని సృష్టించి, అభివృద్ధి పనులను పక్కదారి పట్టించవచ్చు. మరో వైపు 10 మార్చి 2017న ఎంపీ వరుణ్ గాంధీ, ఎన్నికైన ఎంపీల, ఎమ్మెల్యేల పనితీరు సంతృప్తికరంగా లేకపోతే, ప్రజలు ఆ ప్రజాప్రతినిధులను పదవి నుంచి తొలగించేలా చట్టం చేసేందుకు 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలో సవరణను ప్రతిపాదిస్తూ లోక్‌సభలో ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రకారం, ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఓటు వేసిన వారిలో 75% మంది వారి పనితీరు పట్ల సంతృప్తి చెందకపోతే, ఎన్నికైన రెండేళ్లలోపు వారిని రీకాల్ చేయవచ్చు. ఇందుకోసం ఎన్నికల తర్వాత కనీసం రెండు సంవత్సరాల వ్యవధి తర్వాత నియోజకవర్గంలోని ఏ ఓటరు అయినా స్పీకర్ ముందు పిటిషన్ దాఖలు చేయడం ద్వారా రీకాల్ ప్రక్రియను ప్రారంభించవచ్చు. ఈ రీకాల్ పిటిషన్ పై ఆ నియోజకవర్గంలోని మొత్తం ఓటర్లలో కనీసం నాలుగో వంతు మంది సంతకం చేయాలి. స్పీకర్ పిటిషన్ యొక్క ప్రామాణికతను పరిశీలించిన తర్వాత, ఓటర్ల సంతకాలను ధృవీకరించడానికి స్పీకర్ దానిని ఈసీఐకి బదిలీ చేస్తాడు. స్పీకర్ నుండి రీకాల్ పిటిషన్ అందిన తర్వాత, ఎన్నికల కమిషన్, రీకాల్ పిటిషన్‌పై సంతకాల ప్రామాణికతను కోసం ధృవీకరణ ప్రక్రియను ప్రారంభించి, దీనిని ఒక నిర్దిష్ట వ్యవధిలోపు పూర్తి చేయాలి. రీకాల్ పిటిషన్‌కు అనుకూలంగా సదరు ప్రజాప్రతినిధి ఎన్నికల్లో పొందిన ఓట్లలో కనీసం 3/4 వంతు ఓట్లు వస్తే రీకాల్ పిటిషన్ విజయవంతమైందని భావిస్తారు. అంటే సదరు ప్రజాప్రతినిధిని పదవి నుండి తొలగిస్తారు. ఆ తర్వాత ఈసీఐ ఆ నియోజకవర్గంలో ఉప ఎన్నికను నిర్వహించాలి. రాఘవ్ చద్దా డిమాండ్ చేస్తున్న ఈ హక్కు ప్రజాస్వామ్య పునాదులను బలోపేతం చేసే అవకాశం ఉన్నప్పటికీ, దీనికి కఠినమైన నిబంధనలు ఉండాలి. రైట్ టు రీకాల్ అనేది ప్రజాస్వామ్య పరిణామ క్రమంలో ఒక గొప్ప అడుగు కావచ్చు, కానీ అది అరాచక రాజకీయాలకు దారి తీయకుండా చూడటం చట్టసభల బాధ్యత. ప్రైవేట్ మెంబర్ బిల్లులు చాలా అరుదుగా చట్టాలుగా మారతాయి. సుమారు గత 45 ఏళ్లలో, ఒక్క ప్రైవేట్ మెంబర్ బిల్లు కూడా పార్లమెంటులో ఆమోదం పొందలేదు. పార్లమెంటు ఆమోదించిన చివరి ప్రైవేట్ మెంబర్ బిల్లు సుప్రీంకోర్టు (క్రిమినల్ అప్పీలేట్ అధికార పరిధి విస్తరణ) బిల్లు, 1968. ఇది 09 ఆగస్టు 1970న చట్టంగా మారింది. 1952 నుండి ఇప్పటివరకు కేవలం 14 ప్రైవేట్ మెంబర్ బిల్లులు మాత్రమే చట్టాలుగా మారాయి. గతంలో 'రైట్ టు రీకాల్' బిల్లును ఇద్దరు ఎంపీలు ప్రైవేట్ మెంబర్ బిల్లులగా ప్రవేశపెట్టగా అవి పార్లమెంట్ ఆమోదం పొందలేదు.

ప్రతిపక్షం
హైదరాబాద్
శనివారం
14.02.2026

సంప్రదాయం నుంచి ఆధునిక సంస్కృతి వరకు

ప్రేమ అనే భావన మానవ నాగరికతంతా వ్యాపించిన శాశ్వత అనుభూతి. కుటుంబ బంధాలు, దాంపత్య జీవితం, స్నేహ సంబంధాలు, సామాజిక అనుబంధాలు ఇవన్నింటికీ ప్రేమే పునాది. ఈ ప్రేమను ప్రత్యేకంగా స్మరించుకునే రోజు ప్రపంచవ్యాప్తంగా "వాలంటైన్ డే"గా గుర్తింపు పొందింది. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 14న జరుపుకునే ఈ దినోత్సవం కేవలం యువజనోత్సాహానికి పరిమితమైన పండుగ కాదు; ఇది చరిత్ర, మతం, సంస్కృతి, ఆర్థిక వ్యవస్థ, ఆధునిక సామాజిక సంబంధాల మధ్య ఏర్పడిన ఆసక్తికరమైన పరిణామాల సమాహారం. వాలంటైన్ డే వెనుక ఉన్న పూర్వాపరాలను పరిశీలిస్తే, ఇది అనేక శతాబ్దాల చారిత్రక పరిణామాల ఫలితమని స్పష్టమవుతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

వాలంటైన్ డే మూలాలు ప్రాచీన రోమన్ చరిత్రలో కనిపిస్తాయి. ఈ దినానికి సంబంధించి ప్రముఖంగా వినిపించే కథనం క్రైస్తవ మతగురువైన Saint Valentine జీవితానికి సంబంధించినది. క్రీస్తు శకం మూడవ శతాబ్దంలో రోమన్ సామ్రాజ్యంలో సైనికులకు వివాహం నిషేధించబడిందనే కథనం ప్రసిద్ధి. యువకులు వివాహం చేసుకుంటే యుద్ధస్ఫూర్తి తగ్గుతుందని భావించిన పాలక వర్గం ఆంక్షలు విధించిందని చెబుతారు. ఈ పరిస్థితుల్లో ప్రేమికులకు రహస్యంగా వివాహాలు జరిపించినందుకు వాలంటైన్‌కు శిక్ష విధించబడిందనే గాథ విస్తృతంగా ప్రచారంలో ఉంది. చారిత్రక ఆధారాలపై పరిశోధనలు చూస్తే, కథనం పూర్తిగా పురాణగాథలా ఉన్నప్పటికీ, ప్రేమకు అంకితమైన ఒక క్రైస్తవ మతపెద్దను స్మరించుకునే సంప్రదాయం మాత్రం యూరప్‌లో బలంగా ఏర్పడింది.

ఈ దినోత్సవానికి మతపరమైన గుర్తింపు లభించడంలో Pope Gelasius I కీలక పాత్ర పోషించినట్టు చరిత్రకారులు పేర్కొంటారు. ఐదవ శతాబ్దంలో ఫిబ్రవరి మధ్యలో జరుపుకునే కొన్ని ప్రాచీన రోమన్ ఉత్సవాలకు ప్రత్యామ్నాయంగా ప్రేమ, పవిత్రత, ఆధ్యాత్మికతను ప్రతిబింబించే దినంగా ఈ రోజును గుర్తించినట్లు చారిత్రక రచనల్లో సూచనలు కనిపిస్తాయి. ప్రాచీన రోమన్ సమాజంలో వసంతఋతువు ఆరంభాన్ని సూచించే ఉత్సవాలు, సంతానోత్పత్తి ప్రతీకలు, సామూహిక వేడుకలు ఉండేవి. కాలక్రమేణా అవి క్రైస్తవ సంస్కృతితో మిళితమై కొత్త అర్థాన్ని సంతరించుకున్నాయి.

మధ్యయుగ యూరప్‌లో ప్రేమను కవిత్వం, సాహిత్యం, రాజసభ సంస్కృతితో అనుసంధానించడం వాలంటైన్ డేకు మరింత సాంస్కృతిక గౌరవాన్ని తెచ్చింది. ఇంగ్లీషు కవి Geoffrey Chaucer రచనల్లో ప్రేమికులు ఫిబ్రవరి మధ్యలో జంటలుగా కలుస్తారని సూచించిన వర్ణనలు కనిపిస్తాయి. ఇది ప్రకృతి చక్రం, పక్షుల సంభోగ కాలం, వసంతానికి ముందు వచ్చే మార్పులతో అనుసంధానించబడింది. ఈ సాహిత్య ప్రభావం కారణంగా ప్రేమను కవితాత్మకంగా వ్యక్తీకరించే సంప్రదాయం బలపడింది. చేతిరాత ప్రేమలేఖలు, కవితలు, చిన్న బహుమతులు ఇవ్వడం వంటి ఆచారాలు అరిస్టోక్రాటిక్ వర్గాల నుంచి సాధారణ ప్రజల జీవితాల్లోకి ప్రవేశించాయి.

ఆధునిక యుగంలో వాలంటైన్ డే వాణిజ్యపరంగా విశేష విస్తరణ పొందింది. పారిశ్రామిక విప్లవం తర్వాత ముద్రణా సాంకేతికత అభివృద్ధి చెందడంతో రెడీమేడ్ గ్రీటింగ్ కార్డులు అందుబాటులోకి వచ్చాయి. 19వ శతాబ్దంలో యూరప్, అమెరికాలో ప్రేమ సందేశాల మార్పిడి విస్తరించింది. 20వ శతాబ్దానికి వచ్చేసరికి చాక్లెట్లు, పూలు, ఆభరణాలు, వ్యక్తిగతీకరించిన బహుమతులు వాలంటైన్ మార్కెట్ లో ప్రధాన భాగమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం కోట్ల సంఖ్యలో గ్రీటింగ్ కార్డులు మార్పిడి అవుతాయని వ్యాపార వర్గాల అంచనాలు సూచిస్తున్నాయి. పుష్పాల విక్రయం, రెస్టారెంట్ బుకింగ్స్, ఆన్‌లైన్ గిఫ్టింగ్ సేవలు ఈ రోజున

గణనీయంగా పెరుగుతాయి. డిజిటల్ యుగంలో సోషల్ మీడియా సందేశాలు, వర్చువల్ గిఫ్టులు, వీడియో శుభాకాంక్షలు ప్రేమ వ్యక్తీకరణకు కొత్త రూపాలు ఇచ్చాయి. సామాజిక దృక్కోణంలో వాలంటైన్ డే అనేక చర్చలకు దారితీసింది. ఒకవైపు ఇది ప్రేమ, పరస్పర గౌరవం, భావోద్వేగ వ్యక్తీకరణకు వేదికగా నిలుస్తుండగా, మరోవైపు అతిగా వాణిజ్యీకరణ, వినియోగ సంస్కృతి పెరుగుదలపై విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు సామాజిక విశ్లేషకులు ప్రేమను ఒకే రోజుకు పరిమితం చేయడం కన్నా దాన్ని జీవన విలువగా ఆచరించడం ముఖ్యమని పేర్కొంటారు. కుటుంబ బంధాలు, తల్లిదండ్రులు -పిల్లల అనుబంధం, స్నేహం వంటి విభిన్న ప్రేమ రూపాలను కూడా గుర్తించాల్సిన అవసరాన్ని సూచిస్తున్నారు.

భారతదేశంలో వాలంటైన్ డే ప్రవేశం గ్లోబలైజేషన్, మీడియా విస్తరణ, పట్టణ జీవనశైలి మార్పులతో ముడిపడి ఉంది. 1990ల తర్వాత ఉపగ్రహ టెలివిజన్, అంతర్జాతీయ బ్రాండ్ల ప్రవేశం, యువజన సంస్కృతిలో వచ్చిన మార్పులు ఈ దినోత్సవాన్ని విస్తృతంగా పరిచయం చేశాయి. పట్టణ ప్రాంతాల్లో గిఫ్ట్ షాపులు, పుష్పాల దుకాణాలు, రెస్టారెంట్లు ప్రత్యేక ఆఫర్లతో ముందుకు వస్తున్నాయి. అదే సమయంలో భారతీయ సంప్రదాయ విలువలతో దీనిని ఎలా సమన్వయం చేయాలనే చర్చలు కొనసాగుతున్నాయి. కొందరు దీనిని పాశ్చాత్య ప్రభావంగా విమర్శిస్తే, మరికొందరు ప్రేమ అనేది సార్వత్రిక మానవ విలువ అని వాదిస్తున్నారు.

మనోవిజ్ఞాన పరంగా చూస్తే, ప్రేమ వ్యక్తీకరణ వ్యక్తుల భావోద్వేగ ఆరోగ్యానికి సహకరిస్తుంది. కృతజ్ఞత, ఆప్యాయత, పరస్పర గౌరవం వంటి భావాలు సంబంధాలను బలపరుస్తాయి. వాలంటైన్ డే సందర్భంలో బహుమతులకంటే భావోద్వేగ అనుబంధానికి ప్రాధాన్యం ఇవ్వడం అవసరం. చిన్న మాట, ఒక లేఖ, ఒక జ్ఞాపకం—ఇవి సంబంధాల్లో దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపగలవు. సమాజశాస్త్రవేత్తలు కూడా వ్యక్తిగత సంబంధాలు బలంగా ఉన్న సమాజాలు సామూహికంగా మరింత స్థిరంగా ఉంటాయని సూచిస్తున్నారు.

ఆర్థిక కోణంలో ఈ దినోత్సవం రిటైల్, ఈకామర్స్, పర్యాటక రంగాలకు ఊతమిస్తుంది. ప్రత్యేక ప్రయాణ ప్యాకేజీలు, హోటల్ ఆఫర్లు, ఆన్‌లైన్ విక్రయాలు గణనీయంగా పెరుగుతాయి. చిన్న వ్యాపారులు కూడా చేతిపనుల బహుమతులు, వ్యక్తిగతీకరించిన ఉత్పత్తులతో మార్కెట్‌లో నిలదొక్కుకుంటున్నారు. ఇది సృజనాత్మక రంగాలకు ఉపాధి అవకాశాలు కల్పించే అంశంగా కూడా పరిశీలించబడుతోంది.

కాలానుగుణంగా వాలంటైన్ డే భావన విస్తరించింది. ప్రేమికుల మధ్య సంబంధానికి మాత్రమే కాకుండా, స్నేహితులు, కుటుంబ సభ్యులు, గురువులు, సమాజానికి సేవ చేసినవారిని స్మరించుకునే సందర్భంగా కూడా కొందరు దీన్ని ఉపయోగిస్తున్నారు. పాఠశాలలు, కార్యాలయాలు, సామాజిక వేదికల్లో కృతజ్ఞతా సందేశాల మార్పిడి పెరుగుతోంది. ప్రేమను పరస్పర గౌరవం, సమానత్వం, బాధ్యతతో అనుసంధానించే దిశగా కొత్త భావనలు రూపుదిద్దుకుంటున్నాయి. మొత్తానికి వాలంటైన్ డే అనేది చరిత్ర, మతపరమైన సంప్రదాయం, సాహిత్య ప్రభావం, వాణిజ్య విస్తరణ, ఆధునిక సామాజిక పరిణామాల కలయిక. ప్రేమను ఒక ఉత్సవంగా గుర్తించడమే కాకుండా, దాన్ని రోజువారీ జీవన విలువగా ఆచరించాలనే సందేశాన్ని ఈ దినోత్సవం అందిస్తుంది. సంబంధాల్లో పరస్పర అవగాహన, గౌరవం, ఆప్యాయత పెంపొందించుకోవడం ద్వారా వ్యక్తిగత జీవితాలు మాత్రమే కాదు, సమాజం కూడా మరింత మానవీయంగా మారుతుంది. ప్రేమను కేవలం బహుమతుల రూపంలో కాకుండా భావోద్వేగ అనుబంధంగా చూడగలిగితే, వాలంటైన్ డే అసలైన సారాన్ని మనం అనుభవించినట్టే అవుతుంది.

(వ్యాసకర్త సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

కమల దళానికి స్వతంత్రుల షాక్!

వెంక గారి భూమయ్య
9848559863

తెలంగాణ రాజకీయ యవనికపై మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఒక పెను సంచలనాన్ని సృష్టించాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏకపక్షంగా మున్సిపాలిటీలను తుడిచిపెట్టేస్తుందని భావించిన రాజకీయ పండితుల అంచనాలు క్షేత్రస్థాయిలో తలకిందులయ్యాయి. ఈ తీర్పు కేవలం గెలుపోటములకు పరిమితం కాకుండా రాష్ట్ర రాజకీయాల్లో రాబోయే తుఫానుకు సంకేతంగా నిలిచింది. పీఠం దక్కినా పట్టు చిక్కని స్థితిలో కాంగ్రెస్ ఉంటే, అడ్రస్ గల్లంతవుతుందని భావించిన చోట అనూహ్యంగా పుంజుకుని బిఆర్ఎస్ అందరినీ ఆశ్చర్యపరిచింది. వీటన్నింటికీ మించి జాతీయ పార్టీగా ఉప్పెన సృష్టిస్తామన్న బిజెపికి సామాన్య స్వతంత్ర అభ్యర్థులు చుక్కలు చూపించడం ఈ ఎన్నికల హైలైట్ అని చెప్పక తప్పదు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 నగరపాలక సంస్థలకు వెలువడిన ఫలితాలను లోతుగా విశ్లేషిస్తే ఓటరు నాడి ప్రధాన పార్టీల అంచనాలకు అందనంత దూరంలో ఉందని స్పష్టమవుతోంది. సాయంత్రం 6 గంటల సమయానికి అందిన అధికారిక గణాంకాల ప్రకారం మొత్తం 2,836 వార్డులలో కాంగ్రెస్ 1,490 స్థానాలు సాధించగా, బిఆర్ఎస్ 759 స్థానాలతో తన బలాన్ని నిరూపించుకుంది. ఇక బిజెపి కేవలం 277 స్థానాలకే పరిమితం కాగా, ఏకంగా 171 వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థులు జయకేతనం ఎగురవేసి ప్రధాన పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు. అధికార కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికలు ఒక రకమైన చేదు అనుభవాన్నే మిగిల్చాయి. సాధారణంగా రాష్ట్రంలో అధికారంలో ఉన్నపార్టీకి మున్సిపల్ ఎన్నికలంటే అయాచిత వరంగా మారుతాయి. కానీ ఈసారి సీన్ రివర్స్ అయింది. మెజారిటీ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, సుమారు 90 మున్సిపాలిటీల్లో పట్టు సాధించి, దాదాపు 12 చోట్ల ఫలితాలు హంగ్ కావడంతో పరేషాన్ లో పడింది. ముఖ్యంగా కీలకమైన నగరపాలక సంస్థల్లో కాంగ్రెస్‌కు ఊహించిన దానికంటే గట్టి పోటీ ఎదురైంది. నల్గొండ, రామగుండం, మంచిర్యాల వంటి కార్పొరేషన్లను హస్తగతం చేసుకున్నప్పటికీ, నిజామాబాద్ వంటి చోట్ల బిజెపి ఆధిక్యం కనబరచడం ఆ పార్టీని ఆశ్చర్యానికి గురిచేసింది. అధికార బలంతో క్లీన్ స్వీప్ చేస్తామని ధీమాగా ఉన్న నేతలకు ఈ ఫలితాలు గట్టి హెచ్చరికను పంపాయి. ప్రజల్లో ప్రభుత్వం పట్ల ఉన్న వ్యతిరేకత లేదా స్థానిక నేతల మధ్య ఉన్న అంతర్గత విభేదాలు కాంగ్రెస్ కొంపముంచాయని చెప్పాలి. ఇదే ట్రెండ్ కొనసాగితే రాబోయే జెడ్పిటిసి మరియు ఎంపిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఊహించిన ఎదురుదెబ్బలు తగిలే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. కేవలం హామీలతో సరిపెట్టకుండా క్షేత్రస్థాయిలో పనులు చేయకపోతే ప్రజలు తిరస్కరిస్తారని ఈ తీర్పు తేటతెల్లం చేసింది.

మరోవైపు ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ ఈ ఎన్నికల్లో 'ఫినిక్స్' పక్షిలా పుంజుకుంది. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత కుదేలైన గులాబీ దళం, మున్సిపల్ పోరులో

తన ఉనికిని చాటుకోవడమే కాకుండా అధికార పార్టీకి చెమటలు పట్టించింది. గతంలో కంటే సీట్లు తగ్గినప్పటికీ 759 వార్డులను కైవసం చేసుకోవడం ద్వారా తాము ఇంకా రేసులో ఉన్నామని ఆ పార్టీ నిరూపించుకుంది. పట్టణ ఓటర్లు ఇంకా బిఆర్ఎస్ అభివృద్ధి మంత్రానికే మొగ్గు చూపుతున్నారని ఈ ఫలితాలు చెబుతున్నాయి. ముఖ్యంగా 12 మున్సిపాలిటీల్లో బిఆర్ఎస్ స్పష్టమైన మెజారిటీ సాధించడం గమనార్హం. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టడంలో బిఆర్ఎస్ సక్సెస్ అయిందని, అందుకే కొన్ని కీలక మున్సిపాలిటీల్లో గట్టి ప్రభావం చూపిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది కేవలం గెలుపు మాత్రమే కాదు, రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యామ్నాయం తామేనని చాటిచెప్పే బలమైన సంకేతం. అడ్రస్ గల్లంతవుతుందని భావించిన చోట గులాబీ జెండా రెపరెపలాడటం ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. అయితే ఈ ఎన్నికల్లో అసలైన షాక్ తగిలింది మాత్రం బిజెపికే. రాష్ట్రంలో రెండో పెద్ద శక్తిగా అవతరించాలని కలలు గన్న కమల దళానికి ఈ ఫలితాలు మింగుడుపడని సత్యం. జాతీయ స్థాయిలో మోదీ గాలి వీస్తున్నా, రాష్ట్రంలో మాత్రం బిజెపి గ్రాఫ్ పడిపోవడం ఆ పార్టీ నాయకత్వాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. విచిత్రమేమిటంటే, రాష్ట్రవ్యాప్తంగా బిజెపి సాధించిన 277 వార్డులతో పోలిస్తే, స్వతంత్ర అభ్యర్థులు సాధించిన 171 స్థానాలు మరియు ఇతర చిన్న పార్టీల ప్రభావం బిజెపి పతనాన్ని సూచిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో పట్టుందని చెప్పుకునే బిజెపికి స్వతంత్ర అభ్యర్థులు షాక్ ఇవ్వడం అంటే పార్టీ క్షేత్రస్థాయిలో ఎంత బలహీనంగా ఉందో అర్థమవుతోంది. చాలా చోట్ల అభ్యర్థుల ఎంపికలో జరిగిన పొరపాట్లు, గ్రూపు తగాదాలు బిజెపి కొంపముంచాయి. ఫలితంగా బిజెపి శ్రేణుల్లో ఒక రకమైన నిరాశ నిస్పృహలు అలుముకున్నాయి. ప్రత్యామ్నాయం తామేనని నిరూపించుకోవాల్సిన చోట బిఆర్ఎస్ కంటే వెనుకబడి పోవడం బిజెపికి ఆశలు నీరయ్యేలా చేశాయి.

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాని పరిస్థితి (Hung) నెలకొంది. ఇక్కడ ఇప్పుడు 171 మంది స్వతంత్ర అభ్యర్థులే 'కింగ్ మేకర్లు'గా అవతరించారు. ప్రధాన పార్టీలన్నీ ఇప్పుడు ఈ స్వతంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాయి. క్యాంపు రాజకీయాలు, ప్రలోభాలు ఊపందుకున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రజలు పార్టీలను కాదని వ్యక్తులను ఎన్నుకున్నారంటే అది వ్యవస్థలో ఉన్న లోపాలను ఎత్తిచూపుతోంది. సామాన్య ఓటరు పార్టీ గుర్తు కంటే తన గల్లీలో పని చేసే వ్యక్తికే ప్రాధాన్యతనిచ్చాడని ఈ ఫలితాలు ఘోషిస్తున్నాయి. ఇది ప్రధాన పార్టీలకు గట్టి హెచ్చరిక. రాబోయే ఎన్నికల్లోనైనా పార్టీలు తమ తీరు మార్చుకోకపోతే స్వతంత్ర అభ్యర్థుల హవా మరింత పెరిగే అవకాశం ఉంది. మొత్తానికి తెలంగాణ మున్సిపల్ తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో ఒక కొత్త మలుపు. ఇది ఒక పార్టీకి గెలుపును, మరో పార్టీకి ఆశను, ఇంకో పార్టీకి నిరాశను మిగిల్చింది. ఈ ప్రభావం ఫిబ్రవరి 16న జరగబోయే మేయర్, మున్సిపల్ చైర్మన్ల ఎన్నికపై ఏ విధంగా ఉంటుందో వేచి చూడాలి. ఈ ఫలితాల విశ్లేషణను బట్టి చూస్తే, కాంగ్రెస్ తన వైఫల్యాలను సమీక్షించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. బిఆర్ఎస్ తన కేడర్‌ను కాపాడుకోవడంలో సక్సెస్ అవ్వగా, బిజెపి మాత్రం తన ఉనికిని చాటుకోవడానికి మరింత కష్టపడాల్సి ఉంది. స్వతంత్రుల గెలుపు అనేది రాజకీయ పార్టీలకు ఒక చరమగీతం వంటిది. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం కాని నాయకులను ప్రజలు ఏ పార్టీలో ఉన్నా నిరాకరిస్తారని ఈ ఫలితాలు సందేశాన్నిచ్చాయి. ఫిబ్రవరి 16న జరిగే చైర్మన్ల ఎన్నికల్లో ఈ 171 మంది స్వతంత్రులు ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతారో, ఏ పార్టీ మున్సిపల్ పీఠాలను దక్కించుకుంటుందో చూడాలి. ప్రస్తుతానికైతే తెలంగాణ రాజకీయం రసవత్తరంగా మారింది.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

తెలంగాణలో 'ఫుడ్ జిహాద్' పేరిట సాగుతున్న విద్వేష వంటకం

ముహమ్మద్ ముజాహిద్
9640622076

తెలంగాణ పట్టణాల్లోని ఇరుకైన సందులలో, ఇరానీ చాయ్ సువాసనలు, వీధి వెంబడి వేయించే కబాబ్‌ల ఘుమఘుమలతో మిళితమై ఉండే వాతావరణంలో.. ఇప్పుడు ఒక కొత్త, ప్రమాదకరమైన 'విద్వేషపు ఇంధనం' తోడవుతోంది. 'వినియోగదారుల హక్కుల పోరాటం' అనే ముసుగులో కొన్ని తెలుగు యూట్యూబ్ ఛానళ్లు ముస్లిం వీధి వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని, వారి వ్యాపారానికి 'ఫుడ్ జిహాద్' అనే మతపరమైన రంగును పులుముతున్నాయి.

డిజిటల్ మూకదాడి: ఒక విశ్లేషణ

ఈ ఛానళ్ల వ్యూహం అత్యంత అంచనా వేయదగినదిగా, అంతే ప్రమాదకరంగా ఉంది. ఒక స్మార్ట్‌ఫోన్, ముందే సిద్ధం చేసుకున్న ఒక పక్షపాత వైఖరితో 'రిపోర్టర్' రంగంలోకి దిగుతాడు. అక్కడ అతను అడిగే ప్రశ్నలు ఎప్పుడూ ఆహార భద్రతా లైసెన్సుల గురించి ఉండవు; అవి ఆ వ్యాపారి మతపరమైన మూలాలను ప్రశ్నించేలా ఉంటాయి. ఎక్కడో ఒకచోట జరిగిన అపరిశుభ్రతను సాకుగా చూపి, దాన్ని ఒక భారీ మతపరమైన కుట్రగా చిత్రీకరించడం ద్వారా, ఈ డిజిటల్ వేదికలు కేవలం వార్తలను అందించడం లేదు, సమాజాన్ని మతోన్మాదం వైపు నడిపిస్తున్నాయి. పరిశుభ్రత లోపాన్ని 'జిహాద్' అని పిలవడం ఒక తెలివైన భాషా పరమైన కుట్ర. ఇది ఒక పౌర సమస్యను మతపరమైన యుద్ధభూమిగా మారుస్తోంది. తద్వారా ఆ సామాన్య వ్యాపారిని దేశ పౌరుడిగా కాకుండా, ఒక 'కుట్రదారు'గా సమాజం ముందు నిలబెడుతోంది.

నియంత్రణ లేని 'విజిలెంట్' జర్నలిజం

ఈ తరహా ఛానళ్ల పెరుగుదల రెండు వ్యవస్థల వైఫల్యాన్ని సూచిస్తోంది. మొదటిది, ఆహార భద్రతా విభాగాలు (Food Safety Departments) కేవలం ఫిర్యాదులు వచ్చినప్పుడు స్పందించేవిగా ఉండటం వల్ల ఏర్పడిన ఖాళీని, ఈ 'స్వయం ప్రకటిత రక్షకులు' ఆక్రమిస్తున్నారు. రెండవది, డిజిటల్ విద్వేష ప్రచారాల విషయంలో చట్టం తన ప్రభావాన్ని చూపలేకపోవడం. ఒక వైరల్ వీడియో కారణంగా ఒక కుటుంబం నడుపుకునే బండి వద్దకు ఎవరూ వెళ్లకుండా ఆర్థిక బహిష్కరణకు గురిచేయడం అంటే, అది కేవలం ఒక వ్యాపారాన్ని మూసివేయడం కాదు; రాజ్యాంగం కల్పించిన 'నచ్చిన వృత్తిని చేసుకునే హక్కు'ను (ఆర్టికల్ 19) కాలరాయడమే. ఇటువంటి బహిరంగ ఆర్థిక వివక్ష జరుగుతున్నప్పుడు ప్రభుత్వం మౌనంగా ఉండటం ఆందోళనకరం.

కంచం దాటిన విద్వేషం

తెలంగాణ ఎప్పుడూ తన 'గంగాజమునా తహజీబ్' (మిశ్రమ సంస్కృతి) పట్ల గర్వపడుతుంది. ఇక్కడ ఆహారం అనేది సంస్కృతుల మధ్య ఒక వారధి. హైదరాబాద్ హలీమ్ నుండి పల్లెటూరి జాతరల వరకు, భోజనం అనేది మతాలకు అతీతమైనది. అటువంటి పవిత్రమైన ఆహారపు పళ్లెంలో 'ఫుడ్ జిహాద్' అనే విషాన్ని నింపడం ద్వారా, ఈ రెచ్చగొట్టే శక్తులు సామాజిక విచ్ఛిన్నానికి ప్రయత్నిస్తున్నాయి.

ముగింపు

పరిశుభ్రత అనేది ప్రజారోగ్యానికి సంబంధించిన అంశం. దానిని ప్రభుత్వం కఠినంగా అమలు చేయాలి. కానీ ఆ పని చేయాల్సింది ప్రభుత్వ యంత్రాంగం, వీధి మూకలు కాదు. 'శుభ్రత' అనే నెపంతో యూట్యూబర్లు మతపరమైన ప్రక్షాళనకు పూనుకుంటే, అది అరాచకానికి దారి తీస్తుంది. సమాజంగా మనం ఒక్కటి ఆలోచించాలి: మత విద్వేషాలకు మన కడుపులే తదుపరి యుద్ధ క్షేత్రాలా? మనం తినే ప్రతి ముద్దలో అనుమానం అనే ఉప్పును కలిపితే, ఆ తర్వాత మిగిలే చేదును ఏ చట్టం, ఏ ప్రార్థన కడిగివేయలేదు.

'ప్రజా పాలన' ప్రభుత్వానికి బ్రహ్మరథం

- టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 13: మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఘన విజయం అందజేసి 'ప్రజా పాలన' ప్రభుత్వానికి బ్రహ్మరథం పట్టారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన పురపాలక ఎన్నికల్లో 90కు పైగా మున్సిపాలిటీలు, 4 కార్పొరేషన్లు, 1300కు పైగా వార్డులు, 154కు పైగా డివిజన్లలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడం ద్వారా ప్రజలు తమ మద్దతును స్పష్టంగా వెల్లడించారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పారదర్శక పాలన అందిస్తున్న నేపథ్యంలో ప్రజలు విశ్వాసంతో కాంగ్రెస్‌కు ఓటు వేశారని ఆయన పేర్కొన్నారు. సామాన్యుల సంక్షేమం, మహిళా సాధికారత, రైతు సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో దూసుకుపోయేలా 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ లక్ష్య సాధనకు ప్రజలు మరోసారి ఆశీర్వాదం అందించారని తెలిపారు వరుస విజయాలతో పార్టీపై రాష్ట్ర అభివృద్ధి బాధ్యత మరింత పెరిగిందని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కాంగ్రెస్‌కు అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ, ప్రజలు వాటిని నమ్మకుండా అభివృద్ధి, సంక్షేమానికి ఓటు వేశారని అన్నారు. నగరాలు, పట్టణాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీరు, రోడ్లు, పారిశుధ్యం, విద్యుత్ వంటి అంశాల్లో స్పష్టమైన ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. ఈ విజయాన్ని సాధించేందుకు కృషి చేసిన పార్టీ అభ్యర్థులు, కార్యకర్తలు, నాయకులు అందరికీ టీపీసీసీ అధ్యక్షుడు అభినందనలు తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరింత పారదర్శకంగా, ప్రజాకేంద్రిత పాలన అందిస్తూ తెలంగాణను దేశంలో ఆదర్శ రాష్ట్రంగా నిలపడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

ప్రజాపాలనకు ప్రజామోదం

- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పట్టం కట్టారు
- సన్నబియ్యం పంపిణీతో సంచలన విజయాలు నమోదు
- తెల్ల రేషన్ కార్డుల మంజూరుతో పేదల కళ్ళలో వెలుగులు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 13: పురపాలక సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయాలు రాష్ట్ర ప్రభుత్వ పనితీరును ప్రతిబింబింప చేస్తుందని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక సన్నబియ్యం పంపిణీ ఈ ఎన్నికల్లో గేమ్ చెంజర్ గా మారిందని ఆయన చెప్పారు. పురపాలక సంఘాల ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఆయన స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక జరుగుతున్న అభివృద్ధి, అంలౌతున్న సంక్షేమ పథకాలకు ప్రజామోదం లభించినట్లైందని ఆయన అన్నారు. అర్హులైన నిరుపేదలకు తెల్ల రేషన్ కార్డుల పంపిణీతో పాటు రాష్ట్ర జనాభాలో 85% ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ వంటి వంటి పథకాలు పురపాలక సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి దోహదం చేశాయన్నారు. వీటన్నింటిని మించి సాగునీటి రంగంలో సాధించిన విజయాలు, యావత్ భారతదేశ చరిత్రలోనే రికార్డ్ స్థాయిలో ధాన్యం దిగుబడులు, అదే స్థాయిలో కొనుగోళ్ల ప్రక్రియతో పాటు రైతాంగానికి అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేశాయన్నారు. మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం పనితీరుకు పట్టణ ప్రజలు ఆమోదించి పట్టం కట్టారన్నారు. పల్లెలతో పాటు పట్టణాలు సైతం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పనితీరుపై ప్రజలిచ్చిన తీర్పుగా ఆయన అభివర్ణించారు. సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీకీ కంచుకోట అని మరోమారు రుజువైనదన్నారు. ఈ విజయం పూర్తిగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కష్టంతో సాధించిందని తెలిపారు. లోకసభ ఎన్నికల్లో సూర్యాపేట జిల్లాలోనీ తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ, హుజుర్నగర్ నియోజకవర్గలలో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఓట్లు భారతదేశ చరిత్రలోనే ప్రత్యేక రికార్డ్ గా నమోదు అయిందని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం జరిగిన పురపాలక సంఘం ఎన్నికల ఫలితాలు మరోసారి సూర్యాపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి తిరుగు లేదని నిరూపించారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

సీఎం రేవంత్ పటిష్ట వ్యూహంతో విజయం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 13 : రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సాగించిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పటిష్ట వ్యూహం, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో భారీ విజయం సాధ్యం అయిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల అందించిన దీవెనలు మరువలేమని, మున్సిపల్ ఎన్నికల ఫలితాలు మరింత బాధ్యతలు పెంచాయని, నూతన ఉత్సాహంతో ప్రజలకు మరింత సేవలు అందిస్తామని చిన్నారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో పార్టీ శ్రేణులు అందరూ కలిసికట్టుగా చేసిన కృషి, ప్రజల ఆశీర్వాదాలతో కాంగ్రెస్ పార్టీకి భారీ విజయం చేకూరిందని చిన్నారెడ్డి వివరించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు హరీష్ రావు, కేటీఆర్, బీజేపీ నాయకులు ఎన్నో కుట్రలు, తప్పుడు ప్రచారాలు చేసినా ప్రజలు వాటిని తిప్పికొట్టారని చిన్నారెడ్డి అన్నారు. ఇకనైనా బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారాలు మానుకుని ప్రజల కోసం పని చేయాలని చిన్నారెడ్డి సూచించారు. తన నియోజకవర్గం వనపర్తి, పెబ్బేరు మున్సిపాలిటీతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు చిన్నారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధికి కట్టుబడి ఉంటా

- జగ్గారెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 13 : సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి, ఘనమైన విజయాన్ని అందించిన ప్రజలందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. పార్టీ అభ్యర్థుల విజయం కోసం అహర్నిశలు శ్రమించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేసారు. ఇచ్చిన హామీ మేరకు సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల అభివృద్ధికి కట్టుబడి ఉంటానని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా మంత్రి దామోదర్ నరసింహ, జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి సహకారంతో ఈ రెండు మున్సిపాలిటీలను సమగ్రంగా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఇంతటి విజయాన్ని అందించిన ఈ రెండు మున్సిపాలిటీల ప్రజలకు మరొక్కసారి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని పత్రిక ప్రకటనలో వెల్లడించారు.

రేవంత్ ప్రజా పాలనకు ఈ ఫలితాలే నిదర్శనం

- ఎంపీ డాక్టర్ మల్లు రవి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 13: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించడం పట్ల నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ప్రజలు ఇచ్చిన బలమైన తీర్పు అని ఆయన కొనియాడారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల సందర్భంగా మల్లు రవి ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. దీంట్లో కీలక అంశాలను ప్రస్తావించారు. ప్రజా విజయమిది.. "బిఆరెస్ పార్టీ ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా,కుట్రలు పన్నినా .... ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తమకున్న నమ్మకాన్ని ఈ ఎన్నికల ద్వారా మరోసారి చాటి చెప్పారు. ఇది కేవలం పార్టీ విజయం కాదు, తెలంగాణ ప్రజల విజయం." అని మల్లు రవి వ్యాఖ్యానించారు. సంక్షేమానికి పట్టం.. ఆరు గ్యారెంటీల అమలు,రైతన్నలకు రుణమాఫీ,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలే కాంగ్రెస్‌ను విజయపథంలో నడిపించాయని మల్లు రవి పేర్కొన్నారు. స్థానిక సంస్థల బలోపేతం.. మున్సిపల్ ఎన్నికల్లో వచ్చిన ఈ భారీ మెజారిటీతో పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని మల్లు రవి ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యకర్తలకు ధన్యవాదాలు.. రాత్రింబవళ్లు శ్రమించి పార్టీ గెలుపు కోసం కృషి చేసిన కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీలు ఎన్ని కుట్రలు చేసినా.. ప్రజలు మాత్రం అభివృద్ధి వైపే నిలిచారని, వారు ఇకనైనా ఈ కుట్రలు, వ్యక్తిగత దూషణలకు స్వస్తి పలికి వారు నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలని, అదే విధంగా ఈ గెలుపు 2028 అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయానికి నాంది అని డా.మల్లు రవి స్పష్టం చేశారు.

షాద్‌నగర్ మున్సిపల్ పీఠం కాంగ్రెస్ దే

- 15 సీట్లు వార్డుల్లో కాంగ్రెస్ జయకేతనం

ప్రతిపక్షం, షాద్‌నగర్, ఫిబ్రవరి 13: షాద్‌నగర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యంతో పీఠాన్ని కైవసం చేసుకుంది. మొత్తం 28 వార్డులకు జరిగిన ఎన్నికల్లో 15 సీట్లు గెలుచుకుని మ్యాజిక్ ఫిగర్‌ను అందుకుంది. దీంతో మున్సిపల్ పాలనపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమైంది.ప్రారంభ రౌండ్ల నుంచే ఆధిక్యాన్ని ప్రదర్శించిన కాంగ్రెస్, కీలక వార్డుల్లో గట్టి పోటీని తట్టుకుని విజయాలను సాధించింది. ముఖ్యంగా మహిళా రిజర్వ్ వార్డులు, మైనార్టీ ప్రభావిత ప్రాంతాల్లో హస్తం అభ్యర్థులు మెరుగైన ఫలితాలు సాధించడం గమనార్హం. ఇక ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ 11 సీట్లతో నిలిచింది. ఒక వార్డులో బీజేపీ, మరో వార్డులో స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. ఫలితాలు ప్రకటించగానే కాంగ్రెస్ శిబిరంలో సంబరాలు ఊపందుకున్నాయి. పట్టణం అంతటా పార్టీ జెండాలతో ర్యాలీలు, మిఠాయిల పంపిణీ, నినాదాలతో హోరెత్తించారు. స్థానికంగా ఎమ్మెల్యేలు, కీలక నేతల సమన్వయం, ఇంటింటి ప్రచారం, అభివృద్ధి హామీలు కాంగ్రెస్ విజయానికి దోహదపడ్డాయని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. ఇక మున్సిపల్ చైర్మన్ ఎంపికపై ఆసక్తి నెలకొంది. కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టణ అభివృద్ధి ఏ దిశగా సాగుతుందో చూడాల్సి ఉంది.

పెద్దమంగళారంలో ఎగిరిన కాంగ్రెస్ జెండా

- 353 ఓట్ల మెజార్టీతో చేగూరి అరుణ రామకృష్ణగౌడ్ విజయం

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 13: మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారం వార్డులో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేసింది. 18వ వార్డు కౌన్సిలర్ గా చేగూరి అరుణ రామకృష్ణగౌడ్ విజయం సాధించారు. తన ప్రత్యర్థిపై 353 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ తరపున గెలుపొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించిన వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అన్ని విధాలుగా వార్డును అభివృద్ధి చేసే బాధ్యత నాదని ఆమె స్పష్టం చేశారు.

రెండేళ్ల ప్రజా పాలనకు ప్రజల ఆమోద ముద్ర

- ప్రజా ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి ఈ ఫలితాలే నిదర్శనం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 13: మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రెండేళ్ల ప్రజా ప్రభుత్వ పాలనకు ప్రజల ఆమోద ముద్ర అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఇది కేవలం రాజకీయ గెలుపు మాత్రమే కాదని, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై ఉన్న తిరుగులేని విశ్వాసానికి నిదర్శనమని శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. తమ స్వార్థ రాజకీయాల కోసం తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ ను దెబ్బ తీయడమే అజెండాగా పెట్టుకున్న శక్తులకు ఈ ప్రజా తీర్పు ఓ చెంప దెబ్బ అని వాఖ్యానించారు. ఓ వైపు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెడుతూనే, మరోవైపు అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల చెంతకు చేర్చాలన్న మా ప్రభుత్వ సంకల్పానికి ఈ ఫలితాలు నిదర్శనమన్నారు. ఈ గెలుపు ప్రభుత్వంపై బాధ్యతను మరింత పెంచిందని, ఈ స్ఫూర్తితో తెలంగాణను అన్ని రంగాల్లోనూ ఇతర రాష్ట్రాలకు ధీటుగా అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేసి తీరుతామన్నారు. అబద్ధపు ప్రచారాలను నమ్మకుండా, అభివృద్ధికి పట్టం కట్టిన ప్రజలకు.... ఈ ఎన్నికల్లో విజయం కోసం ఏఐసీసీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ మార్గ నిర్దేశనంలో, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో అహర్నిశలు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మంత్రి శ్రీధర్ బాబు ధన్యవాదాలు తెలిపారు.

కమాన్ ప్రారంభించిన కొలన్ శ్రీనివాస్ రెడ్డి

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 13 : నిజాంపేట్ రాజీవ్ గృహకల్పలో వెలసిన శ్రీశ్రీశ్రీ ఉమామహేశ్వర స్వామి, శ్రీశ్రీ నల్ల పోచమ్మ దేవాలయం వద్ద కమాన్ ఓపెనింగ్ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి హాజరై, వారి చేతుల మీదుగా కమాన్ శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలు సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. భక్తుల సహకారంతో దేవాలయ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పితాని శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు సరళ లక్ష్మణ్, జనరల్ సెక్రెటరీ ముద్దికుప్పం కుమార్ రెడ్డి, ట్రెజరర్ వివి రమణ, జాయింట్ సెక్రెటరీ దశరథ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల రామకృష్ణ గుప్తా, ఎగ్జిక్యూటివ్ సభ్యులు సలాడి శివ, వైదాలి నాయుడు, ఎన్ బాలకృష్ణ, అంగ శ్రీనివాసరావు, ఏలూరి సత్య (నాని), బండ్ల విజయ్ కుమార్, లాలయ్య తదితరులు, స్థానిక భక్తులు, నిజాంపేట్ పెద్దలు, కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మొయినాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ ఘన విజయం

- 26 వార్డుల్లో 10 కాంగ్రెస్ పార్టీ కైవసం
- 7 బీఆర్ఎస్, 5 స్వతంత్ర అభ్యర్థులు, 4 బీజేపీ

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 13: మొయినాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ 26 వార్డులకు 10 వార్డులు కైవసం చేసుకుని ఘన విజయం సాధించింది. అయితే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, స్వతంత్ర అభ్యర్థులు ముందుగా ఊహించనట్లుగానే ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఫలితాలతో అభ్యర్థుల విజయాలకు తెరపడింది. ఉదయం 8 గంటలకు మొదలైనా కౌంటింగ్ సాయంత్రం 3 గంటలలోపు కౌంటింగ్ పూర్తి అయ్యి అభ్యర్థుల గెలుపు, ఓటములను అధికారులు వెల్లడించారు. అయితే అధికార పార్టీ ఈ ఎన్నికల్లో తన బలప్రయోగం వినియోగించి 10 సీట్లను కైవసం చేసుకోగా, బీఆర్ఎస్ 7, బీజేపీ 4, 5 స్వతంత్ర అభ్యర్థులు తమ ఖాతాల్లో వేసుకున్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన అభ్యర్థులు సంతోషంతో సంబరాలు నిర్వహించుకున్నారు. ప్రధాన చౌరస్తాల్లో టపాసులు పేల్చి సంబరాలను నిర్వహించుకుని ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ 10 కౌన్సిలర్ అభ్యర్థులు గెలుపొందడంతో చైర్మన్ పీఠం దక్కించుకుంది.

వార్డుల వారీగా వివరాలు ఇలా..

1 వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి చదువు శ్రీలత , రెండో వార్డ్ కాంగ్రెస్ అభ్యర్థి బేగం బి , మూడో వార్డు స్వతంత్ర అభ్యర్థి కవిత ఐలేష్ , నాలుగో వార్డ్ బిజెపి అభ్యర్థి షాబాద్ కిషన్ ,ఐదో వార్డ్ కాంగ్రెస్ అభ్యర్థి సనివల్లి అమరేందర్ రెడ్డి, ఆరో వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి ముంజగల మాణిక్యం,ఏడవ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి సాకలి యాదగిరి,ఎనిమిదో వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి మంచి శంకరయ్య , 9వ వార్డు బిజెపి అభ్యర్థి ముదిగొండ ప్రభాకర్ యాదవ్,పదో వార్డు కాంగ్రెస్ అభ్యర్థి పల్లగొల్ల విజయలక్ష్మి,11 వ వార్డు స్వతంత్ర అభ్యర్థి ఎం మహేష్,12 వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి ఆవురం విక్రమ్ రెడ్డి,13వ వార్డు స్వతంత్ర అభ్యర్థి గడ్డం లక్ష్మీ వెంకట్ రెడ్డి , 14వ వార్డు టిఆర్ఎస్ కర్రోళ్ల శ్రీధర్, 15వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి అప్పల సంధ్య, 16వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి గీతా వనజాక్షి, 17వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి పార్టీ పావని జగన్మోహన్ రెడ్డి, 18 వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి అరుణ రామకృష్ణ గౌడ్ , 19 వ వార్డు బిజెపి అభ్యర్థి కళ్లెంల జగపతి ,20 వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి గునుగుర్తి శిరీష, 21 వ వార్డు స్వతంత్ర అభ్యర్థి జి అనసూయ , 22వ వార్డు స్వతంత్ర అభ్యర్థి గరుగు రాజు , 23 వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంక రమేష్ నాయక్ , 24 వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి వాజిద్ , 25 వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి సోనియా దర్శన్ , 26వ వార్డు బిజెపి అభ్యర్థి పడమటి మమతా మోహన్ రెడ్డి లు గెలుపొందారు. అనంతరం గెలుపొందిన అభ్యర్థులు తమతమ పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబరాలు నిర్వహించుకుని ఆనందం వ్యక్తం చేశారు.

చిట్యాల మున్సిపాలిటీలో కాంగ్రెస్ ఘన విజయం

చిట్యాల, ప్రతిపక్షం, ఫిబ్రవరి 13: చిట్యాల మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 12 వార్డులకు గాను, అత్యధిక వార్డులను కైవసం చేసుకుని కాంగ్రెస్ పార్టీ విజయ దంకా మోగించింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 11 వార్డుల్లో తమ అభ్యర్థులను పోటీకి దింపగా, 1వ వార్డులో మిత్రపక్షమైన సీపీఎం అభ్యర్థికి మద్దతు తెలిపింది. వార్డుల వారీగా కాంగ్రెస్ నుండి గెలుపొందిన అభ్యర్థులు... 3వ వార్డు: గాలి యాదమ్మ, 4వ వార్డు: కోనేటి ఎల్లయ్య, 5వ వార్డు: గుండెబోయిన శ్రీలక్ష్మి, 6వ వార్డు: జక్రిపోతుల సత్యనారాయణ, 7వ వార్డు: కుక్కల లత, 8వ వార్డు: కుక్కల మోహన్, 9వ వార్డు: ఏర్పుల పరమేష్, 11వ వార్డు: మునగాల సందీప, 12వ వార్డు: పందిరి గీత లు గెలుపొందారు. బీఆర్ఎస్ పార్టీ నుండి 2వ వార్డు: ఎస్.కె షబానా, 10వ వార్డు: నిమ్మనగోటి శ్రీనివాస్ విజయం సాధించారు. 1వ వార్డులో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన ట్రాన్స్ జెండర్ నాగిళ్ల సుధాకర్ సంచలన విజయం సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు. మెజారిటీ వార్డులను గెలుచుకోవడంతో కాంగ్రెస్ శ్రేణులు పట్టణంలో సంబరాలు జరుపుకున్నారు. స్పష్టమైన మెజారిటీ రావడంతో చిట్యాల చైర్ పర్సన్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకొనుంది.

మోదీపై నమ్మకంతో ప్రజలు కరీంనగర్‌లో బీజేపీని గెలిపించారు. కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తాం. హామీలిచ్చి నెరవేర్చని కాంగ్రెస్‌కు ఓటర్లు గుణపాఠం చెప్పారు. జీహెచ్ఎంసీని ఒవైసీ కుటుంబం, రేవంత్ రెడ్డి అన్నదమ్ముల ఆస్తుల మాదిరి పంచుకున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని 3 కార్పొరేషన్లనూ కైవసం చేసుకుంటాం.

- కేంద్ర మంత్రి బండి సంజయ్

ప్రాంతీయం

మంచిర్యాల కార్పొరేషన్‌లో కాంగ్రెస్ హవా

ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 13: మంచిర్యాల కార్పొరేషన్ ఎన్నికలలో ఈనెల 11న పోలింగ్ నిర్వహించగా శుక్రవారం ఎన్నికల కౌంటింగ్ జరిగింది. ఒకటవ డివిజన్ అభ్యర్థి కవిత శ్రీనివాస్ కాంగ్రెస్, రెండో డివిజన్ యశోద కాంగ్రెస్, మూడవ డివిజన్ వెంకటేష్ కాంగ్రెస్, నాలుగో డివిజన్ గుమ్మడి శ్రీను టిఆర్ఎస్, ఐదవ డివిజన్ రాజేశ్వరి బిజెపి, ఆరవ డివిజన్ కేత బిజెపి, ఏడవ డివిజన్ రవీందర్ కాంగ్రెస్, ఎనిమిదవ డివిజన్ మేకల రమేష్ ఏఐఎఫ్బి సింహం గుర్తు, 9వ డివిజన్ వేణు కాంగ్రెస్, పదవ డివిజన్ గోపన్న కాంగ్రెస్ ,11వ డివిజన్ హరికృష్ణ కాంగ్రెస్, 12 డివిజన్ బిజెపి, 13 డివిజన్ టిఆర్ఎస్, 14 డివిజన్ కాంగ్రెస్, 15వ డివిజన్ కాంగ్రెస్, 16వ డివిజన్ కాంగ్రెస్, 17వ డివిజన్ కాంగ్రెస్, 18 డివిజన్ కాంగ్రెస్, 19 డివిజన్ లక్ష్మి కాంగ్రెస్, 20 డివిజన్ కాంగ్రె,స్ 21వ డివిజన్ కాంగ్రెస్, 22వ డివిజన్ కాంగ్రెస్, 23 వ డివిజన్ శంకర్ టిఆర్ఎస్, 24 డివిజన్ తిరుపతి కాంగ్రెస్, 25వ డివిజన్ రజిత కాంగ్రెస్, 26వ డివిజన్ రవి ఏఐ ఎఫ్బి సింహం, 27వ డివిజన్ లింగయ్య కాంగ్రె,స్ 28వ డివిజన్ రాజ కుమార్ టిఆర్ఎస్, 29వ డివిజన్ సుధాకర్ కాంగ్రెస్ 31, డివిజన్ కర్రె శ్రీనివాస్ కాంగ్రెస్, 31 వ డివిజన్ కాంగ్రెస్, 32వ డివిజన్ ధరణి మధుకర్ కాంగ్రెస్, 33 వ డివిజన్ కుమారస్వామి కాంగ్రెస్, 34 డివిజన్ సాగర్ జనసేన, 35వ డివిజన్ మొగిలి కాంగ్రెస్, 36వ డివిజన్ రాజు కాంగ్రెస్, 37వ డివిజన్ ఖాలీ కాంగ్రెస్, 38వ డివిజన్ ప్రభాకర్ సునీత కాంగ్రె,స్ 39 వ డివిజన్ కాంగ్రెస్, 40 డివిజన్ శశికళ కాంగ్రెస్, 41 డివిజన్ షేర్ లక్ష్మి కాంగ్రెస్, 42వ డివిజన్ చిందం సత్యవతి కాంగ్రెస్ ,43 వ డివిజన్ చిలువేరు జ్యోతి కాంగ్రెస్, 44వ డివిజన్ కోమాకుల కిషన్ కాంగ్రెస్ ,45వ డివిజన్ సునీత వి ఆర్ ఎస్ 46 డివిజన్ రజిత కాంగ్రెస్ 47వ డివిజన్ టి ఆర్ఎస్ 48వ డివిజన్ కాంగ్రెస్ 49 వ డివిజన్ ఎండి సత్తార్ టిఆర్ఎస్ 57 డివిజన్ టిఆర్ఎస్ 51 డివిజన్ కాంగ్రెస్ 52 డివిజన్ కాంగ్రెస్ 53వ డివిజన్ కాంగ్రెస్ 54 డివిజన్ రమణ కాంగ్రెస్ 55వ డివిజన్ సత్తెమ్మ కాంగ్రెస్ 56 డివిజన్ నల్ల శంకర్ కాంగ్రెస్ 57వ డివిజన్ ముఖేష్ గౌడ్ బిజెపి 58వ డివిజన్ బొట్ల అనిత బిజెపి 59 వ డివిజన్ సత్యనారాయణ కాంగ్రెస్ 60వ డివిజన్ ఎండి గౌస్ ఉద్దీన్ కాంగ్రెస్ కార్పొరేషన్ అభ్యర్థులుగా గెలుపొందారు.

హోరెత్తిన విజయోత్సవాలు

మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో శుక్రవారం ముల్కల్ల గ్రామంలోని ఐజా కాలేజీలో కార్పొరేషన్ ఎన్నికల కౌంటింగ్ లో గెలుపొందిన అభ్యర్థులు తమ అభిమానులతో విజయోత్సవంతో ర్యాలీగా బయలుదేరి బైకులతో పురవీధుల గుండా ఆయా డివిజన్ పరిధిలో విజయోత్సవ ర్యాలీలను నిర్వహిస్తూ పెద్ద ఎత్తున ఉత్సవాలు జరుపుకున్నారు. తమ అభిమానులు కేరింతలు కొడుతూ కుంకుమలు చల్లుకుంటూ టపాసులు కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు కాంగ్రెస్ టిఆర్ఎస్ బిజెపి ఇండిపెండెంట్ లు తమ అభిమానులతో భారీగా ఉత్సవాలు జరుపుకొని సంబరాలు చేసుకున్నారు.

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు

- వారి ఫలితమే మన ఈ విజయం
- మంత్రి దామోదర రాజనర్సింహ
- కౌంటింగ్ ప్రారంభం నుండి.. ఫలితాల్లో దూసుకెళ్లిన కాంగ్రెస్ అభ్యర్థులు
- జోగిపేట మున్సిపల్ పై ఎగిరిన కాంగ్రెస్ జెండా
- ఆందోల్, జోగిపేటలో కాంగ్రెస్ పార్టీ సంబరాలు
- 3వార్డులకే పరిమితమైన బీఆర్ఎస్ అభ్యర్థులు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 13 : ఆందోల్ జోగిపేట మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 20 వార్డులకు గాను ఈ మున్సిపల్ పట్టణ ప్రజలు , ఓటర్ మహాశయులు కౌన్సిలర్ అభ్యర్థులను 16 మందిని గెలిపించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పదేళ్ల తర్వాత జోగిపేట మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరడం ప్రజలు మనకు ఇచ్చిన ఈ అవకాశానికి వారికి మనం ఎప్పుడు రుణపడి ఉండాలని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గత 15 రోజులుగా మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా నామినేషన్లు ఎన్నికల ప్రచారం, పోలింగ్ ప్రక్రియ అన్ని ప్రశాంతంగా ముగిశాయి. చివరి ఘట్టం కౌంటింగ్ ఆ ప్రక్రియ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎన్నికల లో భాగంగా ఉదయం 7 గంటల నుండి కౌంటింగ్ ఫలితాలను లెక్కించడం మొదలు పెట్టారు. సంగారెడ్డి జిల్లా ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో జరిగిన ఎన్నికలలో ఓటర్లు ఎవరికి పట్టం కట్టారు.. అనే తీవ్ర ఉత్కంఠతకు తెర పడ్డట్లు అయింది. తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న అందోల్ నియోజకవర్గంలోని జోగిపేట్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ హవా జోరుగా కొనసాగింది. ఓటర్ మహాశయులు వారి మంచి మనసుతో హస్తం పార్టీ అభ్యర్థులను దీవించి భారీ ఘనవిజయాన్ని కట్టబెట్టి జోగిపేట మున్సిపల్ పైన కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఎంతో సంతోషదాయకం అని తెలుపుతూ.. కౌన్సిలర్లు అందరూ ఓటర్ మహాశయులకు, వార్డు ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. జోగిపేట మున్సిపల్ లో కాంగ్రెస్ అవార్డు జోరుగా కొనసాగింది. 16 మంది అభ్యర్థులు గెలిచారన్న విషయం తెలుసుకున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జోగిపేట పట్టణానికి చేరుకొని పట్టణ కేంద్రంలోని బసవేశ్వర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కౌన్సిలర్లు పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి పాదయాత్రగా విజయోత్సవ ర్యాలీ కొనసాగించారు. అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి దామోదర్ రాజనర్సింహ గెలుపొందిన 16 మంది కౌన్సిలర్లను శాలువా పూలమాలలతో సన్మానించి అభినందించారు.అందోల్ జోగిపేట మున్సిపాలిటీ లోని మొత్తం 20 వార్డులలో తొలిసారిగా మంత్రి దామోదర్ రాజనర్సింహ నాయకత్వం లో 16 వార్డులలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీ సాధించి చరిత్ర సృష్టించిన సందర్భంగా బాణాసంచా కాల్చి, డప్పులతో, పార్టీ కార్యకర్తలు డ్యాన్స్‌లు చేస్తూ, తమ ఆనందాన్ని పంచుకున్నారు. ర్యాలీ లో కార్యకర్తల సంబరాలు, ఆనందోత్సవాలు మిన్నంటాయి. భారీ ర్యాలీ లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కార్యకర్తలకు అభివాదం చేస్తూ ఉత్సాహాన్ని నింపారు. ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించటం లో కార్యకర్తలను , ముఖ్య నాయకులను, అభ్యర్థులను, వార్డు ప్రజలను ఓటర్ మహాశయులను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. గులాబి నాయకులు ఎన్ని కుట్రలు పన్నిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాల అరులైన ప్రతి ఇంటింటికి చేరడంతో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గుండెల్లో పెట్టుకున్నారని.. ఆ అభిమానాన్ని ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలతో పాటు, ప్రస్తుతం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడంలో వారి ఆశీర్వాదాలు కాంగ్రెస్ పార్టీకి ఉన్నాయనేది ఇది పూర్తి నిదర్శనం అన్నారు. ప్రజలు మనపై నమ్మకం ఉంచి మిమ్మల్ని కౌన్సిలర్ గా ఇంతటి భారీ ఘనవిజయాన్ని కట్టబెట్టిన వార్డు ప్రజలకు, ఓటర్లకు ఈ ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీ పాలకవర్గం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడంతో పాటు జోగిపేట మున్సిపల్ ను ఐదేళ్లలో అభివృద్ధిలో జిల్లాలోనే నెంబర్ వన్ స్థానంలో ఆదర్శవంత మున్సిపల్ గా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవాలన్నారు. ఇంతటి ఘనవిజాన్ని కట్టబెట్టిన ప్రజలందరికీ మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈనెల 16వ తేదీన ఈ జోగిపేట మున్సిపల్ పాలకవర్గం కొలువు తీరనునట్లు ఆయన వెల్లడించారు.

పరకాల కాంగ్రెస్ కైవసం

- మున్సిపల్ చైర్మన్ గా పావుశెట్టి సునీల్!?

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 13: హనుమకొండ జిల్లాలో ఏకైక మున్సిపాలిటీ పరకాలను గతంలో బిఆర్ఎస్ అధీనంలో ఉండగా ఈసారి కాంగ్రెస్ ఎట్టకేలకు మున్సిపాలిటీని కైవసం చేసుకుంది పరకాల పురపాలక సంఘం చైర్మన్గా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏడవ వార్డు కౌన్సిలర్ పావుశెట్టి సునీల్ కుమార్ ఎన్నికలాంచనమైంది. శుక్రవారం జరిగిన కౌన్సిలర్ల ఓట్ల లెక్కింపులో వరకు 22 వార్డుల లెక్కింపు పూర్తి అయింది.. ఫలితాలు వచ్చిన 22 వార్డులలో కాంగ్రెస్ పార్టీ 12 చోట్ల విజయం సాధించింది. చైర్మన్ పదవి దక్కించుకోవడానికి కావలసిన సీట్లు రావడంతో కాంగ్రెస్ పార్టీ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోనుంది. ఆ పార్టీ నుండి చైర్మన్ అభ్యర్థిగా రేసులో ఉన్న సునీల్ కుమార్ ఎంపిక లాంచనం కానుంది. అలాగే పట్టణ పార్టీ అధ్యక్షుడైన కొయ్యడ శ్రీనివాస్ వైస్ చైర్మన్గా ఎన్నికయ్యే అవకాశం ఉంది గతంలో పరకాల పురపాలక బిఆర్ఎస్ ఆధీనంలో ఉండగా ఈసారి కాంగ్రెస్ స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తన చాకచక్యంతో కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతూ వార్డులన్నీ కలియ తిరిగి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు గత ఎన్నికలో ఓటమిపాలైన మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సైతం ఆర్థికంగా కొంత పలుకుబడి కలిగిన నాయకుడు కావడం మూలాన బిఆర్ఎస్ 6 స్థానాలను నిలబెట్టుకుంది బిజెపి కూడా గతంలో నాలుగు వార్డులో గెలిచి ఎన్నికల్లో ఈసారి రెండు వార్డులకి పరిమితం అవ్వడం చర్చనీయాంశం మూడు స్థానాల్లో 8.10. 20. ఓట్ల తేడాతో బిజెపి అభ్యర్థులు ఓడిపోవడంతో కార్యకర్తల కొత్త నిరాశని నిస్పృహతో ఉన్నారు ఏదేమైనా రానున్న ఎంపీపీ జడ్పిటిసి ఎన్నికల్లో బిఆర్ఎస్ బిజెపి తమ సత్తా చాటుకునేందుకు ఇప్పటినుంచి తీవ్ర ప్రయత్నాలు చేస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సైతం ఎట్టకేలకు పరకాల పురపాలక సంఘాన్ని కైవసం చేసుకుని తన ఉనికిని చాటుకున్నారు పరకాల పట్టణంలో రానున్న రోజుల్లో కార్యకర్తల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు లో అంత జోషి ఉందని అని చెప్పొచ్చు ఈసారి సునాయాసంగా కాంగ్రెస్ ఎవరి తోడ్పాటు లేకుండా సొంతంగా పరకాల పురపాలక సంఘాన్ని కైవసం చేసుకోవడం విశేషం.

జిల్లా వ్యాప్తంగా చైర్మన్ పదవుల కోసం ఆరాటం

- ఇంద్రేశం,ఇస్నాపూర్ పుర పోరు లో బీఆర్ఎస్ కు అధిక స్థానాలు
- కీలకం కానున్న బీజేపీ, స్వతంత్రుల మద్దతు
- ఇస్నాపూర్ లో స్వతంత్రులను తమ శిబిరంలోకి తీసుకుపోయేందుకు పోటీపడ్డ ఇరు పార్టీలు
- తీవ్ర ఉద్రిక్తత... లాఠీచార్జ్ చేసి చెదరగొట్టిన పోలీసులు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 13 : పురపాలిక ఎన్నికల్లో మున్సిపల్ ఎన్నికలలో సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, అందోల్, ఇంద్రేశం, గుమ్మడిదల్, జిన్నారం, ఇస్నాపూర్, నారాయణఖేడ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. కొన్ని చోట్ల బిఆర్ఎస్ ఎక్కువ సీట్లు కైవసం చేసుకోగ, మరికొన్ని చోట్ల కాంగ్రెస్ కైవసం చేసుకొని చైర్మెన్ పదవి దక్కించుకునేందుకు ఆరాట పడుతున్నారు. మరి కొన్ని చోట్ల హంగ్ ఏర్పడటం తో గెలుపొందిన బీజేపీ, ఇండిపెండెంట్ అభ్యర్థుల సహకారం కోసం వారిని క్యాంపులకు తరలించారు. ఇండిపెండెంట్లుగా గెలిచిన అభ్యర్థులను తమ వైపు తిప్పుకోడానికి ఒక్కొక్కరికి భారీగా నజరాన ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇస్నాపూర్, ఇంద్రేశం రెండు మున్సిపాలిటీలలో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు అధికంగా గెలుపొందారు. శుక్రవారం వెలువడిన మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో బీఆర్ఎస్ పార్టీ తన సత్తా చాటింది. ఇస్నాపూర్, ఇంద్రేశం మున్సిపాలిటీలలో ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాకపోవడంతో స్వతంత్రులతో పాటు బీజేపీ మద్దతు కీలకంగా మారింది. అలాగే ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ ఎక్స్ అఫీషియో ఓట్లు కూడా కీలకంగా మారబోతున్నాయి. ఇంద్రేశం మున్సిపల్ పరిధిలో మొత్తం 18 వార్డులకు గాను బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 6, బీజేపీ 2, స్వతంత్రులు ఒక స్థానం కైవసం చేసుకున్నారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో మొత్తం 26 వార్డులకు గాను బీఆర్ఎస్ పార్టీ 12, కాంగ్రెస్ 10, స్వతంత్రులు నాలుగు స్థానాలు కైవసం చేసుకున్నారు. ఇస్నాపూర్ అభ్యర్థిగా పరిగణిస్తున్న చిట్కుల్ నాలుగో వార్డు అభ్యర్థి కాంగ్రెస్ నాయకులు నీలం మధు ముదిరాజ్ సతీమణి నీలం కవిత 631 ఓట్లతో విజయం సాధించింది. రెండు మున్సిపాలిటీలలో బీఆర్ఎస్ పార్టీ ఎక్కువ కౌన్సిలర్లు గెలుపొందడంతో బీఆర్ఎస్ శ్రేణులు సంతోషం వ్యక్తం చేశారు. వీరి గెలుపుకు పటాన్ చెరు నియోజకవర్గస్థాయి ప్రజా ప్రతినిధులు, నాయకుల కృషి ఎంతగానో ఉంది. గెలుపొందిన కౌన్సిలర్లను ఆయా పార్టీల వారు వెంటనే క్యాంపులకు తరలించారు. ఇస్నాపూర్, ఇంద్రేశం మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల సందర్భంగా మాదాపూర్ అడిషనల్ డిసిపి చింతమనేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇస్నాపూర్ కౌంటింగ్ సెంటర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత లాటిఛార్జ్ చేసి చెదరగొట్టిన పోలీసులు

ఇస్నాపూర్ మున్సిపాలిటీలో స్వతంత్రులు నలుగురు అభ్యర్థులు కీలకం కావడంతో సినీ పక్కీలో ఐ డ్రామా చోటు చేసుకుంది. వాళ్లను తమ శిబిరంలోకి తీసుకు వెళ్లేందుకు ఇరు పార్టీలు పోటీపడ్డాయి. దానితో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుని భయానక వాతావరణం నెలకొంది. ఒకానొక దశలో పోలీసులు ఇరు పార్టీల వారిని చెదరగొట్టేందుకు లాఠీలకు పని చెప్పాల్సి వచ్చింది. ఏ అభ్యర్థిని ఎవరు తీసుకెళ్తున్నారో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది. ఇరు పార్టీల వారు క్యాంపుకు తరలించే క్రమంలో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇస్నాపూర్ ఇంద్రేశం మున్సిపాలిటీలలో ఎవరు చైర్మన్ గా ఎన్ని కవుతారో.. ఏ పార్టీ పాచిక ఎలా పారుతుందో ఈ నెల 16 వరకు వేచి చూడాల్సిందే.

మున్సిపల్ పోరులో కాంగ్రెస్ విజయం

- గుండాల మండల కేంద్రంలో సంబరాలు

ప్రతిపక్షం, గుండాల, ఫిబ్రవరి 13: తెలంగాణ రాష్ట్రంలో ఉత్కంఠభరితంగా సాగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలు గెలుచుకోవడంతో పాటు కొన్ని చోట్ల క్లీన్ స్వీప్ సాధించి ప్రత్యర్థుల అసత్య ప్రచారాలను తిప్పికొట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను దశలవారీగా అమలు చేస్తూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను సరిచేసుకుంటూ, పెట్టుబడులు ఆకర్షిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నందుకు ప్రజలు మరోసారి కాంగ్రెస్ పార్టీకి అమూల్యమైన ఓటుతో ఘన విజయాన్ని అందించారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు జనగామ మున్సిపల్ ఎన్నికల ప్రచార బాధ్యతలు స్వీకరించి అభ్యర్థుల విజయం కోసం అహర్నిశలు కృషి చేసిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ప్రజల్లో నిత్యం అందుబాటులో ఉంటూ పార్టీకి బలం చేకూరుస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావులకు గుండాల మండల కాంగ్రెస్ పార్టీ, యూత్ కాంగ్రెస్ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దార అశోక్ ఆధ్వర్యంలో, సీనియర్ నాయకుల ప్రోత్సాహంతో గుండాల మండల కేంద్రంలో బాణాసంచా పేల్చుతూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు పొంబోయిన ముత్తయ్య, ఏఎంసీ డైరెక్టర్ ఊకె బుచ్చయ్య,సర్పంచ్ ఈసం సంజీవరావు,మండల నాయకులు వాంకుడోత్ బీకోజీ, ఎస్కే అబ్దుల్ నభి, వాంకుడోత్ రమేష్, వార్డు సభ్యులు ఈసం చంద్రయ్య, జాటోత్ వీరన్న, సనప రాంబాబు, ఎస్కే కాశీం, ఊకె బాబురావు, నూనావత్ రవి, నూనావత్ నరసింహ, యువజన నాయకులు పల్లపు రాజేష్, గడ్డం రాజేష్, వీరసరపు భరత్ తదితరులు పాల్గొన్నారు.

మక్తల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రభంజనం

- అభివృద్ధికి పట్టం కట్టిన ప్రజలు
- మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, ఫిబ్రవరి 13: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపై ప్రజలకున్న అచంచలమైన నమ్మకానికి నిదర్శనమని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని మక్తల్, ఆత్మకూర్, మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ జైత్రయాత్ర కొనసాగించిందని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంతో ప్రజలు బ్రహ్మరథం పట్టారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ప్రజలు గ్రహించారని, అందుకే ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి కనీసం ఖాతా తెరిచే అవకాశం కూడా ఇవ్వకుండా బుద్ధి చెప్పారని మంత్రి విమర్శించారు. గల్లీ నుండి ఢిల్లీ దాకా తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ఎన్ని అపవాదులు మోపినా, అందులో నిజం లేదని ఓటర్లు స్పష్టం చేశారని ఆయన అన్నారు. ముఖ్యంగా మక్తల్ మున్సిపాలిటీలోని 15 వార్డులకు గాను 12 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఘనవిజయం సాధించడం విశేషమని మంత్రి కొనియాడారు. దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ నాయకత్వంపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని, ఎవరి జనాభా ఎంత ఉంటే. వారికంత వాటా అనే బీసీ నినాదం ప్రజల్లోకి బలంగా వెళ్లిందని మంత్రి శ్రీహరి అభిప్రాయపడ్డారు. గెలిచిన అభ్యర్థులు ఈ విజయాన్ని బాధ్యతగా భావించాలని, ఆడంబరాలకు పోకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన సూచించారు. మున్సిపల్ చైర్మన్ పదవిని పార్టీ అధిష్టానం నిర్ణయిస్తుందని, అది ఏ ఒక్కరో నిర్ణయించేది కాదని స్పష్టం చేశారు. చివరగా రాత్రింబవళ్లు కష్టపడిన పార్టీ కార్యకర్తలకు, నమ్మకంతో ఓటు వేసిన ఓటర్లకు మంత్రి తన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

రాబోయే 12 నుంచి 18 నెలల్లో కంప్యూటర్ ఆధారిత 'వైట్ కాలర్' ఉద్యోగాలను ఏఐ భర్తీ చేస్తుంది. ముఖ్యంగా అకౌంటింగ్, మార్కెటింగ్, లీగల్, డేటా ఎంట్రీ వంటి పనులు ఆటోమేషన్ అవుతాయి. ఏఐ వల్ల పని వేగం, ఉత్పాదకత పెరిగినప్పటికీ ఉపాధి రంగంలో పెను మార్పులు వస్తాయి. టెకీలు తమ నైపుణ్యాలను మార్చుకోవాల్సిన అవసరం ఉంది.

- మైక్రోసాఫ్ట్ ఏఐ చీఫ్ ముస్తఫా సులేమాన్

కరీంనగర్‌లో కమలం వికాసం!

- బీజేపీ 31 వార్డుల్లో విజయం
- బండి సంజయ్ సంబరాలు
- హైదరాబాద్‌పై కాషాయ జెండా ఎగరేస్తామని సవాల్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, జనవరి 13: కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం బండి సంజయ్ కుమార్ సంబరాల్లో మునిగిపోయారు. తెలంగాణలో తొలి సారిగా కరీంనగర్ కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగరేసి రికార్డు సృష్టించామని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదం, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై ఉన్న నమ్మకమే ఈ విజయానికి కారణమని అన్నారు.

"హైదరాబాద్‌పైనా కాషాయ జెండా ఎగరేస్తాం"

కరీంనగర్ తీర్పు స్ఫూర్తితో హైదరాబాద్‌పైనా కాషాయ జెండా ఎగరేయబోతున్నామని బండి సంజయ్ సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీహెచ్ఎంసీని విభజించడం రాజకీయ ప్రయోజనాల కోసమేనని విమర్శించారు. అలాగే అసదుద్దీన్ ఓవైసీ సహా ఎంఐఎం నేతలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌తో పాటు సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్లలోనూ బీజేపీ జెండా ఎగరేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

ప్రతిపక్షాలపై ఆరోపణలు

కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కలిసి కుట్రలు చేశాయని, ఓటుకు డబ్బులు ఇచ్చారని ఆరోపించారు. అయినా ప్రజలు బీజేపీని నమ్మి గెలిపించారని అన్నారు. గతంలో ఎంఐఎంకు ఉన్న సీట్లు ఈసారి తగ్గిపోయాయని, ప్రజలు వారికి చెంపపెట్టు తీర్పు ఇచ్చారని వ్యాఖ్యానించారు.

అభివృద్ధే లక్ష్యం

కరీంనగర్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.1500 కోట్లు ఖర్చు చేసిందని పేర్కొన్న బండి సంజయ్, ఇకపై అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పాలన సాగిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల వద్దకే పాలనను తీసుకెళతామని, కార్పొరేషన్‌ను ప్రక్షాళన చేస్తామని చెప్పారు.

కాషాయ శ్రేణుల సంబరాలు

బీజేపీ విజయంతో కరీంనగర్ అంతటా కాషాయ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. బండి సంజయ్‌ను భుజాలపై ఎత్తుకుని ఊరేగించారు. మాజీ మేయర్ సునీల్ రావు సహా స్థానిక నేతలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

"ఈ విజయం మహాశక్తి అమ్మవారికి అంకితం"

ఈ విజయాన్ని మహాశక్తి అమ్మవారికి అంకితం చేస్తున్నానని, కార్యకర్తల త్యాగాల ఫలితమే ఈ గెలుపని బండి సంజయ్ అన్నారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు హ్యాట్సాఫ్ తెలిపారు. కరీంనగర్ ఫలితాలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీయనున్నాయా? హైదరాబాద్‌లో బీజేపీ లక్ష్యం సాధ్యమవుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

కరీంనగర్ నగరపాలక సంస్థ ఎన్నికల్లో కమలం వికసించింది. మొత్తం 66 వార్డుల ఫలితాలు వెలువడగా, భారతీయ జనతా పార్టీ అత్యధిక స్థానాలు దక్కించుకుని స్పష్టమైన ఆధిపత్యాన్ని చాటుకుంది. బీజేపీ 31 వార్డుల్లో విజయం

భారతీయ జనతా పార్టీ 31 వార్డుల్లో ఘన విజయం సాధించింది. వార్డు వారీగా గెలిచిన అభ్యర్థులు:

1 బారి అపర్ణ 2 కొలగాని శ్రీనివాస్ 3 సాధినేని లావణ్య 4 బూపతి రవీంద్ర, 6 మేకల వెంకటేష్, 12 చొప్పరి జయశ్రీ, 18 వాసాల రమేష్, 22 బండ రమణారెడ్డి, 24 ఓంటెల సత్యనారాయణ, 29 సోమిడి వేణు ప్రసాద్, 35 సాధవేణి సుజాత, 36 తోట అనిల్, 37 కేవిపిపి చంద్ర 38 దేవసాని సరస్వతి, 41 వేనంక రేణుక, 42 వై. సునీల్ రావు, 43 పొన్నం లక్ష్మీ గౌడ్, 47 గాజ రమా, 48 కర్ర పద్మ 49 ఎన్నం లక్ష్మీ ప్రకాష్, 50 బోయినపల్లి ప్రవీణ్ కుమార్ 51 బండారి వేణు, 53 కొంపెల్లి స్వేత, 54 గొట్టెముక్కల ఉమ రాణి, 55 గుగ్గిళ్లపు మంజుల, 56 తాటి ప్రభావతి 57 రమ్య శ్రీ, 62 పెద్దపల్లి శ్రీలేఖ, 63 దేశ శిల్ప, 66 వంగల పవన్ కుమార్ తదితరులు గెలుపొందారు.

భారత రాష్ట్ర సమితి 9 వార్డుల్లో గెలిచింది:

5 గాదె రూప, 8 కాలువ మల్లేశం, 14 గడ్డి ప్రదీప్, 19 సుధగోని మాధవి, 31 ఎస్.డి. ముకద్దర్ ఉస్సేన్ 32 షేక్ యూసుఫ్, 40 నలువాల పుష్పలత 45 గుగ్గిళ్ల జయశ్రీ, 58 సర్దార్ రవీంద్రర్ సింగ్ లు గెలుపొందారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ 14 వార్డుల్లో విజయం సాధించింది: 9 పాడిశెట్టి వసంతలక్ష్మీ, 11 ఆకుల నర్మధ, 16 కాంతాల జగన్ రెడ్డి, 21 వరాల నర్సింగం, 23 గుమ్మడి రాజ్ కుమార్, 25 గంట శ్రీనివాస్, 26 అంజన్ కుమార్ వైద్యుల, 28 నున్సావత్ బాస్కర్, 30 కల్లెపల్లి శారధ, 33 హీనా అఫ్రీన్ 44 చాడగొండ కవిత, 46 మల్లిఖార్జున్ రాజేందర్ 52 సరిల్ల రాజకుమారి, 64 శ్రీజా పదాల లు గెలుపొందారు. ఇండిపెండెంట్లు - 8 వార్డులలో గెలుపొందారు. 7 ఆకుల నందిని, 10 సొగాని కొమురయ్య, 13 తెల్ల లక్ష్మీ, 17 వేముల కవిత, 20 పర్వతం మల్లేశం, 34 సమీనా పర్వీన్ 39 మాసం గణేష్, 59 మహ్మద్ మాజిద్ ఉస్సేన్ లు గెలుపొందారు. ఫార్వర్డ్ బ్లాక్ 15 విప్పల సాయిజ్యాతి, 27 బోట్ల శ్యామల గెలుపొందగా, ఎంఐఎం (అఖిల భారత మజ్లిస్ఎఇత్తెహాదుల్ ముస్లిమీన్)నుండి 60 నసీమ్ సుల్తానా, 61 మహ్మద్ ఆథీఫ్, 65 మోసిన్ మొహియుద్దీన్ లు గెలుపొందారు.

ప్రజల తీర్పుతో మరింత బాధ్యతగా పనిచేస్తాం

- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్/హుస్నాబాద్, ఫిబ్రవరి 13: పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులకు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 90 శాతం పైగా స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించిందని, ప్రజల తీర్పుతో మరింత బాధ్యతగా పనిచేస్తామని అన్నారు. హుస్నాబాద్‌లో కాంగ్రెస్‌కు 50 శాతం ఓట్లు లభించగా, బీఆర్ఎస్‌కు 34శాతం బీజేపీకి 9 శాతంఓట్లు వచ్చినట్లు తెలిపారు. పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుతో ప్రజల విశ్వాసం పొందిందని, హుస్నాబాద్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెడతామని మంత్రి స్పష్టం చేశారు.

కామారెడ్డి జిల్లాలో మూడు మున్సిపాలిటీలు కాంగ్రెస్ హస్తగతం

- కామారెడ్డి లో హంగ్?

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, ఫిబ్రవరి 13: మున్సిపల్ ఎన్నికల్లో జిల్లా లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్కుంద మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ అధిక కౌన్సిలర్ స్థానాలను సాధించి, మున్సిపల్ చైర్మన్ పీఠలను దక్కించుకుంది. కామారెడ్డి లో మాత్రం హాన్గ్ ఏర్పడింది. బాన్సువాడ లో 19 వరులకు గాను కాంగ్రెస్ 11, బిజెపి 3, బీఆరెస్ 3, ఎం ఐ ఎం 1, స్వతంత్ర 1 దక్కించుకున్నారు. ఎల్లారెడ్డిలో 12 వార్డులకు గాను కాంగ్రెస్ 10, బీఆరెస్ 1, స్వతంత్ర 1 సాధించారు. బిచ్కుంద మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో మొత్తం 12 వార్డులకు గానూ 10 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు స్వీట్లు పంచుకొని గెలుపు సంబురాలు చేసుకుంటున్నారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు, కామారెడ్డి డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ గభారీ పూల మాలతో ఘనంగా సత్కరించారు. కామారెడ్డి మున్సిపాలిటీ లో హంగ్ ఏర్పడింది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో ఉన్న వర్గ పోరు హంగ్ ఏర్పాటుకు దారి తీసింది. కాంగ్రెస్ పార్టీ వర్గ పోర్ బిజెపి పార్టీకి కలిసి వచ్చింది, కామారెడ్డి ఎమ్మెల్యేగా వెంకటరమణ రెడ్డి అన్ని తానే ప్రచారం చేశారు. ఆయన చేసిన ప్రచారం సామాన్యులను సైతం ఆలోచింపజేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణ ఏర్పడ్డ ఇప్పటివరకు, కామారెడ్డి పట్టణంలో బిజెపికి గట్టిపట్టుంది, అయితే సింగిల్ డిజిట్ కే పరిమితమైంది. గతంలో 8 సభ్యులు బిజెపి కౌన్సిలర్ గెలవగా, ప్రస్తుతం16కు చేరింది 20 సభ్యులు కౌన్సిలర్ గా గెలుస్తామనుకున్న బిజెపి 16 తో సరిపెట్టుకుంది, కాంగ్రెస్ పార్టీ బోల్తా పడింది. అధికార కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి మున్సిపాలిటీ కైవసం చేసుకుంటుందని కాంగ్రెస్ నాయకులు భావించినప్పటికీ వర్గపోరు కొంపముంచింది. ఇటు బిజెపికి, అటు బిఆర్ఎస్ పార్టీకి లాభం చేకూర్చేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు కృషి చేశారు. టిఆర్ఎస్ పార్టీకి 11 స్థానాలు దక్కాయి, 3 స్థానాలు స్వతంత్ర సభ్యులు గెలుపొందారు. కింగ్ మేకర్ గా భారత రాష్ట్ర సమితి ఏర్పడింది. బి ఆర్ఎస్ పార్టీ సపోర్ట్ లేకుండా కామారెడ్డి మున్సిపల్ ను కైవసం చేసుకోవడం ఈరుపాటిలకు వీలు కాదు? బిఆర్ఎస్ సహాయం తప్పని సరి! కామారెడ్డి మున్సిపాలిటీ పై మొదటిసారిగా బిజెపి జెండా ఎగురుతుందా? ఏమైనా రాజకీయాలు జరుగుతాయా? అనేది పలు అనుమానాలకు తావిస్తుంది.? బిజెపి నాయకత్వం, కాంగ్రెస్ నాయకత్వం, బి ఆర్ఎస్ నాయకత్వం హోరా హోరి ప్రచారం నిర్వహించినప్పటికీ ఏ ఒక్కరికి పూర్తిస్థాయి మెజార్టీ లభించలేదు. కాంగ్రెస్, టీఆర్ఎస్ బలం తగ్గితే, బిజెపి బలం రెండింతలు పెరిగింది. కామారెడ్డి మున్సిపాలిటీ పై తొలిసారిగా బీజేపీ జెండా ఎగురు ఉందా? అవునని సంకేతాలు ఉన్నాయి? కామారెడ్డి మున్సిపాలిటీలో పాగావేయాలని జనసేన పార్టీ 9 స్థానాల్లో పోటీ చేసింది. జనసేన పార్టీ ఖాతా తెలవలేదు. బిజెపి గెలువాల్సిన సీట్లలో జనసేన రూపంలో తగ్గాయి. సిపిఎం పార్టీ మూడు స్థానంలో పోటీ చేసి ఖాతా తెరవలేదు. గెలిచే అభ్యర్థులకు గట్టి పోటీని ఇచ్చింది. ఏదేమైనప్పటికీ కామారెడ్డి బల్దియా పై జెండా ఏ పార్టీ ఎగురవేస్తుందనేది, రాజకీయాలు ఎలా మారుతాయి అనేది చూడాల్సి ఉంది.!

కమలానిదే హవా ... అయినా దక్కని మేయర్ పీఠం

- ప్రజాపాలనకు పట్టం కట్టిన నగర ప్రజలు
- ఎంఐఎం మద్దతుతో మేయర్ పీఠంపై కాంగ్రెస్ ?
- కాంగ్రెస్ మేయర్ అభ్యర్థి ఓటమి
- బీజేపీ 28 కాంగ్రెస్ 18 ఎంఐఎం 13 బీఆర్ఎస్ 1

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 13 : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లో బీజేపీ ఈసారి తన సత్తా చాటింది. వరుసగా రెండవసారి 28 సీట్లు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. మేయర్ పీఠంపై కన్నేసిన బీజేపీ ఈసారి మన ఇందూర్ మన మేయర్ అనే నినాదంతో ఎన్నికల బరిలో నిలిచింది. ఈ నినాదం తమకు బాగా కలిసి వస్తుందని నమ్మకం పెట్టుకున్న కమల దళం రెండు అడుగుల దూరంలో నిలిచిపోయింది. కాగా, కాంగ్రెస్ ప్రజాపాలనకు పట్టం కట్టిన నగర ప్రజలు 18 సీట్లు గెలిపించారు. ఎంఐఎం ఒంటరిగానే పోటి చేసి 13 స్థానాల్లో గెలిచి మేయర్ ఎన్నికలో ఆ పార్టీ కీలకంగా మారింది. ఇక వరుసగా రెండుసార్లు మేయర్ పదవి దక్కించుకున్న బీఆర్ఎస్ పార్టీ ఒక్క స్థానంతోనే సరిపెట్టుకుంది. గతంలో కాంగ్రెస్ పార్టీకి 2 సీట్లు రాగా, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిజామాబాద్ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని వారంరోజులు ఇక్కడే మకాం వేసి బీజేపీకి ఎక్కువ సీట్లు రాకుండా పార్టీ కార్యకర్తలను, నాయకులను పురామయించి పనిచేయించారు. దాంతో కాంగ్రెస్ 18 సీట్లు రాబట్టగలిగింది. కానీ, కాంగ్రెస్ పార్టీ తరపున మేయర్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన సమంతా రెడ్డి ఓటమిపాలయ్యారు. ఈమె 19 వ డివిజన్లు పోటీ చేసింది. ఈమె గెలుపు కొరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా కృషి చేసినప్పటికీ ఇక్కడ బిజెపి అభ్యర్థి నాగోల్ల లక్ష్మీనారాయణ గెలిచారు. అలాగే బిజెపి పార్టీ తరపున మేయర్ అభ్యర్థిగా బరిలో నిలిచిన శ్రవంతి రెడ్డి ఆరో డివిజన్ నుండి గెలుపొందారు. వాస్తవానికి స్రవంతి రెడ్డి ఆరో డివిజన్ కు చెందిన వారు కాకున్నా రిజర్వేషన్ల ఖరారులో భాగంగా ఈమె ఆరో డివిజన్ కు వచ్చి పోటీ చేసి గెలుపొందారు.

బీజేపీకి గతంలో వచ్చిన ఫలితాలే ...

బీజేపీకి గత ఎన్నికలో వచ్చిన ఫలితాలే ఈసారి వచ్చాయి. గతంలో 28 సీట్లు దక్కించుకుని అధికారం వచ్చినట్లే వచ్చి చేజారి పోయింది. దాంతో ఈసారి ఎన్నికల్లో మేయర్ పదవి దక్కించుకునేందుకు మ్యాజిక్ ఫిగర్ 31 సీట్ల కంటే ఎక్కువ సీట్లు గెలుచుకుని ఒంటరిగానే మేయర్ పదవి దక్కించుకోవాలని తీవ్రంగా కృషి చేసింది. నిజామాబాద్ మేయర్ పదవి దక్కించుకునేందుకు జిల్లా ఎంపీ అరవింద్ అన్ని తానై నడిపించారు. సీట్ల కేటాయింపు మొదలుకుని జోరుగా ప్రచారం నిర్వహించారు. అయినప్పటికి మేయర్ పదవికి రెండు అడుగుల దూరంలో నిలిచిపోయారు. దాంతో ఎంపీ కల నెరవేరకుండా పోయింది.

బోధన్ లో .... బోధన్ మున్సిపాలిటిలో మొత్తం 38 వార్డులు ఉండగా 18 వార్డులలో కాంగ్రెస్, 12 వార్డులలో ఎంఐఎం, బీజేపీ 3, బీఆర్ఎస్ 4 స్థానాలు దక్కించుకున్నారు.

ఆర్మూర్ లో ..మొత్తం 36 వార్డులు ఉండగా కాంగ్రెస్ 19, బీఆర్ఎస్ 5, బీజేపీ 8, ఇతరులు 4 స్థానాల్లో గెలుపొందారు.|

భీంగల్ లో ..జిల్లాలోని భీంగల్ మున్సిపాలిటీలో మొత్తం 12 వార్డులు ఉండగా కాంగ్రెస్ పార్టీ 8 వార్డులను గెలుచుకుంది. మిగిలిన నాలుగు వార్డులను బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. ఇక్కడ బీజేపీకి ఒక్క సీటు దక్కక పోవటం గమనార్హం.

చైన్ స్నాచింగ్ ఘటనలో వేగంగా స్పందించిన పోలీసులు

- నిందితుల అరెస్ట్, రిమాండ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 13: మెదక్ జిల్లా టేక్మాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ ఘటనలో నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టేక్మాల్ ఎస్ఐ అరవింద్ వెల్లడించారు. వివరాల ప్రకారం తంప్లూర్ గ్రామానికి చెందిన శ్యామల అనే మహిళ పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా, గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును అపహరించి అక్కడి నుండి పరారయ్యారు. బాధితురాలు వెంటనే టేక్మాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, సమాచార సేకరణ ఆధారంగా నిందితులైన పాపయ్య, పోచయ్య గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి దొంగిలించిన మూడు తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు. బంగారం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో చైన్ స్నాచింగ్ ఘటనలు అధికమవుతున్నాయని ఎస్ఐ అరవింద్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా ప్రయాణించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్

- కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ కొనసాగిన ఓట్ల లెక్కింపు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 13 : మున్సిపల్ ఎన్నికలలో కీలకమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిజామాబాద్ జిల్లాలో ప్రశాంతంగా కొనసాగింది. జిల్లాలోని నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు ఆర్మూర్, బోధన్, భీంగల్ మున్సిపాలిటీల పరిధిలో పోలైన ఓట్లను సంబంధిత కౌంటింగ్ కేంద్రాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ శుక్రవారం లెక్కింపు జరిపారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కౌంటింగ్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కొనసాగగా, బోధన్ మున్సిపల్ కౌంటింగ్ విజయ మేరీ హైస్కూల్ లో, ఆర్మూర్ మున్సిపల్ ఓట్ల లెక్కింపు ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, భీంగల్ మున్సిపాలిటీ ఓట్లను భీంగల్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కొనసాగింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి నేతృత్వంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, ఎన్నికల అబ్జర్వర్ సీహెచ్. సత్యనారాయణ రెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇతర జిల్లా అధికారులు కౌంటింగ్ ప్రక్రియను నిశిత పర్యవేక్షణ జరిపారు. ఉదయం 7.00 గంటల నుండే కౌంటింగ్ కోసం సన్నాహాలు చేపట్టారు. ఎన్నికల పరిశీలకులు, అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో కలెక్టర్ నేతృత్వంలో కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ నిర్వహించి, ఆ జాబితా ప్రకారంగా సిబ్బందిని ఆయా టేబుళ్ల వద్ద ఓట్ల లెక్కింపు బాధ్యతలు కేటాయించారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించిన మీదట, స్ట్రాంగ్ రూమ్ ల నుంచి క్రమ సంఖ్యలో బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాళ్లకు తరలించి, ఓట్లను లెక్కిస్తూ రౌండ్ల వారీగా ఫలితాలను వెల్లడించారు. ముందస్తుగానే టేబుళ్ల వారీగా కౌంటింగ్ సూపర్వైజర్లు, సహాయకులు, సూక్ష్మ పరిశీలకులతో పాటు స్ట్రాంగ్ రూంల నుండి వెంటదివెంట బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాళ్లకు తరలించేలా అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తూ, జాగ్రత్తగా ఓట్ల లెక్కింపు జరుపుతూ ఫలితాలు వెల్లడించారు. మధ్యాహ్నం సమయానికే జిల్లాలోని బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల ఓట్ల లెక్కింపు పూర్తవగా, అత్యధికంగా 60 డివిజన్లు కలిగి ఉండడం వల్ల నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కౌంటింగ్ ప్రక్రియ సాయంత్రం వరకు కూడా కొనసాగింది. అన్ని అంశాలను సరిచూసుకున్న మీదట రిటర్నింగ్ అధికారులు ఒక్కో రౌండ్ వారీగా ఫలితాలను వెల్లడించారు. గెలుపొందిన అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కాగా, కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఇతర ఉన్నతాధికారులు కౌంటింగ్ కేంద్రాలను సందర్శిస్తూ, ఓట్ల లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించారు. కౌంటింగ్ కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాలలో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి, నిషేధాజ్ఞలు అమలు చేశారు. కౌంటింగ్ కేంద్రం లోనికి ఇతరులెవరిని అనుమతించలేదు. కౌంటింగ్ సిబ్బందితో పాటు వివిధ బాధ్యతలు నిర్వర్తించిన సిబ్బందికి ఎంట్రీ పాసులు జారీ చేసినప్పటికీ, వారిని సైతం క్షుణ్ణంగా తనిఖీలు చేసి కౌంటింగ్ విధులకు పంపించారు. సెల్ ఫోన్ లు, వీడియోలు, కెమెరాలను నిషేధించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కౌంటింగ్ ప్రక్రియ సందర్భంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ట్రాన్స్కో సిబ్బంది చర్యలు తీసుకున్నారు. పకడ్బందీ ఏర్పాట్ల నడుమ అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో పూర్తి పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను జరిపించారు.

తూప్రాన్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ విజయ కేతనం

ప్రత్యక్షం, చేగుంట, ఫిబ్రవరి 13: మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీలో భారత రాష్ట్ర సమితి విజయకేతనం ఎగురవేసింది. తూప్రాన్ మున్సిపాలిటీలో 16 కౌన్సిలర్ల స్థానాలు ఉండగా తొమ్మిది టీఆర్ఎస్ పార్టీ నాలుగు కాంగ్రెస్ బిజెపి మూడు స్థానాలను గెలుచుకుంది. టిఆర్ఎస్ పార్టీ నుండి బొంది రజిని, బైరం సత్యలింగం, రాథోడ్ జైపాల్, చెలిమెల ప్రియాంక, కొక్కొండ సమత, బొడ్డు రా,ధా బుల్లిబోయిన ఐలయ్య, ఉంద్రాతి లక్ష్మి, చెలిమిల రాములు గెలుపొందారు. బీజేపీ పార్టీ నుండి చందా అశోక్, మన్నె స్వామి, బొల్లిం సత్యనారాయణ ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ నుండి మునిగారి సప్న, దుర్గం సవిత, బొడ్డు జోష్న, కొడిప్యాక అన్నపూర్ణ విజయం సాధించారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు కౌంటింగ్ కేంద్రాలను అడిషనల్ ఎస్పీ మహేందర్ అలాగే తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి పోలీస్ శాఖ అధికారులు పరిశీలించారు.

ప్రపంచ వృద్ధిని ఇండియా నడిపిస్తోంది. ట్రేడ్ డీల్స్‌పై చాలా చర్చ జరుగుతోంది. 2014కు ముందు ఇలాంటి ఒప్పందాలు జరిగాయా? ధనికుడు పేద అమ్మాయిని వివాహం చేసుకుంటాడా? స్కామ్‌లు, మోసాలు, గందరగోళం ఉన్నప్పుడు దేశాన్ని ఎలా నమ్ముతారు? కానీ నేటి భారతం ఆత్మవిశ్వాసంతో ప్రపంచంతో పోటీ పడటానికి సిద్ధంగా ఉంది. ప్రభుత్వ విధానం, సామర్థ్యంలో మార్పు వచ్చింది.

- పీఎం నరేంద్ర మోడీ

ప్రాంతీయం

రామాయంపేట మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 13: రామాయంపేట పట్టణంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 12 వార్డుల కోసం జరిగిన పోటీ ముగిసింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కౌంటింగ్ ప్రకారం 8 వార్డులు గెలిచి మెజార్టీ సాధించింది. వార్డుల వారీగా గెలిచిన అభ్యర్థులు ఇలా ఉన్నారు: 1వ వార్డు గజవాడ లావణ్య, 3వ వార్డు రవి, 4వ వార్డు బైరం స్వప్న, 6వ వార్డు పుట్టి సందీప్, 7వ వార్డు గజవాడ నాగరాజు, 9వ వార్డు దేవుని రంజిత్, 11వ వార్డు డాకి శ్యామల, 12వ వార్డు పోచమ్మల నవనీత గణేష్. భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ 3 వార్డులు గెలిచింది. 2వ వార్డు కొక్కుల ప్రవీణ్, 5వ వార్డు చౌదరి చరిత, 10వ వార్డు మద్దెల మాధవి విజేతలుగా నిలిచారు. భారత జనతా పార్టీ (బీజేపీ) 8వ వార్డులో జంగంపల్లి శంకర్ గెలిచి ఒకసారి గెలుపు సాధించింది. ఈ విధంగా, రామాయంపేట మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 12 వార్డులలో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యాన్ని కొనసాగించింది, బిఆర్ఎస్ పార్టీ మూడు వార్డులు మరియు బీజేపీ ఒక వార్డు మాత్రమే గెలిచింది.

మెదక్ మున్సిపల్ ఎన్నికల్లో హోరాహోరీ పోరు

- **15 స్థానాల్లో బి ఆర్ ఎస్ పార్టీ, 14 స్థానాల్లో కాంగ్రెస్ విజయం**

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 13: మెదక్ మున్సిపల్ ఎన్నికలు ఉత్కంఠభరిత వాతావరణంలో ముగిశాయి. మొత్తం 32 వార్డులకు గాను 32వ వార్డు ఏకగ్రీవంగా ఎన్నిక అయింది. మిగిలిన 31 వార్డుల ఓట్ల లెక్కింపు శుక్రవారం స్థానిక వెస్లీ స్కూల్‌లో కట్టుదిట్టమైన పోలీసు భద్రత మధ్య నిర్వహించబడింది. ఎన్నికల అధికారి రాహుల్ రాజా, జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు పర్యవేక్షణలో ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. మొత్తం ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ 13 వార్డుల్లో గెలుపొందడం , 32వ వార్డులో ఏకగ్రీవ విజయం సాధించి మొత్తం 14 స్థానాలు కైవసం చేసుకుంది. భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) 15 వార్డుల్లో విజయం సాధించింది. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 2, బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఒక వార్డులో గెలిచాయి. ఈ ఎన్నికల్లో ముఖ్యంగా తల్లి-కొడుకు వ్యూహం విజయవంతమైంది. 14వ వార్డు నుండి దొంతి లక్ష్మీ గౌడ్, 15వ వార్డు నుండి దొంతి నరేష్ గౌడ్ ఇద్దరూ కాంగ్రెస్ తరపున గెలుపొందడం స్థానిక ప్రజల్లో సంతోషాన్నిపంచింది. ముఖ్యంగా, 6వ వార్డు కే. హరిత ఒక్క ఓటు తేడాతో గెలవడం, బీఆర్ఎస్ యువ నాయకుడు జీవన్ రావు ఓటమి కావడం గమనార్హం. అలాగే, 17వ వార్డులో బీఎస్పీ తరపున గెలిచిన బుజరంపేట అరుణ ఫలితాల వెంటనే రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం ప్రత్యేకంగా ఆకర్షణీయంగా నిలిచింది. దీనితో కాంగ్రెస్ బలం మరింత పెరిగింది. తీవ్రమైన పోటీ వార్డు వారీగా కొనసాగింది. కొంతమంది కీలక అభ్యర్థులు ఒక్క ఓటు తేడాతో గెలిచినా, కొంతమంది భారీ మెజార్టీతో విజయం సాధించడం ఈ ఎన్నికల్లో చమత్కారంగా నిలిచింది. చివరగా, 32వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి మానస ఏకగ్రీవంగా గెలవడం తో మెదక్ మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ స్థాయిలో గణనీయమైన పరిణామం ఏర్పడింది. ఈ ఫలితాలతో మెదక్ పట్టణంలో కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య సమీకరణం కొత్తగా ఏర్పడింది. బీజేపీ మరియు బీఎస్పీ కూడా కొన్ని కీలక వార్డుల్లో తమ ప్రభావాన్ని చూపించడంతో, స్థానిక రాజకీయాల్లో ఆసక్తికరమైన పరిణామాలు కొనసాగుతూనే ఉన్నాయి.

దుబ్బాక గడ్డ బీఆర్ఎస్ అడ్డా

- **ఈ విజయం కేసీఆర్ కు అంకితం**
- **దుబ్బాక అభివృద్ధికి కట్టుబడి ఉంటాం**
- **ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**

ప్రతిపక్షం, దుబ్బాక, ఫిబ్రవరి 13: అధికారంలో ఉన్నా లేకున్నా దుబ్బాక గడ్డ బీఆర్ఎస్ అడ్డా అని మరోసారి మున్సిపల్ ఎన్నికల్లో నిరూపించుకోవడం జరిగిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దుబ్బాక మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 11 స్థానాల్లో జయకేతనం ఎగురవేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. దుబ్బాక తో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కి ఎంతో అవినాభావ సంబంధం ఉందని, ఈ విజయం కేసీఆర్ కి అంకితం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దుబ్బాక మున్సిపాలిటీలో కాంగ్రెస్, బిజెపిలు ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినప్పటికీ ప్రజలు బిఆర్ ఎస్ వైపు నిలిచి 11 స్థానాలు కట్టబెట్టడంపై ఆయన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. బిఆర్ఎస్ నుంచి ముగ్గురు రెబల్ అభ్యర్థులు కూడా విజయం సాధించారని, వారిని కలుపుకొని ముందుకు సాగుతామన్నారు. అధికారంలో లేనప్పటికీ బి ఆర్ ఎస్ పార్టీ మీద విశ్వాసంతో ఓట్లు వేసిన దుబ్బాక ప్రజలకు అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటామన్నారు. గెలిచిన కాంగ్రెస్, బిజెపి కౌన్సిలర్లతో పాటు ఎన్నికల్లో ఓటమి చెందిన అభ్యర్థులతో కలిసి రాజకీయాలకు అతీతంగా దుబ్బాక అభివృద్ధి కోసం ముందుకు సాగుతామన్నారు. ఎన్నికలు అయిపోయాయి ఇక రాజకీయాలతో పనిలేదని, పట్టణ అభివృద్ధి కోసం ముందుకు సాగుదామని ఆయన కోరారు. ఇటీవల సర్పంచ్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకోవడం జరిగిందని, అదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీ ఎన్నికల్లో గణనీయమైన స్థానాలు సాధించడం జరిగిందన్నారు. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ గుండవెల్లి ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

ఏడుపాయల జాతర పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- **భక్తులకు అసౌకర్యకం కలుగకుండా చర్యలు చేపట్టాలి**
- **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.**

ప్రతిపక్షం, మెదక్ టౌన్, ఫిబ్రవరి 13: ఏడుపాయల జాతరలో భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని, జాతర పెండింగ్ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఏడుపాయల జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భక్తులకు అసౌకర్యకలవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్, త్రాగునీరు, పార్కింగ్ పార్కింగ్, సంస్కృతిక కార్యక్రమాలు, దర్శన ఏర్పాట్లు ,ఇతర పెండింగ్లో ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సంవత్సరం జాతరకు దాదాపు పది లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి జాతరను ప్రశాంతంగా ముగించాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వీరేశం, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లాలో 3 బీఆర్ఎస్, 1 కాంగ్రెస్

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 13: సిద్దిపేట జిల్లాలో మూడు పాలిటీలలో బీఆర్ఎస్ పార్టీ, ఒక మున్సిపాలిటీలో కాంగ్రెస్ మెజారిటీ వార్డులను గెలుచుకున్నాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో కాంగ్రెస్ పార్టీ, గజ్వేల్, చేర్యాల దుబ్బాక మునిసిపాలిటీలలో బీఆర్ఎస్ పార్టీ ఆధిక్యం సాధించింది

హుస్నాబాద్ లో కాంగ్రెస్

హుస్నాబాద్ మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మొత్తం 20 వార్డులకు 16 వార్డులలో కాంగ్రెస్ అభ్యర్థులు, నాలుగు వార్డులలో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచారు. బీజేపీ ఒక్క వార్డులో కూడా గెలవలేదు.

1 వ వార్డు నుంచి అనూష (కాంగ్రెస్), 2 వ వార్డులో బూరుగు లత (కాంగ్రెస్), 3 వ వార్డులో కొండ రజిత (కాంగ్రెస్), 4 వ వార్డులో పిల్లి తిరుపతి (కాంగ్రెస్) 5 వ వార్డులో బొలిశెట్టి రాజు (కాంగ్రెస్) 6 వ వార్డులో భుక్య సంపత్ నాయక్ (కాంగ్రెస్),7 వ వార్డులో చిత్తారి పద్మ (కాంగ్రెస్),8 వ వార్డులో కేశవేణి రజిత (కాంగ్రెస్), 9 వ వార్డులో గడిపే సంపత్ (బీఆర్ఎస్) 10 వ వార్డు నుంచి సావుల మంజుల (కాంగ్రెస్) విజయం సాధించారు. 11వ వార్డులో పూదరి వరప్రసాద్(కాంగ్రెస్),12 వ వార్డు: కేశవేణి రమేష్ (కాంగ్రెస్),13 వ వార్డులో బొల్లి శ్రీనివాస్(బీఆర్ఎస్),14 వ వార్డు నుంచి దండి లక్ష్మీ (కాంగ్రెస్),15 వ వార్డులో ఆకుల రజిత(కాంగ్రెస్),16 వ వార్డులో వైద్యం కిరణ్(కాంగ్రెస్),17 వ వార్డు నుంచి: గాదెపాక రవి(బీఆర్ఎస్), 18 వ వార్డులో వాల సుప్రజ(బీఆర్ఎస్), 19 వ వార్డులో బత్తుల స్వరూప(కాంగ్రెస్), 20 వ వార్డు నుంచి గోపగోని శోభన్ (కాంగ్రెస్) జయకేతనం ఎగుర వేశారు.

చేర్యాలలో బీఆర్ఎస్

చేర్యాల మున్సిపాలిటీ బీఆర్ఎస్ మెజారిటీ వార్డులను గెలుచుకుంది. మొత్తం 12 వార్డులకు బీఆర్ఎస్ పార్టీ 7 వార్డుల్లో విజయం సాధించగా, కాంగ్రెస్ పార్టీ 5 వార్డుల్లో గెలుపొందింది. వార్డు వారీగా గెలుపొందిన అభ్యర్థుల వివరాలు...

1వ వార్డులో ఒగ్గు వెంకటమ్మ (కాంగ్రెస్) 140 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2వ వార్డులో కమలాపురం గీతాంజలి (బీఆర్ఎస్) 223 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 3వ వార్డులో కొమ్ము రాజేశ్వరి (కాంగ్రెస్) 450 ఓట్ల మెజార్టీ సాధించారు. 4వ వార్డులో నిమ్మ సుప్రజ (బీఆర్ఎస్) 391 ఓట్ల మెజార్టీ పొందారు. 5వ వార్డులో వెలుగల దుర్గయ్య (కాంగ్రెస్) 339 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 6వ వార్డులో ముస్త్యాల అరుణ (బీఆర్ఎస్) 145 ఓట్ల మెజార్టీతో గెలిచారు. 7 వ వార్డులో పోతు గంటి ప్రసాద్ (కాంగ్రెస్) 317 ఓట్ల మెజార్టీ, 8వ వార్డులో బుదారి సురేష్(బీఆర్ఎస్) 392 ఓట్ల మెజార్టీ,9వ వార్డులో వీరబత్తిని సదానందం (బీఆర్ఎస్) 337 ఓట్ల మెజార్టీ సాధించారు. 10వ వార్డులో మేడిశెట్టి ఉమ(బీఆర్ఎస్) 153 ఓట్ల మెజార్టీ, 11వ వార్డులో ఎండి ఇజాజ్ (బీఆర్ఎస్) 145 ఓట్ల మెజార్టీ, 12వ వార్డులో ఎండి షరీఫా (కాంగ్రెస్) 52 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

బీఆర్ఎస్ దే దుబ్బాక

దుబ్బాక మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ సగానికి కంటే ఎక్కువ వార్డులను కైవసం చేసుకున్నది. మొత్తం 20 వార్డులకు బీఆర్ఎస్ పార్టీ 10 వార్డుల్లో స్పష్టమైన ఆధిక్యంసాధించింది. మరో వార్డులో బీఆర్ఎస్ పార్టీ, బీజేపీ అభ్యర్థులకు సమాన సంఖ్యలో ఓట్లు రావడంతో టాస్ ద్వారా విజేతను నిర్ణయించారు. టాస్ ద్వారా బీఆర్ఎస్ పార్టీ గెలిచింది. దీంతో మొత్తం 11 వార్డులను బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ నాలుగు వార్డుల్లో, బీజేపీ రెండు వార్డుల్లో, ఏఐఎఫ్‌బీ 1, స్వతంత్రులు 2 స్థానాలు దక్కించుకున్నారు. 1వ వార్డులో కోటగిరి రమ్య (బీఆర్ఎస్) 241 ఆధిక్యంతో, 2వ వార్డులో గంబీర్‌పూర్ కనకరాజు (బీజేపీ) 369 ఓట్లతో విజయం సాధించారు. 3వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి కంకణాలఎల్లవ్వ, బీజేపీ అభ్యర్థి సత్తు శ్రీలతలకు సమాన సంఖ్యలో 266 చొప్పున ఓట్లు వచ్చాయి. దీంతో అధికారులు టాస్ వేసి విజేతను నిర్ణయించారు. టాస్ ద్వారా బీఆర్ఎస్ అభ్యర్థి కంకణాల ఎల్లవ్వ విజయం సాధించారు. 4వ వార్డులో అధికం బాలకిషన్ గౌడ్ (బీఆర్ఎస్) 23 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 5వ వార్డులో కోల నిరోషా (బీఆర్ఎస్) 121 ఓట్ల ఆధిక్యంలో విజయం సాధించారు.

6వ వార్డులో మూర్తి సంధ్య శ్రీనివాస్ రెడ్డి (బీఆర్ఎస్) 143 ఓట్ల మెజారిటీ సాధించగా, 7వ వార్డులో గోవిందగారి శోభారాణి (బీఆర్ఎస్) 304 ఓట్లతో గెలుపొందారు. 8వ వార్డులో మెరుపుల సాయి కుమార్ (బీజేపీ) 151 ఓట్లతో విజయం సాధించారు. 9వ వార్డులో వనం రమేష్ (బీఆర్ఎస్) 14 ఓట్ల ఆధిక్యంలో గెలుపొందారు.10 వ వార్డులో తెలంగాణ జాగృతి బలపరిచిన బదుగు రాజు (ఏఐఎఫ్‌బీ) 103 ఓట్లతో గెలుపొందడం విశేషం. 11వ వార్డులో నందాల శ్రీకాంత్ (స్వతంత్ర) 76 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 12వ వార్డులో బండి శ్రీలేఖ (బీఆర్ఎస్) 101 ఓట్లతో గెలుపొందగా, 13వ వార్డులో ఆస సులోచన (బీఆర్ఎస్) 39 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 14వ వార్డులో తునికి సురేష్(కాంగ్రెస్) 196 ఓట్లతో, 15వ వార్డులో అనంతల భాగ్యమ్మ (కాంగ్రెస్) 74 ఓట్ల ఆధిక్యంలో గెలుపొందారు. 17వ వార్డులో మహమ్మద్ చాంద్ మియా (స్వతంత్ర) 169 ఓట్లతో విజయం సాధించారు. 18వ వార్డులో శ్రీరాం సరస్వతి నరేందర్ (కాంగ్రెస్) 170 ఓట్లతో గెలుపొందారు. 19వ వార్డులో శ్రీరామ్ సంగీత రవీందర్ (బీఆర్ఎస్) 172 ఓట్లతో విజయం సాధించగా, 20వ వార్డులో ఐరేణి అఖిల సాయితేజ (కాంగ్రెస్) 171 ఓట్లతో గెలుపొందారు.

కేసీఆర్ వెంటే గజ్వేల్

మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రాతినిత్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గ కేంద్రమైన గజ్వేల్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించింది. ఇక్కడ మొత్తం 20 వార్డులకు 11 వార్డులలో బీ ఆర్ ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఏడు వార్డుల్లో వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులు, ఒక వార్డులో బీజేపీ అభ్యర్థి గెలిచారు, స్వతంత్ర అభ్యర్థి ఒక వార్డులో విజయం సాధించారు.

సిద్ధిపేటలో కాంగ్రెస్ సంబరాలు

- **మునిసిపల్ ఎన్నికల్లో విజయంపై హర్షం**

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 13: మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు మరోసారి మద్దతు తెలపడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ సాకి ఆనంద్ మాట్లాడారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విశ్వాసం ఉంచారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్ వద్ద అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. అత్తు ఇమామ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. .ఈ కార్యక్రమంలో షాబుద్దీన్, గరిపల్లి రాములు, బర్మా రామచంద్రం, గ్యాదరి మధు, గయాసుద్దీన్, అర్షద్ హుస్సేన్, బైరిసాయ్, విజయ్ డానియల్, ఆయుబ్ లడ్డు, పార్షి, నజ్జు, శ్రీనివాస్ రెడ్డి, ఫయాజ్, అద్నాన్, వరుణ్, రాజిరెడ్డి, సలీం, మున్నా, రవితేజ, ఆరీఫ్, అఖిల్, అజ్జు, విశాల్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుబ్బాక మున్సిపాలిటీ పీఠం బీఆర్ఎస్ కైవసం

- **రెండో సారి మున్సిపాలిటీ పీఠం దక్కించుకున్న బీఆర్ఎస్.**
- **20 వార్డులలో బీఆర్ఎస్ 11,కాంగ్రెస్ 4, బీజేపీ 2, ఏఐఫ్ బీ 1, ఇండిపెండెంట్ 2 విజయం సాధించారు.**

ప్రతిపక్షం, దుబ్బాక, ఫిబ్రవరి 13: దుబ్బాక మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో బీఆర్ఎస్ పార్టీ పార్టీ ఘనవిజయం సాధించింది. రెండోసారి బీఆర్ఎస్ పార్టీకే మున్సిపల్ పట్టణ ప్రజలు పట్టం కట్టారు. మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డులు ఉండగా మూడు పార్టీలకు గాను హోరాహోరీ ప్రచారం నిర్వహించినప్పటికీ బీఆర్ఎస్ 11, కాంగ్రెస్ 04,బీజేపీ 02, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ 1, ఇండిపెండెంట్ 2 అభ్యర్థులు గెలుపొందారు. మొదటి రౌండ్ లోనే బిఆర్ఎస్ పార్టీ బోణి కొట్టింది. 1 వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి కోటగల్ల రమ్య సమీప అభ్యర్థి పై 238 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2 వ వార్డుకు చెందిన బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థి గంభీర్ పూర్ కనకరాజు సమీప 369 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 3 వ వార్డులో బిజెపి పార్టీ, బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు సమానంగా 266 ఓట్లు రావడంతో అధికారులు రెండుసార్లు రీకౌంటింగ్ చేసిన ఫలితం మారకపోవడంతో చివరకు లక్కీ డ్రా తీయడంతో లక్కీ డ్రా లో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కంకణాల ఎల్లవ్వ కు అదృష్టం పలికింది. 4 వ వార్డు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అధికం బాలకిషన్ గౌడ్ 374 ఓట్లతో గెలుపొందారు. 5 వ వార్డు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నిరోషా వెంకట్ స్వామి సమీప అభ్యర్థి పై 121 మెజార్టీతో మెజార్టీతో గెలుపొందారు. 6 వ వార్డు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మూర్తి సంధ్యారాణి శ్రీనివాస్ రెడ్డి 420 ఓట్లతో గెలుపొందారు. 7 వ వార్డు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గోవింద్ గారి శోభారాణి విష్ణువర్ధన్ రెడ్డి 512 ఓట్ల తో గెలుపొందారు. 8 వ వార్డు బీజేపీ పార్టీ బలపరిచిన అభ్యర్థి మెరుపుల సాయికుమార్ గౌడ్ 355 ఓట్లతో గెలుపొందారు. 9 వ వార్డు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వనం రమేష్ 274 ఓట్లతో విజయం సాధించారు. 10 వ వార్డు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ బలపరిచిన అభ్యర్థి బదుగు రాజు 476 ఓట్లతో గెలుపొందారు. 11 వ వార్డు స్వతంత్ర అభ్యర్థి నందాల శ్రీకాంత్ 432 ఓట్లతో గెలుపొందారు, 12 వ వార్డు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బండి శ్రీలేఖ,రాజు 406 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 13 వ వార్డు బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఆస సులోచన స్వామి 348 ఓట్లతో గెలుపొందారు. 14 వ వార్డు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి తునికి సురేష్ 471 ఓట్లతో గెలుపొందారు. 15 వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అనంతుల భాగ్యమ్మ శ్రీనివాస్ 379 ఓట్లతో గెలుపొందారు, 16 వ వార్డు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దేవుని రాజు 395 ఓట్లతో విజయం సాధించాడు. 17 వ వార్డు స్వతంత్ర అభ్యర్థ అయిన చాంద్ మీయ 420 ఓట్లతో గెలుపొందారు. 18 వ వార్డు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి శ్రీరామ్ సరస్వతి నరేందర్ 420 మెజార్టీతో గెలుపొందారు. 19 వ వార్డు బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి శ్రీ రాం సంగీత రవీందర్ 410 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 20 వ వార్డు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఐరేని అఖిల సాయి తేజ 392 ఓట్లతో విజయం సాధించారు.

సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకుంటోంది కాంగ్రెస్

- **మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు**

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 13: సిద్దిపేట అభివృద్ధి పై కాంగ్రెస్ ప్రభుత్వం పగబట్టిందని, బిఆర్ఎస్ హయాంలో మంజూరైన నిధులను వెనక్కి తీసుకెళ్లి పనులను అడ్డుకుంటోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. సిద్దిపేట పట్టణంలోని రెడ్డి సంక్షేమ భవన్‌లో బీజేపీ నుంచి పలువురు యువకులు ఆయన సమక్షంలో భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ... సిద్దిపేట అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఉద్యమ పార్టీగా బిఆర్ఎస్‌ను ఇక్కడే ప్రారంభించుకున్నామని, ఆ తరువాత ఉద్యమాన్ని మలుపు తిప్పిన చరిత్ర సిద్దిపేటదేనని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం కోసం 1530 రోజులపాటు నిరవధిక దీక్ష నిర్వహించామని గుర్తు చేశారు. సిద్దిపేటలో మహానగరాల్లో లేని వసతులు కల్పించామని, యూజీడీ, రింగ్ రోడ్, వాటర్ రింగ్ మెయిన్, పవర్ రింగ్ మెయిన్ వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేశామని తెలిపారు. తాగునీటి సమస్య లేకుండా మల్లన్నసాగర్, ఎల్ఎండీ నుంచి నీరు తీసుకువచ్చామని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రింగ్ మెయిన్ నిర్మించామని చెప్పారు. బిఆర్ఎస్ హయాంలో సిద్దిపేటకు రైలు కల సాకారం చేసుకున్నామని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైల్వే పనులు ఆపేసిందని ఆరోపించారు. త్వరలోనే సిద్దిపేట నుంచి ఉత్తర భారతదేశానికి ప్రత్యక్ష ప్రయాణ సౌకర్యం కల్పించేలా కృషి చేస్తానని తెలిపారు. జిల్లాగా సిద్దిపేట 1985లోనే జిల్లా హోదా కోసం వినతిపత్రం ఇచ్చినప్పటికీ సాధ్యం కాలేదని, చివరకు ఇచ్చిన చేతులతోనే జిల్లా ఏర్పాటు చేసుకున్నామని పేర్కొన్నారు. నాలుగు దిక్కుల నాలుగు పాలిటెక్నిక్ కళాశాలలు, విద్యాలయాలు, రిజర్వాయర్లు, దేవాలయాలతో సిద్దిపేట ఖిల్లాగా మారిందన్నారు. సిద్దిపేటకు మంజూరైన వెటర్నరీ కళాశాలను రేవంత్ రెడ్డి కొడంగల్‌కు తరలించారని ఆరోపించారు. మంజూరైన నిధులను తిరిగి తీసుకెళ్లారని, తగిన సమయం వచ్చినప్పుడు వాటిని మళ్లీ సిద్దిపేటకు తీసుకొస్తామని స్పష్టం చేశారు. సిద్దిపేట ప్రజల ప్రేమ, నమ్మకమే తన బలమని, సహాయం కోసం ఎవరొచ్చినా కాదనకుండా చేస్తానని తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం వచ్చే నాయకులను నమ్మి ప్రజలు మోసపోవద్దని హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల నాయకులు, అధికారులు సిద్దిపేట అభివృద్ధిని అధ్యయనం చేసేందుకు వస్తున్నారని, సిద్దిపేటకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని హరీశ్ రావు పేర్కొన్నారు. సిద్దిపేటను అందరి సహకారంతో మరింత అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు.

రాబోయే రోజుల్లో నాకు మంత్రి పదవి వస్తుంది. ఇచ్చిన మాట ప్రకారం పదవి ఇవ్వాలి. లేదంటే ముఖ్యమంత్రిని అవుతా. మీరు మునుగోడును చూసుకోండి.. నేను తెలంగాణను చూసుకుంటా.

-చౌటుప్పల్ విజయోత్సవ ర్యాలీలో రాజగోపాల్ రెడ్డి

తారిఖ్ రహ్మాన్‌కు ప్రధాని ఫోన్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: బంగ్లాదేశ్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన బీఎన్‌పీ నేత తారిఖ్ రహ్మాన్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్‌లో మాట్లాడారు. పార్లమెంటరీ ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యంలో రహ్మాన్‌ను అభినందించారు. రెండు దేశాల ప్రజల శాంతి, పురోగతి, శ్రేయస్సు పట్ల భారత్ నిబద్ధతతో ఉందని ఎక్స్ వేదికగా చెప్పారు. ''తారిక్ రెహమాన్‌తో మాట్లాడటం ఆనందంగా ఉంది. బంగ్లాదేశ్ ఎన్నికల్లో ఆయన సాధించిన అద్భుతమైన విజయంపై ఆయనకు అభినందనలు తెలిపాను. బంగ్లాదేశ్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి ఆయన చేసిన ప్రయత్నంలో నా శుభాకాంక్షలు, మద్దతును చెప్పాను. చాలా లోతైన చారిత్రక, సాంస్కృతిక సంబంధాలు కలిగిన రెండు దేశాల ప్రజల శాంతి, పురోగతి, శ్రేయస్సు పట్ల భారత్ నిబద్ధతతో ఉంది.'' అని పేర్కొన్నారు. బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల తీర్పును గుర్తించినందుకు భారత ప్రధాని మోదీకి బీఎన్‌పీ శుక్రవారం కృతజ్ఞతలు తెలిపింది. ఈ విజయంతో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, 2026 ఎన్నికలకు చీఫ్ కోఆర్డినేటర్ నజ్రుల్ ఇస్లాం ఖాన్ మీడియాతో మాట్లాడారు. మరోవైపు, బంగ్లా పార్లమెంటరీ ఎన్నికల్లో విజయం సాధించినందుకు బీఎన్పీని కాంగ్రెస్ అభినందించింది. బంగ్లాదేశ్ ప్రాంత స్థిరత్వం, శాంతి కోసం భారత మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే అన్నారు. 2024 చెలరేగిన హింసాత్మక ఘటనల అనంతరం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ బీఎన్పీ విజయం సాధించిందని ఆయన పేర్కొన్నారు.

విశ్వ వీక్షణం

AFP

బంగ్లాదేశ్‌లో బీఎన్పీ విజయఢంకా

- 211 స్థానాల్లో గెలుపు
- ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధమన్న తారిఖ్ రెహ్మాన్

ఢాకా: బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో ఖలిదా జియా కుమారుడు తారిఖ్ రెహ్మాన్ పార్టీ బీఎన్పీ విజయఢంకా మోగించింది. బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) కూటమి భారీ ఆధిక్యంతో ముందంజలో నిలిచింది. బీఎన్‌పీ నేతృత్వంలోని కూటమి 211 నియోజకవర్గాల్లో విజయం సాధించా ప్రభుత్వం ఏర్పాటుకు ముందుకు వచ్చింది. మెజారిటీకి అవసరమైన సగం మార్క్‌ను దాటే స్థాయిలో సీట్లు సాధించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మొత్తం 299 పార్లమెంటు స్థానాలకు జరిగిన పోలింగ్‌లో మిత్రపక్షాలతో కలిపి 211 స్థానాల్లో విజయం సాధించినట్లు పార్టీ ప్రకటించింది. ఈ క్రమంలో బీఎన్‌పీ ఛైర్‌పర్సన్ ఖాలిదా జియా కుమారుడైన తారిఖ్ రహ్మాన్ నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతున్నట్లు వెల్లడించింది. ఇక, జమాత్‌ఎఇస్లామీ పార్టీ 70 స్థానాల్లో విజయం సాధించింది. అధికారిక ఫలితాలను బంగ్లాదేశ్ ఎన్నికల కమిషన్ ప్రకటించనుంది. ఈసారి ఎన్నికల్లో బీఎన్‌పీ ఛైర్మన్ తారిఖ్ రహ్మాన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మాజీ ప్రధాని ఖాలిదా జియా కుమారుడైన ఆయన పోటీ చేసిన స్థానాల్లో ఘన విజయం సాధించినట్లు అనధికారిక సమాచారం. ముఖ్యంగా బోగురా6 (సదర్) నియోజకవర్గంలో ఆయన సమీప ప్రత్యర్థిపై భారీ మెజారిటీతో గెలుపొందినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. మొత్తం 151 పోలింగ్ కేంద్రాల్లో 150 కేంద్రాల లెక్కింపు పూర్తయ్యాకే విజయం ఖాయమైంది. అయితే ఈ విజయోత్సవాల మధ్య బీఎన్‌పీ శ్రేణుల్లో సంతాప వాతావరణం నెలకొంది. ఎన్నికలకు ముందు ఖాలిదా జియా మరణించడంతో తారిఖ్ రహ్మాన్ పార్టీ కార్యకర్తలకు సంబరాలు నిర్వహించవద్దని సూచించారు. శుక్రవారం జుమ్మా నమాజ్ అనంతరం ఖాలిదా జియా ఆత్మశాంతి కోసం ప్రార్థనలు చేయాలని పిలుపునిచ్చారు. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు గౌరవ సూచకంగా వేడుకలను వాయిదా వేశారు.

మణిపూర్‌లో మరోసారి చెలరేగిన హింస

- రెండు ఇండ్లు దహనం చేసిన ఆందోళనకారులు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: ఆందోళనలతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో మరోసారి హింస చెలరేగింది. గురువారం ఉఖ్రుల్ జిల్లాలోని, లిటన్ ఏరియాలో ఆందోళనకారులు రెండు ఇండ్లను తగలబెట్టారు. స్థానికంగా ఉన్న సరీఖాంగ్ గ్రామంలో గురువారం ఉదయం ఏడు గంటల సమయంలో ఈ హింసాత్మక ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. అంతకుముందు 24 గంటలపాటు మణిపూర్‌లో ప్రశాంత వాతావరణమే కొనసాగింది. కానీ, గురువారం తిరిగి హింస చెలరేగింది. ఒకవైపు కేంద్ర, రాష్ట్ర భద్రతా బలగాలు మోహరించి ఉన్నప్పటికీ కొన్ని చోట్ల ఆందోళనలు ఆగడం లేదు. మరోవైపు ఉదయం ఎనిమిది గంటల సమయంలో తుపాకీ కాల్పుల మోతలు కూడా వినిపించాయని పోలీసులు తెలిపారు. అయితే, ఎవరూ గాయపడటం లేదా మరణించడం వంటివి తమ దృష్టికి రాలేదన్నారు. తాజా హింసకు ఈ ప్రాంతంలోని రెండు వర్గాలకు చెందిన వారు మద్యం సేవించడమే కారణం. ఆదివారం రాత్రి తంకుల్ నాగా, కుకీ తెగలకు చెందిన వారు మద్యం మత్తులో గొడవపడ్డారు. సమీప గ్రామాలకు చెందిన ఈ రెండు వర్గాల వారి మధ్య చెలరేగిన ఘర్షణ తీవ్ర రూపం దాల్చింది. ఈ హింసలో ఇరు వర్గాలకు చెందిన 40 ఇండ్లను ఆందోళనకారులు దహనం చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు ఈ ప్రాంతంలో ఘర్షణలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా కర్ఫ్యూ విధించారు. లిటన్ ఏరియాతోపాటు జిల్లా మొత్తం ఇంటర్నెట్ తొలగించారు. అయినప్పటికీ కుకీ తెగకు చెందిన మహిళలు చురాచంద్‌పూర్ జిల్లాలో భారీ నిరసనలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఎల్‌ఎం ఖవుతే ప్రభుత్వంలో చేరడాన్ని వారు వ్యతిరేకిస్తున్నారు. ఇంకా అనేక చోట్ల నిరసనలు జరుగుతున్నాయి.

ఆరావళి పర్వతాల్ని తాకడానికి కూడా అనుమతించం

- హర్యారా ప్రభుత్వానికి సుప్రీం హెచ్చరిక

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: ఆరావళి పర్వతాల్ని తాకడానికి కూడా అనుమతించబోమని భారత సుప్రీం కోర్టు హెచ్చరించింది. ఆరావళి పర్వతాల పరిధిలో జూ సఫారి ఏర్పాటు చేయాలనే హర్యానా ప్రభుత్వ నిర్ణయాన్ని కోర్టు వ్యతిరేకించింది. అక్కడ ఎలాంటి చర్యలకు అనుమతించబోమని తేల్చిచెప్పింది. ఆరావళి పర్వాతాల పరిధిలో జూ సఫారి ఏర్పాటు చేయాలని హర్యానా ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని వ్యతిరేకిస్తూ 'పీపుల్స్ ఫర్ ఆరావళిస్' అనే స్వచ్ఛంద సంస్థ గత ఏడాది దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారణ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కోర్టు తాజా నిర్ణయం తీసుకుంది. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలితో కూడిన ధర్మాసనం తాజా వ్యాఖ్యలు చేసింది. ఆరావళి పరిధిలో, గుర్గావ్‌నుహ్ జిల్లాల పరిధిలోని అటవీ ప్రాంతంలో జూ సఫారి ఏర్పాటుపై కోర్టుకు హర్యానా ప్రభుత్వం డీపీఆర్ సమర్పించింది. అంతేకాదు.. గతంలో అనుకున్నట్లుగా 10,000 ఎకరాల్లో కాకుండా 3,300 ఎకరాల్లోనే పార్క్ ఏర్పాటు చేస్తామని కోర్టుకు తెలిపింది. ఇందుకు అనుమతివ్వాలని కోరింది. అయినప్పటికీ, తాము ఇప్పటికి అనుమతులు మాత్రం ఇవ్వబోమని కోర్టు చెప్పింది. ఆరావళిని తాకనివ్వబోమని తేల్చింది. అంతేకాదు.. ఈ అంశంపై ఉన్నతస్థాయి నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి, శాస్త్రీయ అంశాలతో పూర్తిస్థాయి నివేదిక అందిస్తే అప్పుడు పరిశీలిస్తామని కోర్టు వ్యాఖ్యానించింది.

ఈ రోజుల్లో మన సమాజంలో ఒక స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. పెళ్ళి అంటే నూరేళ్ల పంట, జీవితాంతం కలిసి ఉండాలి అని నమ్మిన మన తాతల కాలం నుండి మనం చాలా ముందుకు వచ్చేసాం. అయితే, దురదృష్టవశాత్తూ నేడు విడాకుల సంఖ్య బాగా పెరుగుతోంది. ఒక్కోసారి పెద్ద కారణాలు కూడా లేకుండానే, చిన్న చిన్న గొడవలతో జంటలు విడిపోతున్నారు. అసలు మన మధ్య ఈ మార్పు ఎందుకు వస్తోంది? దీని వెనుక ఉన్న లోతైన కారణాలేంటో ఒక్కసారి చూద్దాం.

నూరేళ్ల పంట నుండి తొందరపాటు నిర్ణయాల వరకు!! మారుతున్న వివాహ బంధాలు

డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ
9490754169

గతంలో మనకు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉండేది. ఇంట్లో తాతయ్యలు, నానమ్మలు, అత్తమామలు, ఇలా అందరూ కలిసి ఉండేవారు. కొత్తగా పెళ్ళైన జంటకు ఏవైనా సమస్యలు వస్తే, పెద్దలు సర్దిచెప్పేవారు. వారికంటూ ఒక భరోసా ఉండేది. కానీ ఇప్పుడు అంతా అణు కుటుంబాల (Nuclear families) కాలం. ఉద్యోగాల రీత్యా పట్టణాలకు వెళ్లడం, వ్యక్తిగత స్వేచ్ఛ కోరుకోవడంతో జంటలు ఒంటరిగా ఉంటున్నారు. దీనివల్ల సమస్య వచ్చినప్పుడు సలహా ఇచ్చే వారు లేక, ఒత్తిడి పెరిగి బంధాలు త్వరగా తెగిపోతున్నాయి. ఒకప్పుడు మహిళలు ఆర్థికంగా భర్తపైనే ఆధారపడేవారు. అందుకే ఇబ్బందులు ఎదురైనా, నచ్చకపోయినా సహించి ఉండేవారు. కానీ నేడు మహిళలు చదువుకుంటున్నారు, గొప్ప ఉద్యోగాలు చేస్తున్నారు. వారికి ఆర్థిక స్వయంప్రతిపత్తి ఉంది. ఇది ఖచ్చితంగా స్త్రీ సాధికారతకు గుర్తు. అయితే, దీనివల్ల అగౌరవంగా లేదా అసంతృప్తిగా ఉన్న చోట ఎందుకు భరించాలి? అనే ఆలోచన పెరిగింది. ఇది మంచిదే అయినా, కొన్నిసార్లు చిన్న సమస్యలకే ఓపిక నశించి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడానికి కూడా దారితీస్తోంది. నేటి కాలంలో మనకు అన్నీ వెంటనే అయిపోవాలి. ఇన్ స్టంట్ కాఫీ నుండి ఇంటర్నెట్ వరకు ఏదీ ఆలస్యం కాకూడదు. ఇదే మానసికత బంధాల్లో కూడా వచ్చేసింది. అవతలి వ్యక్తిని అర్థం చేసుకోవడానికి, సర్దుకుపోవడానికి ఎవరూ సమయం ఇవ్వడం లేదు. ఏవైనా సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించుకునే బదులు, బంధం నుండి బయటపడటమే సులభమని భావిస్తున్నారు.

ప్రయత్నలోపం.. పెరిగిన చేతులెత్తేసే ధోరణి

ఓపిక నశిస్తోంది, తొందరపాటు పెరుగుతోంది. ఈ రోజుల్లో ఏ చిన్న సమస్య వచ్చినా, దాన్ని కూర్చుని మాట్లాడుకుని పరిష్కరించుకుందామనే సహనం తగ్గిపోయింది. పెళ్ళి అంటే వేర్వేరు వాతావరణాల్లో పెరిగిన ఇద్దరు వ్యక్తులు కలిసే ప్రయాణం. కాబట్టి ఆలోచనలు, అలవాట్లు వేరుగా ఉండటం సహజం. వాటిని సర్దుబాటు చేసుకోవడానికి కాస్త సమయం పడుతుంది. కానీ, నేటి కాలంలో ఆ ప్రయత్నం చేసేలోపే ఇక మనవల్ల కాదు అని చేతులెత్తేసే ధోరణి ఎక్కువగా కనిపిస్తోంది. ఒకే ఇంట్లో ఉన్నా మాట్లాడుకోలేని దూరం సాంకేతికత పెరిగి ప్రపంచం దగ్గరైంది కానీ, మనుషుల మధ్య దూరం పెరిగింది. భార్యాభర్తలు ఒకే గదిలో ఉన్నా, ఎవరి ఫోన్లలో వారు మునిగిపోతున్నారు. ఒకరి కళ్లలోకి ఒకరు చూసి మాట్లాడుకునే సమయం కూడా ఉండటం లేదు. ఇలా మనసు విప్పి మాట్లాడుకోకపోవడం వల్లే చిన్నపాటి అపార్థాలు కూడా చిలికి చిలికి గాలివానలా మారుతున్నాయి.

ప్రతిరోజూ పండగలా ఉండదు

వినడం కంటే వాదించడమే ఎక్కువ చాలా మందికి తమ మాట నెగ్గాలనే తాపత్రయం ఉంటుంది తప్ప, అవతలి వారు ఏం చెబుతున్నారో వినే ఓపిక ఉండదు. భాగస్వామి కష్టాన్ని లేదా ఆవేదనను అర్థం చేసుకోవాలంటే ముందు వారు చెప్పేది శ్రద్ధగా వినాలి. ఆ లిజనింగ్ స్కిల్స్ లేకపోవడం వల్ల బంధాల్లో పెద్ద అగాధం ఏర్పడుతోంది. సోషల్ మీడియా మాయాజాలం వల్లసోషల్ మీడియా మన జీవితాల్లోకి వచ్చిన తర్వాత పోలికలు ఎక్కువయ్యాయి. ఇన్స్టాగ్రామ్లో పక్కవాళ్లు పెట్టిన పర్ఫెక్ట్ ఫోటోలు చూసి, మన జీవితం ఎందుకు ఇలా లేదు అని బాధపడటం



మనసు విప్పి మాట్లాడుకోండి

రోజులో కనీసం కొద్దిసేపైనా ఫోన్లు పక్కన పెట్టి మాట్లాడుకోవాలి. మీ భావాలను, సమస్యలను పంచుకోవడం వల్ల అపార్థాలు తగ్గుతాయి. అంచనాలు తగ్గించుకోండి, భాగస్వామి పర్ఫెక్ట్ గా ఉండాలని కోరుకోవడం కంటే, వారిలో ఉన్న చిన్న చిన్న లోపాలను అంగీకరించడం నేర్చుకోవాలి. కౌన్సలింగ్ తీసుకోవడానికి వెనుకాడకండి, సమస్యలు చేయి దాటుతున్నాయని అనిపిస్తే ప్రొఫెషనల్ కౌన్సెలర్లను కలవండి. ఇది సిగ్గుపడాల్సిన విషయం కాదు, మన బంధాన్ని కాపాడుకునే ఒక ప్రయత్నం. గౌరవం & కృతజ్ఞత తో ఒకరి నిర్ణయాలకు ఒకరు విలువ ఇవ్వాలి. భాగస్వామి మన కోసం చేసే చిన్న చిన్న పనులను కూడా గుర్తించి కృతజ్ఞతలు చెప్పడం వల్ల బంధం బలపడుతుంది. ఆర్థిక పారదర్శకత గా ఉండండి డబ్బు విషయంలో ఒకరికొకరు అబద్ధాలు చెప్పకోకుండా, ఇంటి ఖర్చులు, పొదుపు గురించి కలిసి ప్లాన్ చేసుకోవాలి.

విడాకులు పెరగడం కచ్చితంగా ఆందోళన కలిగించే విషయమే. అయితే, హింస లేదా భరించలేని వేధింపులు ఉన్నప్పుడు విడిపోవడం తప్పు కాదు. కానీ, టీవీ రిమోట్ కోసమో, షాపింగ్ కు తీసుకువెళ్లలేదనో, ఇష్టమైన సినిమా చూపించలేదనో, హోటల్స్ కు తీసుకుపోలేదనో, ఇలా ఇగో సమస్యల కోసమో విడిపోవడం తెలివైన పని కాదు. పెళ్ళి అంటే కేవలం ఒక రోజు జరిగే వేడుక కాదు, అది జీవితాంతం కలిసి సాగాల్సిన ఒక ప్రయాణం. ఈ ప్రయాణంలో ఎత్తుపల్లాలు సహజం. యువత ఈ విషయాన్ని గుర్తించి, సహనంతో ఒకరినొకరు అర్థం చేసుకుంటేనే అందమైన కుటుంబాలు, ఆరోగ్యకరమైన సమాజం నిర్మించబడుతుంది. వివాహం అనేది రెండు హృదయాలను కలిపే ఒక పవిత్ర బంధం. దాన్ని ప్రేమతో కాపాడుకునే బాధ్యత ఆ ఇద్దరిదీ!

మొదలైంది. ఆ ఫోటోల వెనుక ఉన్న అసలు నిజాలు ఎవరికీ తెలియవు. అలాగే, పాత పరిచయాలు సోషల్ మీడియా ద్వారా మళ్ళీ మొదలవ్వడం వల్ల కొందరి జీవితాల్లో నమ్మకద్రోహం, అనుమానాలు పెరిగి ప్రశాంతత కరువవుతోంది. నిజమైన బంధం కంటే 'వర్చువల్ ప్రపంచానికే ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వడం వల్ల ఇంటి సభ్యుల మధ్య ప్రేమాభిమానాలు తగ్గుతున్నాయి. సినిమా అంచనాలు తో నిజ జీవిత సవాళ్లు ఈ రోజుల్లో జంటలకు పెళ్లి మీద అవాస్తవికమైన అంచనాలు పెరిగిపోతున్నాయి. సినిమాలు, సోషల్ మీడియా చూసి, జీవితం ఎప్పుడూ రొమాంటిక్గా, కలర్ఫుల్గా ఉండాలని ఆశిస్తున్నారు. కానీ నిజానికి పెళ్లి అంటే కేవలం ఆనందమే కాదు, అదొక బాధ్యత. ప్రతిరోజూ పండగలా ఉండదు, కొన్నిసార్లు విసుగు, మరికొన్నిసార్లు చిన్న చిన్న గొడవలు సహజం. ఈ వాస్తవాన్ని అంగీకరించలేక, చిన్న ఇబ్బంది రాగానే చాలామంది నిరాశకు గురవుతున్నారు.

వ్యక్తిగత స్వేచ్ఛ మీద పెరిగిన మక్కువ

నేను నుంచి మనం వైపు, చదువు, పాశ్చాత్య సంస్కృతి వల్ల మనకు వ్యక్తిగత స్వేచ్ఛ మీద మక్కువ పెరిగింది. ఇది మంచిదే, కానీ పెళ్లిలో నేను కంటే మనం అనే భావన ముఖ్యం. కొందరు పెళ్లయ్యాక కూడా భాగస్వామితో సంబంధం లేకుండా తమ ఇష్టం వచ్చినట్లు ఉండాలనుకుంటారు. భాగస్వామిని సంప్రదించకుండా నిర్ణయాలు తీసుకోవడం వల్ల అవతలి వారికి తాము నిర్లక్ష్యానికి గురవుతున్నామనే భావన కలుగుతుంది. స్వేచ్ఛ ఉండాలి, కానీ అది అవతలి వారిని దూరం చేసేలా ఉండకూడదు. కుటుంబాల మద్దతు ఆలోచిస్తే ఇప్పటికి ఒకప్పుడు ఇంట్లో ఏ సమస్య వచ్చినా పెద్దలు సర్దిచెప్పేవారు. కానీ ఇప్పుడు అణు కుటుంబాల్లో ఆ మద్దతు కరువైంది. పోనీ ఎవరైనా పెద్దలు సలహా ఇద్దామన్నా, అది ఒక్కోసారి మేలు కంటే కీడే ఎక్కువ చేస్తోంది. అత్తాకోడళ్ల గొడవలు లాంటి పాత సమస్యలే కొత్త రూపంలో ఎదురవుతున్నాయి. వీటిని బ్యాలెన్స్ చేసే పెద్దరికం ఇప్పుడు తగ్గిపోయింది. పెళ్లి విషయం లో తొందరపాటు నిర్ణయాలవల్ల కేవలం ఆకర్షణను చూసి, ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకోకుండానే పెళ్లి పీటలెక్కిస్తున్నారు. ప్రేమలో ఉన్నప్పుడు అన్నీ అందంగానే కనిపిస్తాయి, కానీ పెళ్లయ్యాక అసలు బాధ్యతలు మొదలవుతాయి. ఆర్థిక ఇబ్బందులు, వ్యక్తిగత అలవాట్లు, కుటుంబ బాధ్యతలు ఎదురైనప్పుడు.. ముందే ఒకరి గురించి ఒకరు తెలియకపోతే ఆ బంధం నిలబడటం కష్టమవుతోంది. బయటి ఒత్తిడి, ఇంట్లో అసహనం ఈ రోజుల్లో మనందరి జీవితాలు ఉరుకుల పరుగులమయమైపోయాయి. ఆఫీసు టెన్షన్లు, ఆర్థిక ఇబ్బందులు, ఒకరితో ఒకరి పోటీ, ఇవన్నీ మనల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దురదృష్టవశాత్తు, బయట కలిగే ఆ కోపాన్ని, చిరాకును మనం తెలియకుండానే ఇంటికి మోసుకొస్తున్నాం. అది భాగస్వామిపై విసుగులా, నిర్లక్ష్యంలా మారి ఇద్దరి మధ్య దూరాన్ని పెంచుతోంది. దీనివల్ల బంధాలు దారి తప్పుతున్నాయి, నమ్మకం లేని చోట బంధం నిలబడదు. నేటి కాలంలో సోషల్ మీడియా లేదా ఆఫీస్ వాతావరణం వల్ల ఇతర వ్యక్తులతో పరిచయాలు పెరగడం సులభమైపోయింది. ఇంట్లో సరైన ప్రేమ, గుర్తింపు దొరకనప్పుడు కొందరు బయటి వ్యక్తుల వైపు ఆకర్షితులవుతున్నారు. కానీ అవిశ్వాసం అనేది ఏ కారణం చేతనైనా సమర్థించలేనిది. అది ఒక్కసారి మొదలైతే, ఆ బంధం కూలిపోవడానికి ఎంతో సమయం పట్టదు.

చిన్న విషయాలే, పెద్ద సమస్యలై!

ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే, ఈ మధ్య కాలంలో విడాకులకు దారితీస్తున్నవి పెద్ద పెద్ద గొడవలు కాదు, చాలా చిన్న చిన్న అలవాట్లు. ఉదాహరణకు, వంటలో రుచి గురించి గొడవలు. గదిని సర్దుకోవడం లేదా శుభ్రత విషయంలో భిన్నాభిప్రాయాలు. టీవీ రిమోట్ ఎవరి దగ్గర ఉండాలి? ఏ సినిమా చూడాలి? ఎక్కువ సేపు ఫోన్ వాడుతున్నారని గొడవ పడటం. డబ్బులు ఎలా ఖర్చు పెట్టాలనే విషయంలో పంతాలు. ఒకప్పుడు వీటిని ఒక నవ్వుతో పక్కన పెట్టేవాళ్ళం. కానీ ఇప్పుడు ఇవే ఇగో (Ego) సమస్యలుగా మారి, కోర్టు గుమ్మం వరకు తీసుకెళ్తున్నాయి. విడిపోవడం అనేది కేవలం ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన విషయం మాత్రమే కాదు, అది ఒక వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తుంది పిల్లల పరిస్థితి చూస్తే విడాకుల వల్ల ఎక్కువగా నలిగిపోయేది పిల్లలే. తమ కళ్ళ ముందే అమ్మానాన్నలు విడిపోతుంటే వారి మనస్సు ముక్కలవుతుంది. అది వారి చదువుపై, భవిష్యత్తులో వారు ఏర్పరచుకోబోయే బంధాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీనికి తోడు ఆర్థిక భారం, కలిసి ఉన్నప్పుడు సులభంగా సాగే సంసారం, విడిపోయాక ఒక్కొక్కరికి భారంగా మారుతుంది. రెండు వేర్వేరు ఇళ్లు, పెరిగే ఖర్చులు ఆర్థికంగా కుంగదీస్తాయి. మానసిక క్షోభ పెరుగుతుంది, విడిపోయాక అందరూ హాయిగా ఉంటారని చెప్పలేం. ఒంటరితనం, గతం గుర్తొచ్చి బాధపడటం, భవిష్యత్తు గురించి భయం, ఇవన్నీ మనిషిని మానసిక రోగిగా మార్చే ప్రమాదం ఉంది. విడాకుల వల్ల కలిగే నష్టాలు కేవలం పిల్లలకో, ఆస్తులకో పరిమితం కావు. అది మనిషిని డిప్రెషన్ లోకి నెట్టేస్తుంది. మన సమాజం ఇంకా విడాకులను పూర్తిగా సహజంగా తీసుకోదు కాబట్టి, ముఖ్యంగా మహిళలకు ఇరుగుపొరుగు నుండి ఇబ్బందులు ఎదురవుతుంటాయి. అందుకే, విడిపోవడం కంటే బంధాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నించడం మిన్న. సంబంధం బలంగా ఉండాలంటే మనం చేయాల్సినవి పెళ్ళికి ముందే ఒకరినొకరు తెలుసుకోండి: ఆకర్షణలో పడి నిర్ణయం తీసుకోకుండా, ఒకరి అలవాట్లు, ఆశయాలు ఎంతవరకు కలుస్తాయో ముందే చర్చించుకోవాలి.

పాక్‌తో మ్యాచ్‌లో అభిషేక్ ఆడే అవకాశం

టీ20 వరల్డ్‌కప్‌లో ఆదివారం పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఆడే అవకాశాలు ఉన్నట్లు భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తెలిపాడు. కడుపు ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న అభిషేక్.. గురువారం నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో ఆడని విషయం తెలిసిందే. అయితే అభిషేక్ శర్మ ఆరోగ్యం ప్రస్తుతం బాగానే ఉన్నట్లు వరుణ్ చెప్పాడు. ఆరోగ్యం క్షీణించడం వల్ల రెండు రోజుల పాటు అభిషేక్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాడు. అభిషేక్‌తో మాట్లాడానని, అతను బాగానే ఉన్నాడని, ఇవాళ కొంత ప్రాక్టీస్ చేశాడని, సిద్ధం అవుతున్నట్లు అతను చెప్పాడని వరుణ్ చక్రవర్తి పేర్కొన్నాడు. నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తి రెండు ఓవర్లు వేసి 7 పరుగులిచ్చి మూడు వికెట్లు తీసుకున్నాడు. ఆ మ్యాచ్ టాస్ వేసిన సమయంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఒకటి లేదా రెండు మ్యాచ్‌లు అభిషేక్ శర్మ మిస్సయ్యే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్న విషయం తెలిసిందే. అభిషేక్ శర్మ గైర్హాజరీలో నమీబియాతో మ్యాచ్‌లో సంజూ శాంసన్ ఓపెనింగ్ బాధ్యతలు చేపట్టాడు. వరల్డ్‌కప్‌లో ఇండియా వరుసగా తన రెండో మ్యాచ్ నెగ్గింది. నమీబియాపై 93 రన్స్ తేడాతో నెగ్గింది. ఒకవేళ కొలంబోలో జరిగే ప్రాక్టీస్ సెషన్‌లో అభిషేక్ పాల్గొంటే అతను పాక్‌తో మ్యాచ్‌కు ఆడేది లేనిది తేలే అవకాశం ఉంటుంది. నెట్స్‌లో చాలా సమయం అతను బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయాల్సి ఉంటుంది. దాని ఆధారంగా ఇండోపాక్ మ్యాచ్‌పై క్లారిటీ వస్తుంది.

ఆస్ట్రేలియాపై జింబాబ్వే సంచలన విజయం

టీ20 వలర్డ్‌కప్ లో సంచలన నమోదు అయ్యింది. కొలంబోలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 23 రన్స్ తేడాతో జింబాంబే ఘన విజయం సాధించింది. జింబాబ్వే క్రికెటర్లు అద్భుతమైన ఆటను ప్రదర్శించారు. తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 169 రన్స్ చేసింది. జింబాబ్వే ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ అత్యధికంగా 64 రన్స్ స్కోరు చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో ఏడు ఫోర్లు ఉన్నాయి. జింబాబ్వే బ్యాటర్లలో మరుమని 35, ర్యాన్ బర్ల్ 35, సికందర్ రాజా 25 రన్స్ స్కోరు చేశారు. జింబాబ్వే 15 ఓవర్లలో వికెట్ నష్టానికి 125 రన్స్ చేసి భారీ స్కోరు దిశగా అడుగులు వేసింది. కానీ ఆసీస్ బౌలర్లు రాణించడంతో చివరి అయిదు ఓవర్లలో జింబాబ్వేకు 44 రన్స్ మాత్రమే వచ్చాయి. జింబాబ్వే విసిరిన టార్గెట్‌ను అందుకునే క్రమంలో ఆస్ట్రేలియా చేతులెత్తేసింది. అనూహ్య రీతిలో ఓటమిని ఎదుర్కొన్నది. 19.3 ఓవర్లలో 146 రన్స్ చేసి ఆలౌటైంది. ఆసీస్ బ్యాటర్లలో మాట్ రెన్‌షా 65, మ్యాక్స్‌వెల్ 31 రన్స్ చేశారు. జింబాబ్వే బౌలర్లలో ముజరబానీ 4, బ్రాడ్ ఇవాన్స్ 3 వికెట్లు తీసుకున్నారు. చేజింగ్‌లో కేవలం 29 రన్స్‌కే నాలుగు వికెట్లు కోల్పోయింది ఆస్ట్రేలియా.ఆ తర్వాత అయిదో వికెట్‌కు మ్యాక్స్‌వెల్, రెన్‌షా 77 రన్స్ జోడించారు. కానీ ఆసీస్ మేటి బ్యాటర్లు జట్టుకు విజయాన్ని అందించలేకపోయారు. 4 ఓవర్లలో 17 రన్స్ ఇచ్చి 4 వికెట్లు తీసుకున్న ముజరబానీ .. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. టీ20 క్రికెట్‌లో అతను వంద వికెట్ల తీసుకున్న బౌలర్‌గా నిలిచాడు.

టార్గెట్ ఛేదించిన యూఏఈ

- **కెనడాపై 5 వికెట్ల తేడాతో విజయం**

టీ20 ప్రపంచకప్‌లో యూఏఈ తొలి విజయం సాధించింది. శుక్రవారం కెనడాతో జరిగిన మ్యాచ్‌లో యూఏఈ 5 వికెట్ల తేడాతో నెగ్గింది. కెనడా నిర్దేశించిన 151 పరుగుల టార్గెట్‌ను యూఏఈ 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఆర్యన్ష్ శర్మ (74 పరుగులు), షోయబ్ ఖాన్ (51 పరుగులు) హాఫ్ సెంచరీలతో రాణించడంతో కెనడాకు ఓటమి తప్పలేదు. కెనడా బౌలర్లలో సాబ్ బిన్ 3, జస్కరన్ సింగ్, ఖలీమ్ సనా తలో 1 వికెట్ దక్కించుకున్నారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన కెనడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 150 పరుగులు చేసింది. హర్ష్ ఠాకర్ (50 పరుగులు), నవనీత్ ధలీవాల్ (34 పరుగులు) రాణించారు. యూఏఈ బౌలర్లలో జునైద్ సిద్దిఖ్ 5 వికెట్లతో ప్రత్యర్థి పతనం శాసించగా, మహ్మద్ జవాదుల్లాకు 1 వికెట్ దక్కింది.

బోణీ కొట్టిన యూఎస్‌ఏ-నెదర్లాండ్స్‌పై ఘన విజయం

టీ20 ప్రపంచ కప్ 2026లో యూఎస్‌ఏ బోణీ కొట్టింది. నెదర్లాండ్స్‌పై 93 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన యూఎస్‌ఏ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన నెదర్లాండ్స్ 15.5 ఓవర్లలో 103 పరుగులకే కుప్పకూలింది. బాస్ డి లీడే (23) టాప్ స్కోరర్. హర్మీత్ సింగ్ (4/21) దెబ్బకు నెదర్లాండ్స్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. హర్మీత్‌తోపాటు షాడ్లే 3, మోసిన్ 2, కెంజిగె ఒక వికెట్ తీశాడు. అంతర్జాతీయ టీ20ల్లో తొలిసారి నెదర్లాండ్స్‌ను అమెరికా ఓడించింది.

సాయితేజ, శుభమ్ దూకుడు

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన అమెరికాకు కెప్టెన్ మోనాంక్ పటేల్ (36), షయాన్ జహంగీర్ (20) వేగంగా పరుగులు చేసేందుకు ప్రయత్నించారు. సంజయ్ క్రిష్ణమూర్తి (1) విఫలం కాగా, సాయితేజ ముక్కామల (79), శుభమ్ రంజనె (48*) అమెరికా ఇన్నింగ్స్‌కు వెన్నెముకగా నిలిచారు. ఆఖరి ఓవర్లలో దూకుడుగా ఆడి జట్టు స్కోరును 190+ దాటించారు. ఇక నెదర్లాండ్స్ బౌలర్లలో బాస్ డి లీడే 3, వాన్ బీక్, కైల్, ఫ్రెడ్ క్లాసెన్ తలో వికెట్ పడగొట్టారు.

'విష్ణు విన్యాసం' నుంచి బ్యూటీఫుల్ లవ్ సాంగ్

శ్రీ విష్ణు 'విష్ణు విన్యాసం' అనే యూనిక్ ప్రాజెక్ట్‌తో అలరించబోతున్నారు. నూతన దర్శకుడు యదునాథ్ మారుతి రావు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.సుబ్రహ్మణ్యం నాయుడు జి, రామచారి ఎం సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ 'దేఖో విష్ణు విన్యాసం'కు మంచి రెస్పాన్స్ వచ్చింది. శుక్రవారం మేకర్స్ సెకండ్ సింగిల్ 'మొదలే మొదలే 'సాంగ్ రిలీజ్ చేశారు. సంగీత దర్శకుడు రధన్ ఈ సాంగ్ ని బ్యూటీఫుల్ లవ్ మెలోడీగా కంపోజ్ చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన సాహిత్యం లవ్ ఫీలింగ్ ని అందంగా ప్రజెంట్ చేసింది. మధుశ్రీ, నరేష్ అయ్యర్ వోకల్స్ మరింత మెలోడీని యాడ్ చేశాయి. ఈ సాంగ్ లో శ్రీ విష్ణు, నయన సారిక కెమిస్ట్రీ లవ్లీగా ఆకట్టుకుంది. వాలెంటైన్స్ డే కి పర్ఫెక్ట్ గిఫ్ట్ గా నిలిచే ఈ సాంగ్ ఇన్‌స్టంట్ హిట్ గా అలరిస్తోంది. ఈ చిత్రంలో సత్య, బ్రహ్మాజీ, ప్రవీణ్, మురళి శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, సత్యం రాజేష్, శ్రీనివాస్ వడ్లమాని, గోపరాజు రమణ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫీని అందించగా, ఎ. రమణాంజనేయులు ఆర్ట్ డైరెక్టర్, కార్తికేయన్ రోహిణి ఎడిటర్ ఈ చిత్రాన్ని త్వరలోనే థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

శివరామ్, అన్వీరా దేవి
రామ్ చరణ్ & ఉపాసన పిల్లలకు పేర్లు

- **అర్థాలను వివరిస్తూ నామకరణ వేడుక నుంచి ఒక ఆనందకరమైన క్షణాన్ని పంచుకున్న మెగాస్టార్ చిరంజీవి**

టాలీవుడ్ స్టార్ కపుల్ రామ్ చరణ్, ఉపాసన కొణిదెల జనవరి 31న కవలలకు జన్మనివ్వడంతో కుటుంబంలో ఆనందం రెట్టింపయ్యింది. వారి కుమార్తె క్లీంకారతో కలిసి ఇప్పుడు ముగ్గురు పిల్లలకు తల్లిదండ్రులయ్యారు. ఇటీవల జరిగిన సంప్రదాయ నామకరణ కార్యక్రమంలో రామ్ చరణ్ ఉపాసన తమ ట్విన్స్ పేర్లను ప్రకటించారు. ఆ పేర్లు ఆధ్యాత్మికతతో పాటు కుటుంబ గౌరవాన్ని ప్రతిబింబించేలా ఎంపిక చేశారు. మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియాలో ఈ పేర్ల అర్థాలను వివరిస్తూ, నామకరణ వేడుకలోని ఒక మధుర క్షణాన్ని పంచుకున్నారు. "అపారమైన ఆనందం, దైవ అనుగ్రహంతో మా చిన్నారుల అందమైన పేర్లను ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉంది 'శివరామ్ కొణిదెల ' & 'అన్వీరా దేవి కొణిదెల'. శివరామ్ అనే పేరు రెండు శాశ్వత విలువల కలయిక. 'శివ' అనేది శివ శంకర వరప్రసాద్ ప్రేరణతో, అంతర్ముఖ శక్తి, ఆధ్యాత్మిక లోతు, ప్రశాంతతను సూచిస్తుంది. 'రామ్' అనేది రామ్ చరణ్ నుండి తీసుకున్నది, ధర్మం, కరుణ, నైతిక ధైర్యానికి ప్రతీక. ఈ రెండు కలిసి అంతర్గత శక్తి, బాధ్యతాయుతమైన సమతౌల్యాన్ని సూచిస్తాయి. అన్వీరా దేవి దివ్యమైన స్త్రీశక్తికి ప్రతిరూపం. అన్వీరా అంటే నిర్భయత్వం, పట్టుదల, దైవ రక్షణ. కనకదుర్గ దేవి ఆశీస్సులతో ప్రేరణ పొందిన ఈ పేరు, సౌందర్యం, ధైర్యం, అచంచలమైన శక్తిని ప్రతిబింబిస్తుంది. 'శివరామ్, అన్వీరా దేవి జీవిత ప్రయాణం సంతోషంగా సాగాలని మీ ఆశీస్సులు కోరుకుంటున్నాం " అని ఆనందాన్ని వ్యక్తం చేశారు చిరంజీవి. వేడుకలో తీసిన ఫోటోలో రామ్ చరణ్ తన కుమార్తె క్లీంకారను ముద్దుగా ఎత్తుకుని, ఆమె ఆసక్తిగా జరుగుతున్న కార్యక్రమాన్ని చూస్తుండగా, ఉపాసన ప్రశాంతమైన చిరునవ్వుతో భర్త పక్కన కూర్చున్నారు. సంప్రదాయ దుస్తుల్లో సన్నిహిత కుటుంబ సభ్యులు పాల్గొని వేడుకను మరింత ఆనందభరితంగా మార్చారు. ఒక ట్విన్‌ను ఆప్యాయంగా ఎత్తుకున్న చిరంజీవి, ఉపాసన తండ్రి అనిల్ కామినేని పక్కన నిలుచుండగా, మరో బిడ్డను ప్రేమగా ఎత్తుకొని శోభన కామినేని కనిపించారు. సురేఖ కొణిదెల సహా కుటుంబ పెద్దల సమక్షంలో ఈ వేడుక అద్భుతంగా జరిగింది. కొణిదెల, కామినేని కుటుంబాల్లో కొత్త అధ్యాయాన్ని ఆరంభించిన చిన్నారులు శివ రామ్, అన్వీరా దేవి రాకతో మరింత ఆనందం, ఐక్యత, ఆశీర్వాదాలు చేరాయి.

ఫోకస్ 'తెలుగు'పైనే

టాలీవుడ్‌లో ఒక దశలో అత్యంత బిజీ హీరోయిన్‌గా కొనసాగిన పూజా హెగ్డే, భారీ పారితోషికం కారణంగా కూడా కొన్ని ప్రాజెక్టులు చేజార్చుకుందనే టాక్ ఇండస్ట్రీలో వినిపించింది. నిర్మాతలు ఖర్చులను కట్టడి చేయాలనుకున్న సమయంలో ఆమె రెమ్యునరేషన్ అడ్డంకిగా మారిందని అప్పట్లో ప్రచారం జరిగింది. అదే సమయంలో పూజా హీరోయిన్ గా నటించిన కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. ఈ పరిణామాలతో పూజాకు టాలీవుడ్‌లో గ్యాప్ ఏర్పడింది. తెలుగుపై దృష్టి పెట్టిన పూజా అయితే ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయి. తమిళం, హిందీ భాషల్లో సినిమాలు చేస్తూనే మంచి బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌లతో బిజీగా ఉన్నప్పటికీ, పూజా హెగ్డే దృష్టి మళ్లీ తెలుగుపైనే ఉందని సమాచారం. టాలీవుడ్‌లో తాను సంపాదించిన స్టార్‌డమ్, అభిమానుల ఆదరణ ఆమెకు ప్రత్యేకమని భావిస్తున్నపూజా, మళ్లీ ఇక్కడ స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వాలనే ఉద్దేశంతో కథల ఎంపికలో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200